ఆదివారం
27-10-2024
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 36
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

భారత శరణార్థులను తిప్పి పంపిన అమెరికా

వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికల వేళ అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. అక్రమ వలసల కట్టడికిగాను విదేశీ శరణార్థులను గుర్తించి వారిని వెనక్కి పంపింది. ఇదే క్రమంలో భారత్‌కు చెందిన అక్రమ చొరబాటుదారులను చార్టర్డ్ విమానంలో ఈనెల 22వ తేదీన భారత్‌కు డిపోర్ట్ చేసింది. ఈమేరకు హోంల్యాండ్ భద్రతా విభాగం ప్రకటన తెలిపింది. భారత ప్రభుత్వ సహకారంతో ఈ కార్యక్రమం జరిగినట్లు సీనియర్ అధికారి కేనెగల్లో తెలిపారు. అక్రమ చొరబాట్ల కట్టడికి... న్యాయమైన, సురక్షిత మార్గాల్లో ప్రవేశాన్ని ప్రోత్సహించేందుకు అమెరికా ఈ చర్యలు తీసుకుంటుంది. గతేడాది కొలంబియా, ఈక్వెడార్, పెరు, ఈజిప్టు, మారిషస్, సెనేగల్, ఉజ్బెకిస్థాన్, చైనా, భారత్‌కు చెందినవారిని హోంల్యాండ్ భద్రతా విభాగం డిపోర్ట్ చేసింది.

'ఇండియా' అభ్యర్థులకు కేజ్రీవాల్ ప్రచారం

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ 'ఆమ్ ఆద్మీ పార్టీ' కీలక నిర్ణయం తీసుకుంది. మహారాష్ట్రలో 'ఇండియా ఐక్యసంఘటన' అభ్యర్థుల తరపున ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం చేయనున్నారు. ఆప్ కార్యకర్తలు ఉన్న చోట్ల, ఎలాంటి వివాదాలు లేనటువంటి ఎంవీఏ అభ్యర్థుల తరపున ఆయన ప్రచారం చేయనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. మహారాష్ట్ర ఎన్నికలకు 'ఆప్' దూరంగా ఉండగా, మహా వికాస్ అఘాడీ తరపున ప్రచారంలో కేజ్రీవాల్ పాల్గొంటారని

- మిగతా 2 లో

'ఒకే పోలీస్ విధానం' అమలు

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలో ఏక్ పోలీస్ విధానం కోసం ఆందోళనలు కొనసాగుతున్నాయి. నిన్నటివరకు బెటాలియన్ పోలీసుల కుటుంబ సభ్యులు రోడ్లపై నిరసన వ్యక్తం చేయగా, ఇప్పుడు కానిస్టేబుళ్లు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. రేవంత్ సర్కార్ అసమర్థ విధానాలపై కన్నెర్ర చేశారు. వరంగల్‌లోని మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో ఆందోళనకు దిగారు. బెటాలియన్ కమాండెంట్ ఆఫీస్ ముందు బైఠాయించారు. ఒకే పోలీస్ విధానం అమలు

- మిగతా 2 లో

విశాఖ- విజయవాడకు విమాన సర్వీసులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విశాఖపట్నం నుంచి విజయవాడ (గన్నవరం)కు మరో రెండు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఇండిగో, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు ఆదివారం నుంచి ఈ సర్వీసులను నడపనున్నాయి. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు వీటిని ప్రారంభించనున్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం రాత్రి 7.15 గంటలకు బయలుదేరి 8.20కు విశాఖ

- మిగతా 2 లో

మళ్లీ రోడ్డెక్కిన రైతులు

పంజాబ్ రైతుల ఆందోళన

ధాన్యం కొనుగోలులో జాప్యం... ఇతర సమస్యలపై నిరసనలు

నాలుగు జిల్లాల్లో రహదారుల దిగ్బంధం

ఫగ్వారా: ధాన్యం సేకరణలో జాప్యం, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అన్నదాతలు మరోసారి రోడ్డెక్కారు. కిసాన్ మజ్దూర్ మోర్చా అధ్వర్యంలో రైతులు శనివారం పంజాబ్‌లోని కొన్నిచోట్ల రహదారులను దిగ్బంధించారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే నిరవధిక దిగ్బంధం కొనసాగిస్తామని హెచ్చరించారు. సంగ్రూర్‌లోని సంగ్రూర్-భటిండా జాతీయ రహదారిపై బదరుఖాన్, మోగాలోని మోగా-ఫిరోజ్‌పూర్ జాతీయ రహదారిపై దగ్రు, గురుదాస్‌పూర్‌లోని గురుదాసొర్-తాండా జాతీయ రహదారిపై సటియాలీ ఫుల్, బటాలా రైల్వే స్టేషన్ వద్ద నిరసనలు చేపట్టినట్లు రైతు నాయకులు తెలిపారు. ఫగ్వారాలో రైతులు ఇప్పటికే అమృత్‌సర్-ఢిల్లీ జాతీయ రహదారిపై చాలా రోజులుగా నిరసనలు చేస్తున్నారు. వరి కొనుగోళ్లలో ఆలస్యానికి వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల దిగ్బంధనం చేసిన ఒక రోజు తర్వాత శనివారం ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. రైతు సమస్యలను పరిష్కరించాలని కేఎంఎం నేత సర్వన్‌సింగ్ పంధేర్ ప్రధాని మోదీని కోరారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి మా 'ఫరియాద్' (ఉద్వేగభరితమైన విజ్ఞప్తి) వినండి' అని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఫగ్వారా, బటాలా, సంగ్రూర్, మోగా జిల్లాల్లో తమ నిరసనలు నిరవధికంగా ఉంటాయని పంధేర్ చెప్పారు. హైబ్రిడ్ వరి వంగడాలకు క్వింటాల్‌కు 67 కిలోల బియ్యం మాత్రమే లభిస్తున్నాయని ఆరోపిస్తున్న రైస్ మిల్లర్లతో కేంద్రం ఎలాంటి ఒప్పందం కుదుర్చుకోవడం లేదని, పంజాబ్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడం లేదని ఆయన అన్నారు. రైతులపై క్వింటాల్‌కు 10 కిలోల కోత విధిస్తున్నట్లు ఆయన విమర్శించారు. 'వరి ఎత్తడం లేదా సరిగ్గా సేకరించడం లేదు. గోదుమలు, బంగాళాదుంపలు, పెసలు వంటి కొత్త

- మిగతా 2 లో

మెట్రో రైలు మార్గాల విస్తరణ

- రెవెన్యూ డివిజన్‌గా ఏటూరు నాగారం
- రాష్ట్ర మంత్రి మండలి కీలక నిర్ణయాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: మెట్రో రైలు మార్గాల విస్తరణకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. నాగోల్-ఎల్బీనగర్-హయత్‌నగర్, ఎల్బీనగర్ - శంషాబాద్ విమానాశ్రయం వరకు మెట్రో విస్తరణకు ఆమోదం తెలిపింది.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కేబినెట్ సమావేశం శనివారం సచివాలయంలో జరిగింది. దాదాపు నాలుగు గంటలకుపైగా కొనసాగిన సమావేశంలో పలు కీలక అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏటూరు నాగారంను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తూ కేబినెట్ తీర్మానం చేసింది. సమ్మక్క సారలమ్మ గిరిజన వర్సిటీకి 211 ఎకరాలు అప్పగించడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. మూసీ పునరుజ్జీవంపై, నిర్వాసితులకు సహాయంపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ధరణి పోర్టల్ పేరును 'భూమాత'గా మార్చడానికి కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ధరణిలో రైతుల హక్కులపై ఏర్పడే సమస్యల పరిష్కారానికి అప్పిలేట్ అథారిటీని ఏర్పాటు చేయడానికి ఈ చట్టంపై చర్చించింది. మూసీ పునరుజ్జీవ చర్యలు, హైడ్రా, 317 జీవో, ఉద్యోగుల డీఏలు, ధాన్యం కొనుగోళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ తదితర అంశాలపై కేబినెట్ సమావేశం చర్చించినట్లు తెలుస్తోంది.

భాగ్యనగర అభివృద్ధిపై విషప్రచారం

- మూసీ నిర్వాసితులకు సకల సౌకర్యాలతో టవర్లు
- వడ్డీలేని రుణాలు... చిన్నతరహా పరిశ్రమలతో ఉపాధి
- నెరెడ్కో ప్రాపర్టీ షోలో డిప్యూటీ సీఎం భట్టి

విశాలాంధ్ర-హైదరాబాద్: భాగ్యనగరంలో జరుగుతున్న అభివృద్ధిపై కొన్ని నెలలుగా కావాలనే కొందరు విష ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. హైటెక్స్‌లో శనివారం నెరెడ్కో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోలో భట్టి మాట్లాడుతూ హైదరాబాద్ నగర అభివృద్ధికి పదివేల కోట్లు కేటాయించామని, ఇది కేవలం పెట్టుబడి ఖర్చు మాత్రమే అని వివరించారు. మంచినీటి ఎద్దడి లేకుండా గోదావరి, కృష్ణ ,మంజీరా నదుల నుంచి తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. కాలుష్యకారక డ్రైనేజీలను శుద్ధి పరిచేందుకు 39 ఎస్టీపీలు మంజూరు చేశామని, మూసీ నిర్వాసితులకు అద్భుతమైన జీవితాన్ని ఇవ్వాలని సీఎం ఆలోచనతో ఉన్నారని పేర్కొన్నారు. మూసీ నిర్వాసితులకు అక్కడే అద్భుతమైన టవర్స్ నిర్మించి వారు సకల సౌకర్యాలతో ఉండేలా ఏర్పాట్లు

- మిగతా 2 లో

కార్యకర్తలకు పెద్దపీట: చంద్రబాబు

వర్చువల్‌గా టీడీపీ సభ్యత్వం ప్రారంభం

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ప్రారంభించారు. 2024-26 సంబంధించి చేపట్టిన సభ్యత్వ నమోదును పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి కేంద్ర కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ చేతుల మీదుగా మొట్టమొదటి సభ్యత్వాన్ని చంద్రబాబు స్వీకరించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సభ్యత్వ నమోదు కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సభ్యత్వం వల్ల సమాజంలో కార్యకర్తలు, నాయకులకు గౌరవం, గుర్తింపు ఉంటుందని అన్నారు. కార్యకర్తలు పెద్ద పీట వేసి వారి భాగస్వామ్యంతో కమిటీలను ఎంపిక చేసి యువతను ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాలకు కూడా రాజకీయ అవకాశాలను కల్పించిన పార్టీ అన్నారు. నారా లోకేశ్ ప్రధాన కార్యదర్శి అయిన తరువాత కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. బీమా రూ.5 లక్షలకు పెంచినట్టు చెప్పారు.నాలుగు దశాబ్దాల ప్రస్థానంలో ఎన్నో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని నిలబడ్డామన్నారు. పోలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ... సభ్యత్వ నమోదు సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించడానికి మూల పురుషుడు లోకేశ్ అన్నారు. తెలంగాణ సమన్వయకర్త, జాతీయ ప్రధాన కార్యదర్శి కంభంపాటి రామమోహన్‌రావు మాట్లాడుతూ... ఆనవాయితీగా రెండు సంవత్సరాలకు ఒకసారి సభ్యత్వ నమోదు చేస్తున్నామన్నారు. జాతీయ అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి మాట్లాడుతూ... పార్టీకి పునరంకితమై పూర్వవైభవం తీసుకురావాలని అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు అండమాన్ నికోబార్ దీవులలో వర్చువల్‌గా ప్రారంభించారు. జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న, రాష్ట్ర నాయకురాలు కాట్రగడ్డ ప్రసూన, బండి పుల్లయ్య, సామ భూపాల్ రెడ్డి, వాసిరెడ్డి రామనాథం, టీజీకే మూర్తి, అజ్మీరా రాజునాయక్, గడ్డి పద్మావతి, కూరపాటి వెంకటేశ్వర్లు, జీవీజీ నాయుడు, షేక్ ఆరిఫ్, బేతు జగదీష్ రెడ్డి, నెల్లూరి దుర్గాప్రసాద్, మ్యాడం రామేశ్వర్ రావు, శ్రీనివాసా నాయుడు, డా.ఎ.ఎస్.రావు, ప్రకాష్ రెడ్డి, శ్రీపతి సతీష్‌కుమార్, పోలంపల్లి అశోక్, ఎం.కె. బోస్, పర్లపల్లి రవీందర్, హరికృష్ణ, గజేంద్ర గౌడ్, కె.గోపి, జయరామ్‌చందర్, ముంజా వెంకట్రాజం గౌడ్, వెలివెల దుర్గారావు, పిన్నమనేని సాయిబాబా, పైడి గోపాల్ రెడ్డి, కుందారపు కృష్ణా చారి, కొండపల్లి రాంచందర్‌రావు, కందికంటి అశోక్‌కుమార్ గౌడ్, ఇల్లెందుల రమేష్, యాదా గౌడ్, సంజయ్, కసిరెడ్డి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



కొల్లేరు కబ్జా ఆపండి

ఆక్వా మాఫియాను అడ్డుకోండి

చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు నారాయణ లేఖ

న్యూఢిల్లీ: కొల్లేరులో ఆక్వా మాఫియా ఆగడాలకు తక్షణమే అడ్డుకట్ట వేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. కొల్లేరు సరస్సు తడి భూములు, పక్షి అభయారణ్యం కబ్జాలు అరికట్టాల న్నారు. ఈ సరస్సును అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడుకున్న పర్యాటక క్షేత్రంగా, పక్షి ప్రేమికులు మెచ్చేదిగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం మరింత దార్శనికతతో ముందుకు వెళ్లాలని నారాయణ అన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన శనివారం లేఖ రాశారు. న్యూఢిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ లేఖను నారాయణ విడుదల చేశారు. కొల్లేరు సరస్సులోని తడి భూములకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే అమలు చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. భూ బకాసురులు ఇప్పటికే దాదాపు 100 ఎకరాలకుపైగా పక్షి అభయారణ్యాన్ని కబ్జా చేసి... ఆక్వా సాగు సాగిస్తున్నారని వివరించారు. చేపల పెంపకం చెరువులు తొలగించాలని 2006 మేలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర కమిటీ

- మిగతా 2 లో

కొత్తగూడెంకు కొంగ్రొత్త అందాలు

- రూ.1.90 కోట్ల అభివృద్ధి పనులు
- సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి కూనంనేని శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-భద్రాద్రి కొత్తగూడెం: అతిత్వరలో కొత్తగూడెంను సమస్యలు లేని పట్టణంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు భరోసా ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో 14, 28, 29, 26 వార్డుల్లో రూ.1.90 లక్షల డీఎంఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రెయిన్ల నిర్మాణాలకు శనివారం కూనంనేని శంకుస్థాపన చేశారు. 26వ వార్డు పరిధిలో రూ.50 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ... ప్రతి వార్డులో పక్కా రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే చాలావార్డుల్లో అంతర్గత రోడ్లు పూర్తి అయ్యాయన్నారు. ప్రతి వార్డులో కమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్ములు ఏర్పాటుకు కృషి జరుగుతోందన్నారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ ప్రాంతాలను కలుపుతూ కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ 'కుడ'

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఊరేగింపు కాదు ఇనస్పెక్టర్ అందరూ మావాళ్లే, అందరికీ పార్టీ టికెట్లిచ్చింది.

స్కిల్స్ వర్సిటీకి 'మేఘా' రూ.200 కోట్లు

- ప్రపంచ స్థాయి అధునాతన నమూనాలతో ఎంవోయూ
- సీఎం రేవంత్‌తో కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి భేటి

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియలో మరో ముందడుగు పడింది. వర్సిటీ భవన నిర్మాణానికి మేఘా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్స్ ముందుకొచ్చింది. వర్సిటీ క్యాంపస్ నిర్మాణానికి మేఘా కంపెనీ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ నిధుల నుంచి రూ.200 కోట్లు కేటాయించింది. వీటితో వర్సిటీ క్యాంపస్‌లో అవసరమైన భవనాలన్నింటినీ నిర్మించే బాధ్యతలను స్వీకరించింది. ప్రపంచ స్థాయి అధునాతన నమూనాలతో అన్ని మౌలిక వసతులు ఉండేలా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణం చేపట్టేందుకు కంపెనీ ముందుకు వచ్చింది. సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మేఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి నేతృత్వంలో ప్రతినిధుల బృందం శనివారం సంప్రదింపులు జరిపింది. ప్రభుత్వం తలపెట్టిన స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణంలో భాగస్వామ్యం పంచుకునేందుకు చర్చలు జరిపింది. ప్రపంచస్థాయి ప్రమాణాలతో క్యాంపస్ నిర్మాణం చేపడుతామని ప్రకటించింది. వర్సిటీ భవనాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,

- మిగతా 2 లో

ఆస్తుల వాటాపై ప్రమాణం చేద్దామా?

జగన్, సుబ్బారెడ్డికి షర్మిల సవాల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నలుగురు మనవ సంతానానికి ఆస్తిలో సమాన భాగమని రాజశేఖర్‌రెడ్డి బ్రతికుండగానే చెప్పారని, ఇది నిజమని తన బిడ్డలపై ప్రమాణం చేస్తా...జగన్, సుబ్బారెడ్డి వారి బిడ్డలపై ప్రమాణం చేస్తారా అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల సవాల్ విసిరారు. ఆంధ్రరత్నభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో షర్మిల మాట్లాడుతూ వైసీపీ నేతల ఆరోపణలను తిప్పికొట్టారు. 'నాకు రావాల్సిన ఆస్తిలో వాటా ఇవ్వకుండా ఏవో చెబితే ఎలా? నా మేలు కోరతానని వైఎస్‌కు జగన్ మాట ఇచ్చారు. సాక్షిలో, భారతి సిమెంట్స్‌లో వాటాలు మావని జగన్ ఎలా చెబుతారు' అని షర్మిల ప్రశ్నించారు. 'కంపెనీలకు భారతి, జగతి అని వాళ్ల పేర్లు పెట్టుకున్నారట. ఆ రోజు ఆ పేర్లు పెట్టుకోగలిగారంటే కారణం రాజశేఖర్‌రెడ్డి అనుమతిచ్చారు. నేను అడ్డు చెప్పలేదు కాబట్టే. పేర్లు పెట్టుకున్నంత మాత్రాన ఆస్తులు మొత్తం వారివే అనే నిబంధన ఏమైనా ఉందా? ఆస్తులు మొత్తం జగన్‌వే కాబట్టి ఆయన జైలుకు వెళ్లారని సుబ్బారెడ్డి చెబుతున్నారు. భారతి పేరు మీద ఆస్తులు ఉంటే ఆమె ఎందుకు జైలుకు వెళ్లలేదు' అని నిలదీశారు. 'ఎవరైనా గిఫ్ట్ ఇస్తే ఎంవోయూ రాసుకుంటారా? మీరు ఎంవోయూ రాశారంటేనే ఇవ్వాల్సిన బాధ్యత ఉందని అర్థం. దీనికి సుబ్బారెడ్డి సమాధానం చెప్పాలి. కన్నతల్లిపై కేసు వేసిన వ్యక్తి ఈ లోకంలో ఎవరైనా ఉన్నారా? ఇలాంటి గొడవలు అందరి ఇళ్లలో ఉండేవే అని సునాయాసంగా మాట్లాడుతున్నారు. మీకు మానవత్వం లేదా? ఎవరో మాట్లాడితే బాధపడేదాన్ని

- మిగతా 2 లో

దద్దరిల్లిన ప్రధాన ప్రాంతాలు

మా మిషన్ పూర్తి:ఐడీఎఫ్

ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి

జెరూసలేం: గాజా, లెబనాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడే ఇజ్రాయిల్ ఇప్పుడు ఇరాన్‌పై దృష్టిని కేంద్రీకరించింది. ఆ దేశంపై కచ్చితమైన పద్ధతిలో దాడులు జరిపింది. దీంతో రాజధాని టెహ్రాన్ ఇరుగు పొరుగు ప్రాంతాలు శనివారం దద్దరిల్లాయి. కరాజ్ నగరం లోనూ ఇజ్రాయిల్ బాంబులు కురిపించింది. సైనిక స్థావరాలనే లక్ష్యంగా వైమానిక దాడులు చేసినట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. ప్రతీకార దాడి పూర్తి అయినట్లు తెలిపింది. తమ మిషన్ ముగిసింది అంటూ ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్)చీఫ్ హగారీ ఒక వీడియో విడుదల చేశారు. ఇరాన్ యంత్రాంగం కొత్తగా దాడులకు పూను కుంటే మరోమారు ప్రతిఘటన తప్పబోదని ఆయన స్పష్టంచేశారు. 'ప్రతీకార దాడి పూర్తి అయింది. దాని ఉద్దేశం నెరవేరింది. ఇరాన్‌లోని నిర్దేశిత లక్ష్యాలపై దాడుల తర్వాత మా విమానాలు క్షేమంగా తిరిగి వచ్చాయి. దాదాపు ఏడాదిగా ఇజ్రాయిల్‌పై దాడులు సాగించేందుకు క్షిపణులను ఇరాన్ తయారు చేసుకునే కర్మాగారాలను ధ్వంసం చేశాం' అని ఇజ్రాయిల్ సైన్యం వెల్లడించింది. అక్టోబరు 1న ఇరాన్ జరిపిన బాలిస్టిక్ క్షిపణి దాడికి దీటైన బదులిచ్చామని పేర్కొంది. ఇప్పటికే రగులుతున్న పశ్చిమాసియాను తాజా దాడితో ఇజ్రాయిల్ మరింతగా రగిల్చింది. అయితే ఇజ్రాయిల్ సైన్యం నేరుగా ఇరాన్‌పై దాడి చేయడం (1980లో ఇరాక్‌తో యుద్ధమప్పటి తర్వాత) ఇదే మొదటిసారి. సూర్యుడు ఉదయించే సమయానికి ఇజ్రాయిల్ దాడులు ముగిశాయి. ఉపరితలంపై నుంచి గగనతలంలోని లక్ష్యాలను ఛేదించే క్షిపణి వ్యవస్థలు, వైమానిక కేంద్రాలపైనా దాడులు చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. అయితే ఎంత మేరకు నష్టం చేకూర్చిందీ వెల్లడించలేదు. మరోవైపు ఇరాన్ కూడా ఈ దాడులకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. చెదురుమదురు ఘటనలు జరిగినట్లుగానే స్థానిక మీడియాలో నివేదికలు వచ్చాయి.

మూడు దేశాల వాయుక్షేత్రాలు బంద్

ఇరాన్‌పై ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడుల కారణంగా మూడు దేశాల వాయు మార్గాలు స్తంభించిపోయాయి. తెల్లవారుజామున జరిగిన దాడుల్లో పెద్దగా నష్టం జరగలేదని ఇరాన్ పేర్కొనగా... విస్తృత స్థాయిలో దాడులు జరిపినట్లు ఇజ్రాయిల్ తెలిపింది. తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్, సిరియా, ఇరాక్ దేశాల గగనతలంలో పూర్తిస్థాయిలో లాక్‌డౌన్ అమలైనట్లు ఫ్లైట్ రాడార్ 24 పేర్కొంది. గోలన్ హైట్స్‌తో పాటు లెబనాన్‌లోని ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయిల్ దాడులు జరిపినందున గగనతల రక్షణ వ్యవస్థలను క్రియాశీలం చేయాల్సి వచ్చిందని సిరియా తెలిపింది. పౌర విమానయాన భద్రత దృష్ట్యా వాయుమార్గంలో రాకపోకలను నిలిపివేయాలని నిర్ణయించిందని ఇరాక్ వెల్లడించింది. ఉత్తర విమానాలు ప్రవేశించకుండా గగనతలాన్ని (ఎయిర్ స్పేస్) మూసివేసినట్లు తెలిపింది.

నా ఓటు కమలా హారిస్‌కే: లియోనార్డో

వాషింగ్టన్: 'అమెరికా ఆర్థిక వ్యవస్థను, భూగ్రహాన్ని కాపాడుకోవాలంటే సాహసోపేతంగా ముందుకు వెళ్లగలిగిన వారు కావాలి, అందుకే కమలా హారిస్‌కు మద్దతు తెలుపుతున్నా' అని హాలీవుడ్ నటుడు లియోనార్డో డి కాప్రియో తెలిపారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థికి ఓటేస్తానంటూ సామాజిక మాధ్యమంలో ఓ వీడియో పెట్టారు. 'వాతావరణంలో సంభవించిన మార్పులతో భూమి చచ్చిపోతోంది. ఆర్థిక వ్యవస్థ నాశనమవుతోంది. వీటిని పరిరక్షించు కోవాలంటే సాహసోపేతంగా ముందుకు వెళ్లగలగాలి. అందుకోసమే కమలా హారిస్‌కు మద్దతు ప్రకటిస్తున్నా. నా ఓటు కమలా హారిస్‌కే' అని వీడియోలో లియోనార్డో తెలిపారు. 2050 నాటికి కర్బన ఉద్గారాలను పూర్తిగా కట్టడి చేయడం, హరిత ఆర్థికవ్యవస్థ నిర్మాణం వంటి హారిస్ లక్ష్యాలను ప్రశంసించారు. పారిస్ వాతావరణ ఒప్పందం నుంచి అమెరికా నిష్క్రమణను ప్రస్తావిస్తూ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను విమర్శించారు. వాస్తవాలను ధిక్కరించడం, సైన్సును కాదనడంలో ఆయనకు ఆయనే సాటి అని లియోనార్డో వ్యాఖ్యానించారు. అధ్యక్ష ఎన్నికలకు రెండు వారాల కంటే తక్కువ సమయం ఉండటంతో హారిస్‌కు క్రమంగా ప్రముఖుల మద్దతు పెరుగుతుండటంతో అమెరికా పరిణామాలు ఆసక్తికరంగా మారాయి. ఇదిలాఉంటే మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో కలిసి కమలా హారిస్ గురువారం అట్లాంటా శివార్లలో నిర్వహించిన ర్యాలీకి మంచి ఆదరణ లభించింది. ప్రముఖ సంగీతకారుడు బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్, గాయని బియోన్స్, ప్రముఖులు టైలర్ స్విఫ్ట్, ఒప్రా విన్ఫ్రే, మెర్లిన్ స్ట్రీప్, క్రిస్ రాక్, జార్జ్ క్లూనీ వంటి వారంతా ఆమెకు మద్దతు ప్రకటించారు.

దివి నుంచి భువికి క్షేమంగా ఆ నలుగురు

వాషింగ్టన్: బోయింగ్ క్యాప్సుల్‌లో సమస్య రావడానికి తోడు మిల్టన్ హరికేన్ వల్ల అంతరిక్షంలో దాదాపు ఎనిమిది నెలలు చిక్కుకుపోయిన నలుగురు వ్యోమగాములు ఎట్టకేలకు తిరిగి వచ్చారు. క్షేమంగా భూమిపైకి చేరుకున్నారు. వీరిలో ముగ్గురు అమెరికన్లు కాగా ఒకరు రష్యన్ వ్యోమగామి ఉన్నారు. వీరంతా రెండు నెలల కిందటే తిరిగి రావాలి. అయితే బోయింగ్ స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు రావడంతో అంతరిక్షంలో చిక్కుకుపోయారు. మిల్టన్ హరికేన్ కూడా వీరి రాకను మరింత ఆలస్యం చేసింది. స్పేస్ ఎక్స్ క్యాప్సుల్‌లో శుక్రవారం వీరు భూమిని చేరుకున్నారు. నలుగురు వ్యోమగాములతో ఫ్లోరిడా తీరంలోని గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో క్యాప్సుల్ దిగింది. రికవరీ షిప్‌పైకి చేరిన తర్వాత వ్యోమగాములకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. ఒకరికి సమస్య ఉన్నట్లు గుర్తించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే అతనిని ఆసుపత్రికి పంపినట్లు నాసా తెలిపింది. వ్యోమగామి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొంది. వీరి స్థానంలో స్టార్‌లైనర్ టెస్ట్ పైలెట్లుగా వెళ్లిన బుచ్ విల్మోర్, సునీతా విలియమ్స్ మిషన్ కూడా అంతరిక్షంలో చిక్కుకున్నారు. వారి మిషన్‌లోనూ సమస్యలు రావడంతో ఎనిమిది రోజుల కోసం వెళ్లిన వారు ఎనిమిది నెలల వరకు అంతరిక్షంలో ఉండిపోవాల్సి వచ్చింది. కాగా, మరో ఇద్దరు వ్యోమగాములను స్పేస్ ఎక్స్ నాలుగు వారాల కిందట పంపింది. ఈ నలుగురు వ్యోమగాములు ఫిబ్రవరి వరకు అంతరిక్ష కేంద్రంలోనే ఉంటారు.

'ఒకే పోలీస్ విధానం' అమలు

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు నల్లగొండ జిల్లా అన్నెపర్తి బెటాలియన్‌లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంపై కానిస్టేబుళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లగొండ రూరల్ ఎస్సై సైదాబాబును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ కుటుంబ సభ్యులపై అసభ్యకరంగా మాట్లాడారని ఆరోపించారు. తక్షణమే సైదాబాబుని సస్పెండ్ చేయాలని, లేనట్లయితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బందోబస్తు విధుల్లో ఉన్న సైదాబాబు వద్దకు కానిస్టేబుళ్లు రావడంతో బెటాలియన్ అధికారులు అతడిని అక్కడిని నుంచి పంపించేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో పోలీసుల భార్యలు రోడ్డెక్కారు.

తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్ కు చెందిన కానిస్టేబుల్‌కు 24 గంటలపాటు ఉద్యోగాలంటూ ఇక్కట్లు రావడంలేదని, కనీసం మంచి చెడుల సమయంలో సైతం సెలవులు ఇవ్వడం లేదని పోలీసు భార్యలు కన్నీరు పెట్టుకున్నారు.ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని కోరుతూ 13వ బెటాలియన్‌లో విధులు నిర్వహించే పోలీసుల భార్యలు శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హైవేపై జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఒకే చోట ఉద్యోగం చేయకుండా రాష్ట్రమంతటా తిప్పుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం వదంతులేదని పోలీస్ భార్యలు ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్తగూడెంకు కొంగ్రొత్త అందాలు

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.450 కోట్లతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, డీఈ రవి, పబ్లిక్ హెల్త్ డీఈ శ్రీనివాస్, ఏఈ నవ్య జ్యోతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ చౌహాన్, కౌన్సిలర్లు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, ధర్మరాజు, బండి నరసింహ, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణ చారి, వేణు, అఫ్జల్ ఉన్నిసా బేగం, లక్ష్మణ్, దుర్గరాని వెంకన్న, రమణమూర్తి, మాచర్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ యూసుఫ్, ధనలక్ష్మి పాల్గొన్నారు.

'ఇండియా' అభ్యర్థులకు కేజ్రీవాల్ ప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

పేర్కొన్నాయి. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం మహారాష్ట్రలో ప్రచారానికి రావాల్సిందిగా అరవింద్ కేజ్రీవాల్‌ను శివసేన-యూబీటీ, ఎన్‌సీపీ-ఎస్‌పీ నేతలు ఇటీవల కోరారు. ఇందుకు సానుకూలంగా కేజ్రీవాల్ స్పందించారు. ఆప్ కార్యకర్తలు ఉన్న ప్రాంతాల్లోనూ, వివాద రహిత అభ్యర్థులు ఉన్న చోట్ల ప్రచారానికి ఆయన అంగీకరించారు. కేజ్రీవాల్‌తో పాటు ఆప్ సీనియర్ నేతలు కూడా మహా వికాస్ అఘాడీ తరఫున ప్రచారంలో పాల్గొంటారు.

288 మంది సభ్యులు గల మహారాష్ట్ర అసెంబ్లీకి ఒకే విడతలో నవంబర్ 20న పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు వెలువడతాయి. అదేవిధంగా జార్ఖండ్‌లోనూ జేఎంఎం కూటమి అభ్యర్థుల తరఫున కేజ్రీవాల్ ప్రచారం చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇండియా బ్లాక్ సర్దుబాటులో ఏ సీట్లలో మరింత బలం చేకూర్చే అర్బన్ సీట్లలో అరవింద్ కేజ్రీవాల్ ప్రచారం చేస్తారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. జార్ఖండ్‌లో బీజేపీ కూటమి, జేఎంఎం కూటమి మధ్య పోటీ ఉంది. బీజేపీతో జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఏజెఎస్‌యు), జనతాదళ్ (యునైటెడ్), లోక్ జనశక్తి పార్టీ (ఎల్‌జేపీ) భాగస్వామ్య పార్టీలుగా ఉన్నాయి. జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం)లో రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ), కాంగ్రెస్ భాగస్వాములుగా ఉన్నాయి. నవంబర్ 13, నవంబర్ 20 తేదీల్లో రెండు విడతలుగా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు వెలువడతాయి.

నేటి నుంచి విశాఖ-విజయవాడ విమాన సర్వీసులు

(మొదటిపేజీ తరువాయి)

చేరుకుంటుంది. తిరిగి 8.45 బయలుదేరి 9.50 గంటలకు విజయవాడ చేరుకుంటుందని అధికారులు తెలిపారు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.35 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరి 10.35కు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి రాత్రి 7.55 గంటలకు బయలుదేరి తొమ్మిది గంటలకు విశాఖపట్నం వెళ్తుంది. వీటి రాకతో విజయవాడ-విశాఖ సర్వీసుల సంఖ్య మూడుకు చేరనున్నాయి.

బంగ్లాదేశ్‌లో భారీ ర్యాలీ

ఢాకా: రాజకీయ అనిశ్చితి కొనసాగుతోన్న బంగ్లాదేశ్‌లో హిందువులు భారీ ర్యాలీ నిర్వహించారు. మైనార్టీల హక్కుల పరిరక్షణ కోసం వేలాదిమంది వీధుల్లోకి వచ్చారు. చట్టోగ్రామ్‌లో సనాతన జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. మహ్మద్ యూనస్ సారథ్యంలోని తాత్కాలిక ప్రభుత్వం ముందు హిందువులు 8 డిమాండ్లు ఉంచినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. వాటిని నెరవేర్చేవరకు వీధుల్లో తమ నిరసన కొనసాగుతుందని ఉద్యమకారులు తెలిపారు. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కొద్దినెలల క్రితం బంగ్లాలో హింసాత్మక ఘర్షణలు జరిగాయి. దాంతో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ అధికారం కోల్పోయింది. హసీనా రాజీనామా చేసి... భారత్‌కు ఆశ్రయించాల్సి వచ్చింది. ఎన్నికలు జరిగే వరకు యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం కొనసాగుతుంది.

మరో 22 మంది అభ్యర్థులతో ఎన్‌సీపీ(ఎస్పీ) జాబితా

ముంబై: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. వ్యూహ ప్రతివ్యూహాలు, అభ్యర్థుల ఎంపికలతో పార్టీలు బిజీబిజీగా ఉన్నాయి. మరోవైపు ఇప్పటికే టికెట్ ఖరారైన కొందరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసి ప్రచారాలు మొదలుపెట్టారు. మరికొందరు నామినేషన్లు వేసేపనిలో బిజీగా ఉన్నారు. ఈ నేపథ్యంలో శరద్ పవార్ వర్గం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మరో 22 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఈ మేరకు ఎన్‌సీపీ(ఎస్పీ) మహారాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ రెండో జాబితాను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు తాము మొత్తం 67 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించామని పాటిల్ చెప్పారు. అన్ని స్థానాల్లో గెలుపు తమదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సీట్ల పంపకంపై మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ ఈ విషయంలో సమావేశాలు ముగిశాయని చెప్పారు. ఇంకా ఏమన్నా చిన్నచిన్న మార్పులు ఉంటే ఫోన్‌లలో మాట్లాడతామని అన్నారు.

మొత్తానికి మహావికాస్ అఘాడీలోని మూడు పార్టీలు ఇంచుమించుగా 90 అసెంబ్లీ స్థానాల చొప్పున బరిలో దిగుతాయని జయంత్ పాటిల్ చెప్పారు. ఇంకా రెండు, మూడు స్థానాలు ఎక్కువ తక్కువలు ఏమైనా ఉంటే.. బాలాసాహెబ్ థోరాట్ కచ్చితమైన లెక్కలు చెబుతారని అన్నారు.

ఆస్తుల వాటాపై ప్రమాణం చేద్దామా?

(మొదటిపేజీ తరువాయి)

కాదు. సుబ్బారెడ్డి బాబాయ్ మాట్లాడే సరికి చాలా బాధపడ్డా. కళ్లలో నీళ్లు తిరిగాయి' అని ఆవేదన వ్యక్తం చేశారు. 'నా బిడ్డలు కూడా మీ కళ్ల ముందే పెరిగారు. వారికి అన్యాయం చేయాలని ఎలా అనిపించింది. అన్ని విషయాలు తెలిసి కూడా బాబాయ్ ఎందుకిలా మాట్లాడారని' అని షర్మిల కన్నీటి పర్యంతమయ్యారు. 'జగన్ కోసం నేను, అమ్మ ఎంతో కష్టపడ్డాం. ఐదేళ్లుగా ఎంపోయా నా దగ్గర ఉన్నా ఒక్క మీడియా హౌస్‌కు వెళ్లలేదు. ఎన్ని కష్టాలు వచ్చినా ఎంపోయా వాడుకోలేదు. ఎక్కడా బయటపెట్టలేదు. వైఎస్ కుటుంబం గురించి చెడ్డగా చెప్పుకుంటారనే ఎంపోయా గురించి ఎప్పుడూ చెప్పలేదు. జగన్ కోసం రెండు ఎన్నికల్లో పాదయాత్ర చేశా. చెల్లి కోసం ఇది చేశానని జగన్ జన్మలో ఒక్కసారైనా చెప్పగలరా? జగన్ బెయిల్ రద్దవుతుంది కాబట్టి కోర్టులో కేసు వేశామని చెబుతున్నారు. తనకి లాభం జరుగుతుంది అంటే తల్లిని కోర్టుకు ఈడుస్తారా? సొంత కుమారుడే తల్లిని కోర్టుకు లాగడం దారుణం కాదా? రాజశేఖర్‌రెడ్డి పేరు ఎఫ్ఐఆర్‌లో లేకపోతే... కేసు నుంచి జగన్ బయటపడటం అసాధ్యమని భావించి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మాడు కోర్టుల చుట్టూ తిరిగి రాజశేఖర్‌రెడ్డి పేరును సీబీఐ ఎఫ్ఐఆర్‌లో చేర్పించారు. తనకు లాభం జరుగుతుందనుకుంటే ఎంతటివారినైనా జగన్ అణచివేస్తారు. విజయమ్మను కోర్టుకు లాగడానికి కారణం ఎవరు? మీ నాయకుడు ఎలాంటి వాడో వైసీపీ నేతలు ఆలోచించాలి' అని షర్మిల కోరారు.

మళ్లీ రోడ్డెక్కిన రైతులు

(మొదటిపేజీ తరువాయి)

పంటలను విత్తే సీజన్ ఇప్పటికే ఉంది' అని పంధేర్ చెప్పారు. పంజాబ్ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయంపై ఆధారపడింది. వ్యవసాయ యం నాశనమైతే ఆర్థిక వ్యవస్థ కూడా నాశనం అవుతుంది' అని చెప్పారు. 'ఎరువుల కొరత, పంట వ్యర్థాల దహనం జరిమానాలు నిరసనకు సంబంధించి ఇతర ప్రధాన సమస్యలు' అని అన్నారు. వ్యాపారులు, సమాజంలోని ఇతర వర్గాలు రైతులకు సహకరించాలని పంధేర్ కోరుతూ, దిగ్బంధనాల వల్ల ప్రజలకు అసౌకర్యానికి చింతిస్తున్నట్లు చెప్పారు. భారతీయ కిసాన్ యూనియన్ (దోబా) అధ్యక్షుడు మంజీత్ సింగ్ రాయ్, ప్రధాన కార్యదర్శి సత్నామ్ సింగ్ సాహ్నీ కూడా నిరసనకారులను ఉద్దేశించి ప్రసంగించారు. పోలీసులు ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా మళ్లించినప్పటికీ దిగ్బంధం కారణంగా ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.

సైనిక వాహనం బోల్తాపడి సైనికుడి మృతి

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కుల్గామ్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. సైనికులతో ప్రయాణిస్తున్న ఆర్మీ వాహనం ప్రమాదవశాత్తూ రోడ్డుపై జారి... బోల్తాపడటంతో ఒక సైనికుడు మృతి చెందారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. చినార్ కార్ప్స్ అధికారి ఒకరు ఈ ఘటనను వివరిస్తూ శుక్రవారం రాత్రి ఉగ్రవాదుల ఏరివేత ఆపరేషన్‌లో భాగంగా వెళ్తున్న ఆర్మీ వ్యాను కుల్గాంలోని డీహెచ్ పోరా ప్రాంతంలో రోడ్డుపై జారడంతో బోల్తా పడిందన్నారు. ఈ దురదృష్టకర ఘటనలో ఒక జవాను మృతిచెందారని తెలిపారు.

క్రిప్టోలతో ఆర్థిక స్థిరత్వానికి ముప్పు

శక్తికాంత దాస్

న్యూఢిల్లీ: క్రిప్టో కరెన్సీతో ఆర్థిక స్థిరత్వానికి పెను ముప్పు ఉందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఆర్థికవ్యవస్థలో క్రిప్టో ఆధిపత్యం చెలాయిస్తే సెంట్రల్ బ్యాంక్ ద్రవ్య వ్యవస్థపై నియంత్రణ కోల్పోతుందని, అది అస్థిరతకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. దీని ప్రభావం ఆర్థిక రంగంపై ఉంటుందని తెలిపారు. ఈవిషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. శక్తికాంత దాస్ 'పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్' థింక్ ట్యాంక్‌కు హాజరయ్యారు. క్రిప్టోలతో ద్రవ్య లభ్యత, ఆర్థిక స్థిరత్వానికి భారీ ప్రమాదం ఉందన్నారు. దీనికారణంగా ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య సరఫరాపై కేంద్ర బ్యాంక్ నియంత్రణ కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. క్రిప్టోలు ఆర్థిక వ్యవస్థపై ఆధిపత్యాన్ని చెలాయించరాదని చెప్పారు. క్రిప్టోతో కలిగే భారీ నష్టాల దృష్ట్యా ఈ సమస్యపై అంతర్జాతీయ అవగాహన ఉండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంక్‌లకు ఇదే ప్రధాన ఆందోళన అని తెలిపారు. క్రిప్టో కరెన్సీల గురించి ప్రశ్నల్ని లేవనెత్తిన మొదటి దేశం భారత్ అని శక్తికాంత దాస్ అన్నారు. భారత్ అధ్యక్షత జరిగిన జీ20 శిఖరాగ్ర సదస్సులో క్రిప్టోపై ఎలా వ్యవహరించాలనే దానిపై అంతర్జాతీయ అవగాహనను పెంపొందించేందుకు ఒప్పందం జరిగిందని గుర్తు చేశారు.

కొల్లేరు కబ్జా ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టమైన ఆదేశాలిచ్చిందన్ని నారాయణ గుర్తుచేశారు. ఇదే విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఇటీవల ప్రశ్నించిందని తెలిపారు. కొల్లేరు తడి భూములు, పక్షి అభయారణ్యానికి సంబంధించిన 6,908 హెక్టార్లు ఆక్వా సాగు కోసం కబ్జా చేసినట్లు ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ వన్యప్రాణి విభాగం డేటా చెబుతోందన్నారు. ప్రస్తుతానికి 20-25 ఎకరాల సరస్సు మిగిలివుందని, మరో క్షణం ఆలస్యం చేయకుండా చేపల పెంపకం చెరువుల ధ్వంసం చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కార్యదర్శిగా తాను... మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డితో కలిసి అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కొల్లేరు సరస్సు విషయంలో కలవగా... ఆయన నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో మాట్లాడారని, దీంతో జిల్లా కలెక్టర్ అగర్వాల్ వెంటనే ఆక్వా మాఫియా ఆగడాలను కట్టడి చేశారని, అనంతరం ఒత్తిళ్ల కారణంగా అగర్వాల్‌పై బదిలీవేటు పడిందని నారాయణ గుర్తుచేశారు. ప్రపంచ నలుమూలల నుంచి వచ్చే పక్షి ప్రేమికుల కోసం కొల్లేరుకు తాగునీరు, ఇతర వసతులను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి సూచించారు. ఇటీవల విజయవాడకు సంభవించిన వరదలను లేఖలో నారాయణ ప్రస్తావించారు. అనేక గ్రామాలు నీటమునిగాయి, ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందన్ని గుర్తుచేశారు. బుడమేరు నదీ జలాలు బంగాళాఖాతంలో కలవడానికి అడ్డుపడుతున్న చేపల చెరువులను తొలగించాలని, ఆక్వా సాగు వల్ల నదులు ఆక్రమణకు గురవుతుండటాన్ని తీవ్రంగా పరిగణించాలని నొక్కిచెప్పారు. బుడమేరు వరదల కారణంగా పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా, జిల్లాల్లో పంట నష్టం భారీగా జరిగిందని తెలిపారు. ఆక్వా సాగు వల్ల జీవవైవిధ్యత దెబ్బతింటోందని, చుట్టుపక్కల ప్రాంతాలు కలుషితమవుతున్నాయని నారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమల వల్ల కొల్లేరు నీటిని కలుషితం కానివ్వరాదని కోరారు. ఆక్వా సాగుదారులు కొంగలను వేటాడుతున్నారని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కొల్లేరు సరస్సుకు విదేశీ పక్షుల వలస విషయాన్ని గమనంలో ఉంచుకొని తగు చర్యలు తీసుకోవాలని నారాయణ సూచించారు. సైబీరియా, యూరప్ నుంచి కొల్లేరుకు విదేశీ పక్షులు వేల సంఖ్యలో వస్తాయని,వీటిలో పెలికన్లు ప్రత్యేకమని తెలిపారు. విస్తృత దార్శనికతతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, కొల్లేరు సరస్సును అంతర్జాతీయ స్థాయి పర్యాటక క్షేత్రంగా, పక్షి ప్రేమికులను ఆకట్టుకునే ప్రాంతంగా మార్చాలని సీఎంకు నారాయణ సూచించారు.

భాగ్యనగర అభివృద్ధిపై విషప్రచారం

(మొదటిపేజీ తరువాయి)

చేస్తామన్నారు. వారి పిల్లలకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తామని, అలాగే నిర్వాసితులైన వారికి డ్వాక్రా మహిళలకు రూ.వెయ్యి కోట్ల వడ్డీ లేని రుణాలు ఇస్తాం, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. హైడ్రా ఎలాంటి అనుమతులు ఇవ్వదని, కావాలనే కొంత మంది హైడ్రా పై కుట్రపూరితంగా విష ప్రచారం చేస్తున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, డీటీసీ వంటి ప్రభుత్వ సంస్థలు అనుమతులు ఇస్తాయని తెలిపారు. మూసీ పునర్జీవనం, ఆర్ఆర్ఆర్ తో పాటు 30 వేల ఎకరాలలో అద్భుతమైన ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఎయిర్ పోర్ట్ నుంచి 30 నిమిషాల్లో ఫ్యూచర్ సిటీకి చేరుకోవచ్చని, అక్కడ ప్రపంచ స్థాయి యూనివర్సిటీ, క్రికెట్ స్టేడియం, ఏఐ ప్రాజెక్టులు చేపడుతున్నట్లు వివరించారు. 15 వేల ఎకరాలు గ్రీన్ బెల్ట్ గా ఉంటుందని, రియల్టర్లు బ్యాంకర్లతో ఉన్న సమస్యలపై తాము మాట్లాడతామన్నారు. త్వరలో ఎన్‌ఎల్‌బీసీ సమావేశం ఏర్పాటు చేసి స్పష్టత ఇస్తామని చెప్పారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల మూలంగా రిజిస్ట్రేషన్లలో స్తబ్దత ఏర్పడిందని, ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు ఊపందుకున్నాయన్నారు. రియల్టర్ల సమస్యలు వినడానికి రాష్ట్ర ప్రభుత్వం ఓపెన్ మైండ్‌తో ఉంది, వినడానికి చర్చించడానికి సిద్ధంగా ఉందన్నారు.

స్కిల్స్ వర్సిటీకి 'మేఘా' రూ.200 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, వర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్‌వీఎస్‌ఎస్ సుబ్బారావు సమక్షంలో ఎంవోయూపై సంతకాలు చేశారు. హైదరాబాద్ శివార్లలోని కందుకూరు మండలం మీర్ ఖాన్ పేట సమీపంలో 57 ఎకరాల విస్తీర్ణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టులో యూనివర్సిటీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అక్కడ అధునాతన భోధన సదుపాయాలతో పాటు విద్యార్థులకు అన్ని వసతులుండేలా క్యాంపస్ నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అకడమిక్ బిల్డింగ్, వర్క్ షాపులు, తరగతి గదులతో పాటు హాస్టల్ బిల్డింగ్ నిర్మిస్తామని మేఘా కంపెనీ ఎండీ కృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటికే ఆర్కిటెక్ట్ నిపుణులతో తయారు చేయించిన భవన నిర్మాణ నమూనాలను, డిజైన్లను ప్రదర్శించారు. వారం రోజుల్లోగా భవన డిజైన్లకు తుది రూపు ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. నవంబరు ఎనిమిదో తేదీ నుంచి భవన నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

సరస్వతి పవర్ భూములపై సర్వే

పవన్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సరస్వతి పవర్ సంస్థల భూముల వ్యవహారంపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికార యంత్రాంగం కదిలింది. పల్నాడు జిల్లా దాచేపల్లి, మాచవరం మండలాల్లో సరస్వతి పవర్ సంస్థకు చెందిన భూముల్లో అటవీ భూములు ఏమైనా ఉన్నాయా? ఉంటే వాటి విస్తీర్ణం ఎంత అనే దానిపై నివేదిక ఇవ్వాలని అటవీ శాఖ అధికారులను, పల్నాడు జిల్లా యంత్రాంగాన్ని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీంతో దాచేపల్లి డీఆర్‌వో ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది శనివారం దాచేపల్లి, మాచవరం మండలాల్లో సర్వే నిర్వహించారు. సరస్వతి పవర్ సంస్థకు గల 1515.93 ఎకరాల్లో ప్రకృతి సంపద, వాగులు, వంకలు, కొండ భూములు ఉన్నాయనే వార్తలు వెలుగు చూసిన క్రమంలో ఉప ముఖ్యమంత్రి అధికార యంత్రాంగంతో చర్చించారు. ఆ సంస్థకు చెందిన భూముల్లో ప్రభుత్వ భూములు, జల వనరులు ఏ మేరకు ఉన్నాయో తెలియచేయడంతో పాటు, అటవీ భూములు ఏ మేరకు ఉన్నాయో సమగ్రంగా పరిశీలించవలసిన అవసరం ఉందని అధికారులకు స్పష్టం చేశారు. వాగులు, వంకలు, కొండలు ఉన్నందువల్ల ఆ సంస్థ పర్యావరణ అనుమతులు ఏ విధంగా పొందిందో వెల్లడించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన చెల్లెలు షర్మిల మధ్య ఆస్తుల వివాదం తెరపైకి రావడంతో సరస్వతి పవర్ సంస్థ భూ వ్యవహారంపై వాస్తవాలు తెలుసుకోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

విద్యుత్ చార్జీల భారం ప్రభుత్వమే భరించాలి

విశాలాంధ్ర - విజయవాడ: రాష్ట్ర ప్రజలపై రూ.6,072 కోట్ల విద్యుత్ చార్జీల భారం మోపడాన్ని విరమించుకొని... ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంధన, విద్యుత్ కొనుగోలు సర్దుబాటు చార్జీలు రూ.8,114 కోట్లు ఉంటాయని చెప్పారు. వసూలు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఏపీ విద్యుత్ నియంత్రణ మండలికి డిస్కంలు ప్రతిపాదించాయని తెలిపారు. ఈ చార్జీల వసూలుకు అనుమతి ఇవ్వడంతో 75 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని డిస్కంలు చెప్పినట్లు పేర్కొన్నారు. దీనిపై ఏపీఈఆర్‌సీ బహిరంగ విచారణ జరగగా... వివిధ వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా, అంకిత భావంతో, సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దారు, ఎంపీడీఓలు, ఎంఈఓలతో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జ్ సంపత్ రావు, డిపిఓ దేవ్‌రాజ్‌లతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులుగా విధి నిర్వహణలో ఎన్నో మంచి పనులు చేసే అవకాశం ఉంటుందని, దీన్ని సద్వినియోగం చేసుకొని మనసుకు, సంతృప్తినిచ్చే విధంగా మనసు పెట్టి, పనిచేయాలన్నారు. జిల్లాలోని 31 వసతి గృహాల్లో అత్యవసర మైన 3 పనులను తక్షణమే నివేదిక సిద్ధం చేసి, సమర్పించాలని అధికారులను సూచించారు. వసతి గృహాలు, గురుకుల పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు మండల పర్యటనలో తప్పని సరిగా హాస్టల్స్, పాఠశాలలు తనిఖీ చేయాలని, పర్యటనలు వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు విద్యాప్రమాణాలు పెంపొందించేందుకు దోహదపడుతుందని అన్నారు. నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన త్రాగు నీరు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. అన్ని కులాల సామాజిక వర్గాలకు సంబంధించిన ఆర్థిక పరమైన, సామాజిక పరమైన రాజకీయ పరమైన సమస్యల గురించి మండల కేంద్రాలలో సమావేశాలు నిర్వహించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపిఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.

తమ్ముడి పట్టా భూమి ఆక్రమించేందుకు అన్న కుట్ర..

పోలీసులకు ఫిర్యాదు

విశాలాంధ్ర - పినపాక : తమ్ముడికి చెందిన వ్యవసాయ పట్టాభూమిని స్వయాన అన్న ఆక్రమించేందుకు ప్రయత్నించిన ఘటన ఉమ్మెడి గ్రామంలో చోటుచేసుకుంది. శనివారం వివాదం చెలరేగడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. మండల కేంద్రంలో నివాసం ఉంటున్న గుడవర్తి సత్యనారాయణకు ఉమ్మెడి రెవెన్యూ పరిధిలో 127/7/అ/1,127/7/అ /2/1 సర్వే నెంబర్లలో మొత్తం 1.12 ఎకరాల పట్టా భూమి ఉంది. ఆ భూమి పిత్రార్జితంగా వారసత్వంగా సంక్రమించింది. 40 సంవత్సరాల క్రితమే పెద్దల సమక్షంలో పంచుకున్న ఈపట్టా భూమిలో ఆయన జామాయిల్ తోట పెంపకం చేపడుతుండగా స్వయాన తన అన్న అయిన గుడవర్తి జనార్దన్ రావు ఆ భూమిని ఆక్రమించేందుకు కుట్ర పన్నాడు. దౌర్జన్యంగా తన భూమిలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు బాధితుడు సత్యనారాయణ పోలీసు లను ఆశ్రయించాడు. తనకు కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ తన భూమిని ఆక్రమించే దుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పాడు. తన సోదరుడి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు మీడియా ముందు కూడా ఆవేదన వ్యక్తం చేశాడు.

కోర్టు కాంప్లెక్స్ నిర్మాణానికి హైకోర్టు జడ్జి భూమి పూజ

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : ఖమ్మం జిల్లా మధిరలో రూ.24 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 2 కోర్టు కాంప్లెక్స్‌లు, రూ. 39 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న రికార్డ్ భవన నిర్మాణ పనులకు శనివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, ఖమ్మం జిల్లా పరిపాలనా న్యాయమూర్తి శ్రీ. జె. శ్రీ సుధ, హైకోర్టు న్యాయమూర్తులు భీమపాక నగేష్, కాజా శరత్, ఖమ్మం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయమూర్తి జి. రాజగోపాల్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా భవన ప్లాన్ ను న్యాయమూర్తులు పరిశీలించారు. పనులు ప్రారంభించి, అగ్రిమెంట్ తేదీలోగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని న్యాయమూర్తులు అన్నారు. అనంతరం మధిర కోర్టు కాంప్లెక్స్ ప్లేట్ ఆవిష్కరణ ఏర్పాటు చేసిన సీనియర్ సివిల్ కోర్ట్ ను న్యాయమూర్తులు ప్రారంభించారు. మధిర సీనియర్ సివిల్ న్యాయమూర్తి మీరా ఖాజీం సాహెబ్, మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి. పుల్లారావు, న్యాయవాదులు, ఆర్ అండ్ బి ఎస్‌ఇ హేమలత, మధిర మునిసిపల్ కమీషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ రాంబాబు, న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

28న కలెక్టరేట్ వద్ద సీపీఐ రైతు సంఘం ఆందోళన

విశాలాంధ్ర - ఖమ్మం : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయల రుణమాఫీని తక్షణం అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నాటికే పూర్తి చేస్తామన్న రుణమాఫీ ఇప్పటి వరకు సగం కూడా పూర్తి కాలేదని లక్ష లోపు రుణాలు కూడా పూర్తి చేయకపోవడం శోచనీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా సమితి సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో గోవిందరావు మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దాటవేత - ధోరణిని అవలంబిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షలకు పైగా రైతులకు రుణమాఫీ జరగలేదని ఈ విషయంలో రోజుకో ప్రకటన ఇస్తున్నారని ఇది రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుందని గోవిందరావు తెలిపారు. రైతుభరోసా అమలు చేయడంతో పాటు సన్న వడ్లతో పాటు ఇతర రకాల ధాన్యానికి కూడా రూ. 500 బోనస్ ఇవ్వాలని భూ హక్కుల చట్టాన్ని త్వరితగతిన "అమలు చేయాలని గోవిందరావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.15వేల చొప్పున ఖరీఫ్, రబీల్లో ఇస్తానని చెప్పారని కానీ ఖరీఫ్‌లో రైతుల ఖాతాల్లో జమ చేయలేదని ఆయన తెలిపారు. రైతాంగ - సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 28న సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు గోవిందరావు తెలిపారు. పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం నాయకులు మిడికంటి -వెంకటరెడ్డి, పుచ్చకాయల సుధాకర్, యడ్లపల్లి శంకరయ్య, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో మహిళా సమాఖ్య సభ్యత్వ సేకరణ

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్లలో సిపిఐ అనుబంధ మహిళా సమాఖ్య సభ్యత్వ సేకరణను జిల్లా మహిళా సమాఖ్య వర్కింగ్ లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏ లక్ష్మి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 సంవత్సరాలు పూర్తయినప్పటికీ మహిళా సాధికారతలో ప్రభుత్వాలు ఇంకా మరింత ముందడుగు వేయలేకపోతున్నాయని, నింగిలో సగం నేలలో సగం అని ఉపన్యాసాలు చెప్పడమే తప్ప, ఏ రాజకీయ పార్టీ కానీ తమ కమిటీల్లో మహిళలకు కనీసం 33శాతం రిజర్వేషన్ కల్పించడంలేదని, శాసనసభల్లో, శాసనమండలి సభల్లో పార్లమెంట్ సభల్లో రాజ్యసభ సభల్లో 33శాతం ఉండాల్సిన మహిళలు కేవలం ఐదు శాతానికే పరిమితం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ప్రతి మహిళకు పార్టీ లేని ఉప సదుపాయం కల్పించాలని మహిళల ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ప్రభుత్వాలు చేయూత నందించాలని ఉమ్మడి నేరేడుచర్ల మండలంలో ఐదువేల మహిళా సమాఖ్య సభ్యత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నామని అక్టోబర్లో జరుగున్న జిల్లా మహిళా మహాసభనందున్నాయి జరిగే రాష్ట్ర మహాసభ డిసెంబర్లో ఢిల్లీలో జరిగేజాతీయ మహాసభల విజయవంతానికి కృషి చేయాలని కోరారు.

'కుడ'తో సమగ్ర అభివృద్ధి ప్రయోజనాలు

ఎమ్మెల్యే కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - భద్రాద్రి కొత్తగూడెం : కొత్తగూడెం నియోజకవర్గం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడ)గా ఏర్పాటు కావడం బహుముఖ సమగ్ర అభివృద్ధి కి ప్రయోజనకరమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడ) ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు అధికారులకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. తాను కొత్తగూడెం కార్పొరేషన్ కోసం పలుమార్లు రిప్రజెంటేషన్లు అందించడం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కుడ ఏర్పాటుకు అంగీకరించి జీవో 177 జారీ చేసిందని కూనంనేని వివరించారు. కార్పొరేషన్ కాకపోయినా కుడ ఏర్పాటు వల్ల నియోజకవర్గ అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కొత్త పరిశ్రమలు వస్తాయని ఆమేరకు నిధులు కూడా పెద్ద మొత్తంలో మంజూరు అవుతాయన్నారు. భవిష్యత్తులో కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలను కలిపి కార్పొరేషన్ ఏర్పాటు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పాల్వంచలో ఉన్న కేఎస్ ఎమ్ కళాశాలను హైదరాబాద్‌లోని జేఎన్టీయూ యూనివర్సిటీ తరహాలో అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆదివాసీలు 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో టూరిజం అభివృద్ధి, జూ పార్కును వెయ్యి ఎకరాల్లో జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలో విమానాశ్రయం ఏర్పాటు కోసం కూడా తాను కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఆర్.ఓ. ప్లాంట్ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. కొత్తగూడెం - పాల్వంచ బైపాస్ రోడ్డు కోసం నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, నాయకులు ముత్యాల విశ్వనాథం, సలిగంటి శ్రీనివాస్, వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, ఎండి యూసుఫ్, మాచర్ల శ్రీనివాస్, పూర్ణచంద్రరావు, సాయిబాబా, విజయ్ కుమార్, సత్యనారాయణ చారి, కోటంరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్, 4జీ సేవలు

విశాలాంధ్ర - కొత్తగూడెం : భద్రాద్రి జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు ఇంటర్నెట్, 4 జీ సేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని కంట్రోలర్ కమ్యూనికేషన్ అకౌంటింగ్ (సిసిఏ) తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఇన్చార్జి ఎస్.తారాచంద్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌తో కలిసి ఆయన అధికారులతో మాట్లాడారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్, టీ ఫైబర్ సంస్థలు చేపడుతున్న ఇంటర్నెట్ 4జీ మొబైల్ టవర్స్ అభివృద్ధి పనుల గురించి ఈ సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తారాచంద్ చెప్పారు. నేటి ఆధునిక సమాజంలో నెట్, అంతర్జాల సేవలు చాలా అవసరమయ్యాయన్నారు. ప్రభుత్వ సేవలు పొందేందుకు ప్రాధాన్యత బల్క్ టవర్లు నిర్మాణం చేపడతామన్నారు. ఈ జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో కూడా బిఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్, 4జీ మొబైల్ సేవలు అందించడం కోసం కేంద్ర ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తున్నామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఇంటర్నెట్, 4 జీ మొబైల్ సేవలు అందించడం కోసం తమ వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్ సంస్థ చేపడుతున్న అభివృద్ధి పనులు జిల్లా పంచాయతీ, జిల్లా ప్లానింగ్ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. సిసిఏ జాయింట్ కంట్రోలర్, డిసిఏ చంద్రమౌళి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సునీల్ కుమార్, బిఎస్ఎన్ఎల్ డీజీఎం శ్రీనివాస్, విజయం సుధీర్, ఎగ్జిక్ సక్రు నాయక్, షకీల్, బాలాజీ, ఉదయ్, ఓఎస్ శివరాజ్, టి ఫైబర్ ఆఫీసర్ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర - ఖమ్మం : నగర పాలక సంస్థలో అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. నగర పాలక సంస్థలో భారీ ఎత్తున అవినీతి జరిగిందని గత కలెక్టర్ పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులను హెచ్చరించినా తమ తీరు మార్చుకోలేదని ఏఐటీయూసీ నేతలు తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు రావిశివరామకృష్ణ తదితరులు ఏఐటీయూసీ ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ 2018 నుంచి 2023 సంవత్సరం వరకు జరిగిన అవినీతి పనుల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లపైన విజిలెన్స్ విచారణ జరిపించాలని ఏఐటీయూసీ నేతలు ఆదివారం డిమాండ్ చేసారు. కార్మికులకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్న అధికారులపై విచారణ జరిపించాలని, విజిలెన్స్ విచారణ తర్వాత నివేదికను ప్రజల ముందు ఉంచాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. నగర పాలక సంస్థలో బిల్ కలెక్టర్ నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరకు అవినీతిలో మునిగారన్న వార్తలు వినిపిస్తున్నా ఉన్నతాధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించింది. విచారణ జరిపి తక్షణం పక్కదారి పట్టిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని,చర్యలు తీసుకోని పక్షంలో ఏఐటీయుసి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

కనకరాజుకు నివాళులర్పించిన కలెక్టర్

విశాలాంధ్ర - కొమురం భీం : ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేసి వాటిని కాపాడుతూ భావితరాలకు అందించడం లో కనకరాజు పాత్ర అనిర్వచనీయమైనదని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదివాసుల సాంస్కృతిక సంప్రదాయాలలో ముఖ్య భాగమైనటువంటి గుస్సాడీ నృత్యాన్ని అభివృద్ధి చేసి ముందు తరాలకు అందించిన గొప్ప వ్యక్తి, గుస్సాడీ నృత్య అభివృద్ధిలో కనకరాజు చేసిన కృషికి గాను ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించిందని, ఆయన ఆసిఫాబాద్ జిల్లా వాసి కావడం గర్వంగా ఉందని, కనకరాజు మృతి దిగ్భ్రాంతికి గురి చేసిందని, మార్లవాయిలో పార్థివ దేహానికి పూలమాల అలంకరించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన అంత్యక్రియలను ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

ఈనెల 27న సాయిబాబా సంస్మరణ సభ

విశాలాంధ్ర బ్యూరో - పెద్దపల్లి : పదేళ్లు అన్యాయంగా జైల్లో నిర్బంధించబడ్డ పౌరహక్కుల నేత, ప్రజాస్వామికవాది, రచయిత, మేధావి సాయిబాబా ది పాలకుల హత్య అని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి అన్నారు. పెద్దపల్లిలో సంస్మరణ సభ కరపత్రం ఆవిష్కరణ సందర్భంగా మాట్లాడుతూ కలెంనగర్లో ఆదివారం, 27 సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ప్రెస్క్లబ్‌లో సంస్మరణ సభ జరుగుతుందని ఈ సభ సాయిబాబా కూతురు మంజీర హాజరవుతారని తెలుపారు. సాయిబాబాను ప్రభుత్వమే హత్య చేసింది, 90శాతం వైకల్యం, పక్షవాతం ఇతర 19 రకాల వ్యాధులతో బాధపడుతున్న మందులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమారస్వామి, పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు, శ్రీపతి రాజగోపాల్, నారా వినోద్, బందారి రాజలింగు, వాసాని రాజయ్య, గుమ్మడి కొమురయ్య, గంగ మల్లేశం, పోగుల శేఖర్, ప్రజా సంఘాల నాయకులు, పులిపాక రవీందర్, కొండం రాజు, కోట్టార్ రవీందర్ బాపెల్లి సుధాకర్, బండి శంకర్ గౌడ్, గుల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

27న జీ తెలుగులో డబుల్ ఇస్మార్ట్

విశాలాంధ్ర - అదిలాబాద్ : జీ తెలుగు ఈ వారం మరో కొత్త సినిమాతో వచ్చేస్తోంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని, కావ్య థాపర్ జంటగా నటించిన మాస్ఎంటర్టైనర్ 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను ఈ వారం వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా అందిస్తోందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అద్భుతమైన కథ, కథనంతో పాటు పూరీ జగన్నాథ్ డైరెక్షన్, రామ్ నట విశ్వరూపంతో డబుల్ ఇస్మార్ట్, ఈనెల 27న సాయంత్రం 6 గంటలకు, మీ జీ తెలుగులో ప్రసారమవుతున్నాయి. పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా కథ అంతర్జాతీయ మాఫియా డాన్ బిగ్ బుల్ (సంజయ్ దత్) చుట్టూ తిరుగుతుందన్నారు. అతని జ్ఞాపకశక్తిని మరొకరి మెదడుకు బదిలీ చేయడం వల్ల అతను అమరుడవుతాని ఒక శాస్త్రవేత్త సూచించడంతో అందుకు సరిపోయే వ్యక్తి కోసం అన్వేషణ మొదలుపెడుతున్నారు. ఆ తర్వాత ఏం జరుగుతుందనే విషయం తెలియాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే డబుల్ ఇస్మార్ట్ సినిమా చూడాల్సిందే అన్నారు. యాక్షన్, కామెడీ, థ్రిల్లింగ్ కాన్సెప్ట్ రూపొందిన ఈ మాస్ఎంటర్టైనర్‌ని జీ తెలుగు వేదికగా ఈ నెల 27న మిస్ కాకుండా చూడాలన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ కీలకం

హైదరాబాద్ : దేశ ఆర్థిక అభివృద్ధిలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ కీలక పాత్ర పోషిస్తుందని ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బిభూతి భూషణ్ నాయక్ తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ (సీఎంఏ) పాత్రపై హిమాయత్‌నగర్ సీఎంఏ భవన్‌లో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, ఫైనాన్షియల్ కన్సల్టెన్సీలో అవసరమైన వైవిధ్యాన్ని అందించడం, కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటింగ్ నిపుణుల వృద్ధిని పెంపొందించడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడే సుదీర్ఘ చరిత్ర ఈ సంస్థకు ఉందన్నారు. కాస్ట్, మేనేజ్‌మెంట్ అకౌంటెంట్స్ పాత్ర పూర్తిగా మారిపోయిందన్నారు.

పోలీసుల త్యాగాల వల్లే మనం ప్రశాంతంగా ఉన్నాం

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పోలీస్ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో పని చేస్తున్న పోలీసుల విధి నిర్వహణ వల్లనే మనమంతా స్వేచ్ఛగా, ప్రశాంతంగా జీవిస్తున్నామని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. శనివారం కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో పాటు ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా సైకిల్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్క్ నుండి మొదలయ్యి, జాతీయ రహదారి మీదుగా రామవరం, రుద్రంపూర్ పోస్ట్ వరకు 13 కిలోమీటర్లు సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు సేవలందిస్తూ, శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడుతూ అహర్నిశలు కష్టపడేది పోలీస్ శాఖ మాత్రమే అన్నారు. దేశ సరిహద్దుల్లో ఉగ్రవాదులతో, ఇక్కడ మన చుట్టూ సమాజంలో సంఘవిద్రోహులు, రౌడీలు గుండాలతో అక్రమార్కుల నుండి మనల్ని కాపాడుతూ ఎంతోమంది పోలీసులు తమ ప్రాణాలు కోల్పోతున్నారని గుర్తు చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ రక్తం గడ్డ కట్టే చలిలో దేశం దురాక్రమణలకు గురికాకుండా ఆక్కడ సైనికులు, సమాజంలో విద్రోహులు, ఉగ్రవాదులతో, చట్టాన్ని కాపాడేందుకు ఇక్కడ పోలీసులు తమ ప్రాణాలు త్యాగం చేస్తున్నారని గుర్తు చేశారు. అందుకే ప్రతి ఏటా అక్టోబర్ 21 నుండి 31 వరకు ఈ సంస్మరణ దినోత్సవ కార్యక్రమాలను జరుపుకుంటున్నామన్నారు. ఈ ర్యాలీలో అదనపు అధికారి కృష్ణ గౌడ్, ఓఎస్డి సాయిమనోహర్, డిఎస్పీ రెహమాన్, ఇన్స్పెక్టర్ నాగరాజు, శ్రీనివాస్, సీఐలు వెంకటేశ్వర్లు, రమాకాంత్, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, ఇంద్రసేనా రెడ్డి, ఆరీబులు రవి, సుధాకర్, కృష్ణారావు, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

గంగపుత్రుల ఆర్థిక అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహబూబాబాద్ - తొర్రూరు : గంగపుత్రుల (మత్స్యకారుల) సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి అన్నారు. శనివారం జిల్లాలోని తొర్రూరు మండలం అమ్మాపురం, హరిపిరాల చెరువులలో మత్స్యశాఖ అధికారులతో కలిసి ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత చేపపిల్లల విడుదల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని చేప పిల్లలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ గంగపుత్రుల ఆర్థిక అభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం చేప పిల్లలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో చేప పిల్లలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చేపల ఉత్పత్తి గణనీయంగా పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అమ్మాపురం చెరువులో 50 వేలు, హరిపిరాల చెరువులో లక్ష 25వేల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వి.శిరీష, పులిపాక రవీందర్, ఎమ్మెల్యే హనుమంతు తిరుపతిరెడ్డి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి గొడుగు శ్రీనివాస్, రూరల్ డెవలప్మెంట్ కమిషన్ డైరెక్టర్ వెంకటనారాయణగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ అచ్చిరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందాడి అశోక్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ చైర్మన్ కొత్తూరు రమేష్, అధికారులు, నాయకులు, మత్స్యకారులు పాల్గొన్నారు.

టపాసుల దుకాణాలకు అనుమతులు తప్పనిసరి : ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల దుకాణదారులు తప్పకుండా సంబంధిత డివిజనల్ స్థాయి పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలని ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అనుమతిలేకుండా టపాకాయల దుకాణాలను నెలకొల్పితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. దీపావళి పండుగ సందర్భంగా జిల్లా పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు నెలకొల్పేవారు వారి వారి సంబంధిత పోలీస్ డివిజనల్ అధికారి కార్యాలయం నుండి ధరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలని సూచించారు. టపాకాయల దుకాణదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలని సూచించారు.

హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిలీనియం కాన్ఫరెన్స్

హైదరాబాద్ : జెకెపి నాలెడ్జ్ పార్క్ (జకెపీ) తన వార్షిక ఫ్లాగ్‌షిప్ ఈవెంట్ 18వ ఎడిషన్ అయినఇంటర్నేషనల్ నాలెడ్జ్ మిలీనియం కాన్ఫరెన్స్ 2024 అక్టోబర్ 26, 27, 28 తేదీలలో, హైదరాబాద్‌లో, 'ఐకేఎమ్‌సి25: యాన్ ఎపిక్ రాప్సోడీ అండ్ ది నెక్స్ట్ సింఫనీ' అనే ప్రధాన థీమ్‌తో జరుగుతోంది. ఈ సంవత్సరం ఐకేఎంసి అనేది జకెపినాలెడ్జ్ పార్క్ 25 సంవత్సరాల వేడుక. 1999లో నిరాడంబరంగా ప్రారంభం కావడంతో జకెపి భారతదేశంలో లైఫ్ సైన్సెస్ కోసం ఏర్పడిన మొదటి సైన్స్ పార్క్‌గా మారింది. గత 25 సంవత్సరాలుగా, జీనోమ్ వ్యాలీలో జకెపిసైన్స్ పార్క్ లారస్ ల్యాబ్స్, డుపాంట్, యూఎస్పీ, సాయి లైఫ్ సైన్సెస్‌తో సహా లైఫ్ సైన్స్ రంగంలోని అనేక ప్రముఖ కంపెనీలకు యాంకర్‌గా ఉంది. ఇన్నేళ్లలో జకెపి వివిధ రంగాలలో దేశవ్యాప్తంగా 1800 స్టార్టప్‌లను తన సహకారాన్ని అందించింది. ఐకేఎంసి 2024 అనేది ఇన్నోవేట్ ప్రయాణాన్ని వేడుక చేసుకునేదిగా ఉంటుంది, భవిష్యత్తు కోసం ఆశావహంతో ఎదురుచూసేదిగా ఉంటుంది. ఈ వేదికపై వ్యాపార నాయకులు, అగ్రశ్రేణి పరిశోధకులు, వ్యవస్థాపకులు, విధాన రూపకర్తలు, ఇతర నిపుణులైన వక్తలు పాల్గొంటున్నారు. సెల్ మరియు జీన్ థెరపీ, వన్ హెల్త్, స్మార్ట్ ప్రోటీన్‌లలో సాధించిన పురోగతి దృష్టి సారించి క్లిష్టమైన చర్చలు, సమావేశాలు, భాగస్వామ్యాలుంటాయి.

వృద్ధి దిశగా ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్

బెంగళూరు : ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ సెప్టెంబర్ 30, 2024తో ముగిసిన త్రైమాసికంలో ఆర్థిక పనితీరును ప్రకటించింది. ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వ్యాపార పనితీరు సారాంశం క్యూ2ఎఫ్‌వై25లో అసెట్లు వివరణకొస్తే, స్థూల లోన్ బుక్ రూ.30,344 కోట్లతో 14% (వైఓవై)/1% (క్యూఓక్యూ) వృద్ధి కనబరించింది. సెప్టెంబర్ 24 నాటికి 34.9% వద్ద సురక్షిత పుస్తకం వర్సెస్ జూన్ 24 నాటికి 31.3%గా ఉంది. క్యూ2ఎఫ్‌వై25 రూ.5,376 కోట్ల చెల్లింపులు 6% తగ్గాయి. డిపాజిట్లు సెప్టెంబర్ 24 నాటికి రూ.34,070 కోట్ల డిపాజిట్లు 17% పెరిగాయి. సిఏఎస్ఏ రూ.8,832 కోట్లతో 26% పెరిగింది. రిటైల్ టీడీ రూ.15,914 కోట్ల వద్ద అంటే 35% పెరిగింది. మూలధన సమృద్ధి నిష్పత్తి 23.4% వద్ద టైర్-1 క్యాపిటల్ 21.6%గా ఉంది. ఉజ్జీవన్ ఎల్లప్పుడూ బలంగా కొనసాగుతుందని ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎండీ, సీఈఓ, సంజీవ్ నౌటియాల్ తెలిపారు.

హిందూస్తాన్ జింక్‌కు ఎల్‌బీఎంఏ సర్టిఫికేషన్ పునరుద్ధరణ

న్యూఢిల్లీ : ప్రపంచంలోని మూడో అతిపెద్ద వెండి ఉత్పత్తిదారు అయిన హిందుస్తాన్ జింక్ లిమిటెడ్ సిల్వర్ రిఫైనరీ కోసం లండన్ బులియన్ మార్కెట్ అసోసియేషన్ (ఎల్‌బిఎంఎ) సర్టిఫికేషన్ పునరుద్ధరించింది. పంత్‌నగర్‌లోని సంస్థ సిల్వర్ రిఫైనరీకి ఎల్‌బిఎంఎ సర్టిఫికేషన్ పునరుద్ధరణ పట్ల హిందుస్తాన్ జింక్ సీఈఓ, అరుణ్‌మిశ్రా సంతోషం వ్యక్తం చేశారు. పంత్‌నగర్ మెటల్ ప్లాంట్ దాని కార్యకలాపాలకు 100 శాతం పునరుత్పాదక శక్తిని అందిస్తుంది. దీంతో ఎల్‌బిఎంఎ గుడ్ డెలివరీ జాబితా ద్వారా 80 గ్లోబల్ సిల్వర్ రిఫైనర్ల ప్రత్యేక జాబితాలో హిందుస్తాన్ జింక్ చేరింది.

అమెజాన్.ఇన్‌లో దీపావళి సంబరాలు

బెంగళూరు : అమెజాన్.ఇన్‌లో దీపావళి సంబరాలు మొదలయ్యాయి. సరైన పార్టీ అవసరాలతో దీపావళి సంబరాలను మరపురాని జ్ఞాపకాలుగా చేయవచ్చని సంస్థ కోరుతోంది. శామ్‌సంగ్, సోనీ పై స్పెషల్ ఆఫర్లు మధ్యతో అమెజాన్ దివాలీ స్టోర్ అవసరమైన ప్రతిది అందజేస్తోంది. పండుగ- పార్టీ వస్తువులపైన ఉత్తేజకరమైన ఆఫర్లను క్రెడిట్, డెబిట్ కార్డ్ లావాదేవీలపై రూ.9,000 వరకు 10% ఆదాతో పాటు పొందవచ్చు. ఐసీఐసీఐ బ్యాంక్, ఏక్సిస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడిఎఫ్ సి ఫస్ట్ బ్యాంక్, హెచ్ఎస్ బిసి బ్యాంక్ నుండి క్రెడిట్ కార్డ్ ఈఎంఐలను కూడా పొందవచ్చు. రూ.10,000కి పైగా చేసిన కొనుగోళ్లపై హోమ్ అండ్ కిచెన్ ఎంపిక చేసిన ఉపకరణాలపై రూ. 1000 తగ్గింపుతో ఇంటిని పునరుత్తేజం చేసుకోవాలని అమెజాన్ కోరుతోంది. కనీసం రూ.1,500 కొనుగోళ్లతో హోమ్, కిచెన్, అవుట్ డోర్ అవసరాలపై రూ.300 తగ్గింపును ఆనందించవచ్చు. ఎత్నిక్ వేర్, వాచీలు, స్మార్ట్ వాచీల పైన ప్రత్యేకమైన డీల్స్‌తో పాటు ప్రముఖ ఫ్యాషన్, బ్యూటీ బ్రాండ్స్‌పై 80% వరకు ఆదాను ఆనందంగా పొందొచ్చు.

ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్ ఆర్థిక ఫలితాలు

ముంబయి : ఐడిబిఐ బ్యాంక్ 2025 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసికం (క్యూ2 ఎఫ్‌వై25) ఆర్థిక ఫలితాలను నేడు ప్రకటించింది. ఈ క్యూ2 ఎఫ్‌వై25కి నికర లాభం రూ.1,868 కోట్లు ఉండగా, ఇది ఏడాది నుంచి ఏడాదికి 39% వృద్ధిని నమోదు చేసింది. నిర్వహణ లాభం 45% వృద్ధితో రూ.3,006 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ మార్జిన్ 4.87% నమోదు కాగా, నికర వడ్డీ ఆదాయం 26% వృద్ధితో రూ.3,875 కోట్లకు చేరుకుంది. అదే విధంగా క్యూ2-2024కి 4.22%తో పోలిస్తే క్యూ2-2025కి డిపాజిట్ ధర 4.66%గా ఉంది. ఇది ఏడాది నుంచి ఏడాదికి 72 బీపీఎస్ వృద్ధితో నికరఎన్‌పిఏ 21.98% వద్ద ఉంది. అప్పులపై రాబడి 1.97%, 38 బీపీఎస్ ఏడాది నుంచి ఏడాదికి వృద్ధితో, ఈక్విటీపై రాబడి 20.35%, ఏడాది నుంచి ఏడాదికి వృద్ధితో 130 బీపీఎస్ వద్ద ఉన్నాయి.

ఐదేళ్లుగా కెనాన్ ఇండియా 'గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ టుగెదర్'

ముంబయి : పర్యావరణ సుస్థిరత పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, కెనాన్ ఇండియా తన 'గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ టుగెదర్ (జీఈటీ) కార్యక్రమంలో భాగంగా 50,000 మొక్కలను నాటి విజయవంతంగా సంరక్షించినట్లు నేడు ప్రకటించింది. వచ్చిని భవిష్యత్తును పెంపొందించే దిశలో జూలై 2019లో ప్రారంభించిన 'గ్రీన్ ఎన్విరాన్‌మెంట్ టుగెదర్' (జీఈటీ) ఇనిషియేటివ్ ఒక ముఖ్యమైన దశకు చేరుకుంది. ఈ కార్యక్రమం ద్వారా, కెనాన్ ఇండియా తన ప్రత్యక్ష వినియోగదారులకు విక్రయించే ప్రతి లేజర్ ప్రింటర్ లేదా మల్టీ-ఫంక్షన్ డివైజ్ (ఎంఎఫ్‌డీ) కోసం ఒక మొక్కను నాటింది. ప్రారంభించినప్పటి నుంచి, కెనాన్ ఇండియా ఏటా 10,000 మొక్కలు నాటి వాటిని వృక్షాలుగా మారేవరకు కాపాడేందుకు కట్టుబడి ఉంది. ఈ నిబద్ధతకు కట్టుబడి, సంస్థ ఐదేళ్లలో 50,000 మొక్కలు నాటింది. ప్రతి చెట్టు కెనాన్ అధిక-నాణ్యత లేజర్ టెక్నాలజీ ఆధారిత మల్టీఫంక్షనల్ ప్రింటర్‌లపై వినియోగదారులు కలిగి ఉన్న నమ్మకాన్ని సూచిస్తుంది.

వారసత్వ ఆస్తిని పొందలేకపోతున్న కుమార్తెలు

హైదరాబాద్ : భారతదేశంలో కుమారుల వలె కుమార్తెలకు కూడా కుటుంబ వారసత్వ ఆస్తిని పొందేందుకు సమాన హక్కులు ఉన్నప్పటికీ, వాస్తవానికి ఇది సత్య దూరంగానే ఉంటుందని, కేవలం ఏడు శాతం కుమార్తెలు మాత్రమే ఆ వారసత్వ హక్కులు పొందుతున్నారని సేఫ్ సెక్యూరిటీస్ వెల్లడించింది. ఈ మేరకు విల్ ఆఫ్ ఛేంజ్ ప్రచారం ద్వారా సేఫ్ కార్యక్రమంలో భాగంగా సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్ పరిశోధన నిర్వహించింది. ఐటిసి లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్ బిస్కట్స్ & కేక్స్ క్లస్టర్ ఆఫీసర్ అలీ హారిస్ షేర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ కేవలం 7% కుమార్తెలు మాత్రమే వీలునామా ద్వారా సమాన వారసత్వాన్ని పొందుతున్నారని తమ అధ్యయనంలో తేలిందని అన్నారు. 'బేటియాన్ పరాయధన్ హోతిహైన్'(కుమార్తెలు వివాహిత వేరొకరి భాధ్యత) అనే దీర్ఘకాల నమ్మకం ఇప్పటికీ భారతీయ కుటుంబాలలో చాలా ప్రబలంగా ఉందన్నారు.

సన్‌ఫీస్ట్ పానీయాలపై ఐటిసి, పిజ్జా హట్ భాగస్వామ్యం

హైదరాబాద్ : ఆహార పరిశ్రమలో దిగ్గజాలు, పిజ్జా హట్, ఐటిసి ఒక భాగస్వామ్యంలో భాగస్వామ్యాన్ని మొదలు పెట్టాయి. ఇందులో భాగంగా పిజ్జా హట్ తమ మెనూలో అత్యధికంగా అమ్ముడవుతున్న సన్‌ఫీస్ట్ పానీయాలు డార్క్ ఫాంటసీ మిల్క్‌షేక్, మ్యాంగో స్మూతీని జోడించనుంది. నాణ్యత అవిష్కరణలపై భాగస్వామ్య దృష్టితో, ఈ భాగస్వామ్యం అన్ని విభాగాలలో మారుతున్న వినియోగదారుల అభిరుచులకు తగినట్లుగా మెరుగైన అనుభవాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి ఐటిసి ఫుడ్స్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ వివేక్ కుక్రేజ్, పిజ్జా హట్ డైరెక్టర్ రోహన్ పెపేకర్ పేర్కొన్నారు. పండుగ సీజన్‌తో పాటు, ఎక్కువమంది ఇష్టపడే సన్‌ఫీస్ట్ పానీయాలను పిజ్జా హట్ అందించే కలిగిన వినియోగదారులకు ప్రత్యేక వేడుకను జోడిస్తున్నాయి. దీపావళి సమావేశాల లేదా రాత్రివేళ ఉత్సవాలైనా, రెండు బ్రాండ్‌లూ ఎంపిక చేయబడిన పానీయాలు అందించడం ద్వారా భోజనానికి పాటు సంపూర్ణంగా ఆనందించవచ్చు, ప్రత్యేక ధరలతో ప్రజలకు సరైన ఎంపికగా డార్క్ ఫాంటసీ మిల్క్‌షేక్ నిలుస్తుందన్నారు.

సంపాదకీయం

విద్యుత్ చార్జీల షాక్

భారీ వర్షాలు, వరదలు, జ్వరాలు, అధిక ధరలతో సతమతమవుతున్న రాష్ట్ర ప్రజల నెత్తిన టీడీపీ కూటమి ప్రభుత్వం మరో భారం మోపింది. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని ప్రకటించిన టీడీపీ కూటమి అధికారం చేపట్టిన నాలుగు నెలలకే హామీని మరచి ట్రూఅప్ చార్జీల పేరుతో భారీగా వడ్డించింది. అధికారానికి వస్తే 'విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం', 'విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తాం' అని ఉమ్మడి మేనిఫెస్టోలో హామీలిచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం భారాలు తగ్గించకపోగా అమాంతం 44 శాతం పెంపుదలకు పూనుకోవడం అత్యంత దారుణం. ఎన్నికల ముందు అధికారం కోసం చార్జీలు పెంచేదిలేదని చేసిన ప్రకటన మేరకు ఈ చార్జీలను ప్రభుత్వమే భరించాలన్న వినియోగదారుల విజ్ఞప్తులను చంద్రబాబు సర్కార్ పెడచెవినపెట్టింది. ఇచ్చిన మాట తప్పి 6,072 కోట్ల రూపాయల భారాన్ని ప్రజలపై మోపింది. ఇంధన, విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు (ఎఫ్‌పీపీసీఏ) చార్జీలు 8,113.60 కోట్ల రూపాయలు వసూలు చేసుకునేందుకు అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ)కి డిస్కంలు ప్రతిపాదించాయి. గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి రూ. 2,194 కోట్లు, వ్యవసాయ విద్యుత్ సర్వీసుల నుంచి రూ. 1,901 కోట్లు, పారిశ్రామిక సర్వీసుల నుంచి రూ. 2,748, వాణిజ్య సర్వీసుల నుంచి రూ. 669 కోట్లు, ఇన్‌స్టిట్యూషన్స్ నుంచి రూ.547 కోట్లు చొప్పున విద్యుత్ బిల్లులలో అదనంగా వసూలు చేసుకుంటామని అడిగాయి. ప్రతి నెల ఒక్కో బిల్లుపైనా యూనిట్‌కు రూ.1.27 చొప్పున వసూలు చేస్తామని తెలిపాయి. ఈ చార్జీల వసూలుకు ఏపీఈఆర్సీ అనుమతించకపోతే రాష్ట్ర ప్రభుత్వమే 75 శాతం భారం భరించాల్సి ఉంటుందని డిస్కంలు స్పష్టం చేశాయి. డిస్కంల ప్రతిపాదనపై ఈ నెల 18న ఏపీఈఆర్సీ బహిరంగ విచారణ నిర్వహించింది. ఈ భారం ప్రభుత్వమే భరించాలనీ, ప్రజలపై వేయకూడదని విచారణలో పాల్గొన్న వివిధ వర్గాల వారు విజ్ఞప్తి చేశారు. చార్జీలు భరించడంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి సంకేతాలు రాకపోవడంతో వారం రోజులు వేచిచూసిన ఏపీఈఆర్సీ 6,072.86 కోట్ల రూపాయల సర్దుబాటు చార్జీల వసూలుకు అనుమతిస్తూ శుక్రవారం తన నిర్ణయాన్ని వెల్లడించింది. రైతులు, వివిధ వర్గాల వారికి ఉచితంగా, సబ్సిడీగా ఇచ్చిన విద్యుత్‌పై దాదాపు రూ. 1400 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం నుంచి వసూలు చేసుకోవలసిందిగా డిస్కంలకు ఏపీఈఆర్సీ సూచించింది. మిగిలిన రూ. 4,672.86 కోట్ల భారం ప్రజలపై పడనున్నది.

ఈ మొత్తాన్ని వినియోగదారులు వాడిన విద్యుత్‌కు నవంబరులో జారీచేసే బిల్లు నుంచి 15 నెలలపాటు వసూలు చేయాలన్న ఏపీఈఆర్సీ ఆదేశాల మేరకు 2026 జనవరి వరకు వినియోగదారులు ఈ భారాన్ని మోయాల్సివుంటుంది. డిస్కంలు మొత్తం రూ.8,114 కోట్లు ప్రతిపాదిస్తే అందులో రూ. 2,042 కోట్లు తగ్గించి వినియోగదారులకు ఉపశమనం కలిగించినట్టు ఏపీఈఆర్సీ పేర్కొనడం గమనార్హం. ఇప్పటికే చుక్కలనంటుతున్న ధరలతో సతమతమవుతున్న సామాన్య ప్రజానీకానికి ఇది మోయలేని భారమే. ఎస్పీడీసీఎల్ పరిధిలో నెలకు యూనిట్‌కు సరాసరి అత్యధికంగా 83 పైసలు, సీపీడీసీఎల్ పరిధిలో 79 పైసలు, ఈపీడీసీఎల్ పరిధిలో 80పైసలు అదనంగా వసూలు చేసుకునేందుకు ఏపీఈఆర్సీ అవకాశం కల్పించింది. ఫలితంగా నవంబర్ నుంచి ప్రతి యూనిట్‌పై రూ.1.58పైసల వరకు అదనపు భారం ప్రజలపై పడుతుంది. ఇంతేకాకుండా ఎఫ్‌పీపీసీఏ పేరిట వినియోగదారుల నుంచి విద్యుత్ సంస్థలు వసూలు చేస్తున్న అదనపు మొత్తం నొప్పి వినియోగదారులకు తెలియకుండా వసూలు చేసుకునేందుకు ఏపీఈఆర్సీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. మొదటి, నాలుగో త్రైమాసికంలో వసూలు చేయాల్సిన ఎఫ్‌పీపీసీఏ (ట్రూఅప్) మొత్తాన్ని సమానంగా విభజించి రెండు నెలల్లో వసూలు చేసుకునేందుకు డిస్కంలను అనుమతించింది. స్వల్పకాలిక కొనుగోళ్ల పేరుతో గత ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం సైతం కొనసాగించడం అత్యంత విచారకరం. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదించిన వీటీపీఎస్, కృష్ణపట్నం మూడో యూనిట్ థర్మల్ కేంద్రాలను నిర్లక్ష్యం చేయడంతో డిస్కంలు బహిరంగ మార్కెట్లో ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం కూడా ప్రస్తుత విద్యుత్ భారాలకు కారణంగా చెప్పవచ్చు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అంతకుముందున్న టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా సర్దుబాటు పేరిట విద్యుత్ చార్జీలను పెంచాల్సి వచ్చిందని చెప్పింది. ప్రస్తుతం ఉన్న టీడీపీ ప్రభుత్వం కూడా గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన తప్పుడు విధానాల వల్లే చార్జీలను పెంచాల్సి వచ్చిందని చెపుతోంది. ఏదిఏమైనప్పటికీ ఈ రెండు ప్రభుత్వాలు కూడా ప్రైవేట్ ఉత్పత్తిదారుల నుంచి ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలుచేసి ఆ భారాన్ని ప్రజలపై మోపుతున్నాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

గత ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకొస్తే విద్యుత్ చార్జీల భారాలను ప్రజలపై మోపబోమని హామీ ఇచ్చి అధికారం చేపట్టిన తెలుగుదేశం ఇప్పుడు రూ.6072 కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై వేయడం దుర్మార్గం. రాష్ట్ర ప్రజలకిచ్చిన వాగ్దానాన్ని విస్మరించడమే. విద్యుత్ చార్జీల భారం మోపడాన్ని ప్రతిపక్షాలు ముఖ్యంగా వామపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ భారాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికే ధరల పెరుగుదల, మరోవైపున ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై ఇలా విద్యుత్ భారం మోపడం అమానుషం. ఏనాడో వాడిన విద్యుత్‌కు ఏళ్ల గడిచిపోయాక అదనంగా చార్జీలు చెల్లించాలన్న ఎఫ్‌పీపీసీఏ విధానం మోసపూరితమైనది. ప్రపంచ బ్యాంకు ఆదేశిత విద్యుత్ సంస్కరణల్లోని దుర్మార్గమైన షరతుల్లో ఇది ముఖ్యమైనది. 2022–23లో వాడిన విద్యుత్‌కు ఈ నవంబర్ నెల నుంచి 2026 జనవరి వరకు కొన్ని నెలల్లో యూనిట్‌కు దాదాపు 83 పైసల వరకూ అదనంగా చెల్లించాలన్న తాజా ఉత్తర్వు విద్యుత్ వినియోగదార్లందరికీ ఆశనిపాతమే. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన మొదట్లోనే విద్యుత్ చార్జీల భారం ఈ విధంగా ఉంటే మిగిలిన నాలుగున్నరేళ్లలో పరిస్థితి ఎలా ఉంటుందోనని జనం భయపడుతున్నారు. మాటతప్పి ప్రజలపై వేసిన ట్రూఅప్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలి. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఎనిమిదిసార్లు విద్యుత్ చార్జీలను పెంచి ఎన్నికల్లో ఓడిపోయిన విషయాన్ని గుర్తెరిగి చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించాలి. లేకుంటే ఆయన కూడా ప్రజాగ్రహాన్ని మరోసారి చవిచూడాల్సివస్తుందనడంలో సందేహంలేదు. ట్రూఅప్ చార్జీల భారాన్ని నిరసిస్తూ శనివారం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో సీపీఐ, సీపీఎం అధ్వర్యాన నిరసన కార్యక్రమాలు జరిగాయి. రాష్ట్రవ్యాప్త కార్యాచరణను ఈ రెండు పార్టీలు రూపొందించే ఆలోచనలో ఉన్నాయి. ప్రజలు ఉద్యమించే పనిలేకుండా ప్రభుత్వం వివేకంతో ఆలోచిస్తుందని ఆశిద్దాం.

ఎన్నికలకు ముందే ట్రుడోకు ఉద్వాసన!

అక్టోబరు నెల మధ్య నుంచి జరుగుతున్న పరిణామాలతో భారత్–కెనడా సంబంధాలు తీవ్ర వత్తిడికి గురవుతున్నాయి. అమెరికా, దాన్ని అనుసరించే దేశాలన్నీ మన మీద కత్తిగట్టినట్లుగా వ్యవహరిస్తున్నాయి. ఇదే సమయంలో కెనడా పాలకపక్షంలో కొందరు ఎంపీలు ప్రధాని జస్టిన్ ట్రుడో 2024 అక్టోబరు 28 లోగా పదవి నుంచి తప్పు కోవాలని, మరోసారి ఎన్నికల గోదాలో దిగవద్దని 153 మంది పాలక పార్టీ ఎంపీల్లో 24 మంది డిమాండ్ చేసినట్లు కెనడా బ్రాడ్‌కాస్ట్ కార్పొరేషన్ వార్తను ప్రసారం చేసింది. ఇది ఏ రూపం తీసుకుంటుందో తెలియదు. అంతకు ముందు పరస్పరం కొందరు దౌత్యవేత్తల బహిష్కరణ మిగిలిన సిబ్బందిపై నిఘా వంటి ప్రకటనలతో ఇరుదేశాల మధ్య దౌత్య యుద్ధం, ప్రచారదాడి జరుగుతోంది. ఇది రాసిన సమయానికి 270 కిపైగా భారత విమానయాన సంస్థలు నిర్వహిస్తున్న సర్వీసులకు బాంబు బెదిరింపులు రావటం ఆందోళన కలిగించే పరిణామం. గురువారం ఒక్కరోజే 95 విమానాలకు బెదిరింపులు వచ్చాయి. గతంలో ఇలాంటి పరిస్థితిని మనం ఎప్పుడూ ఎదుర్కోలేదు. ఏ విమానం ఎక్కితే బాంబు ఉన్నట్లు సమాచారం వస్తుందో తెలియని దోలాయమానంలోకి ప్రయాణీకులను నెట్టి భయాన్ని సృష్టించమే ఈ ఉదంతాల వెనుక ఉన్న శక్తుల ఎత్తుగడగా కనిపిస్తోంది. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా నడిపితే, ఏదైనా విమానంలో నిజంగా బాంబుపెడితే జరిగే ఘోరాన్ని తలచుకోవాలంటేనే వణుకుపుడుతోంది. దేశం 1980 దశకం నాటి ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే పరిస్థితులకు వెళుతోందా అనే సందేహాలు వెల్లడవుతున్నాయి. ఉగ్రవాదాన్ని శాంతి భద్రతల సమస్యగా మాత్రమే చూడకూడదు. అలా పరిగణిస్తే దాన్ని నివారించే బాధ్యత, పోలీసు, ఇతర భద్రతా వ్యవస్థలపై పడుతుంది. అలాంటి సంస్థలు ప్రపంచ వ్యాపితంగా అనుసరించిన దగ్గరి దారి ఏమంటే జనం మీద దాడికి దిగటం. కిరాయికి లేదా ప్రత్యేక ముఠాలను రూపొందించి ఉగ్రవాదులు, ఇతర దేశ వ్యతిరేకులను మట్టుబెట్టించటం. ఇది ఒక విధంగా అధికారిక ఉగ్రదళం వంటిదే. ఉగ్రవాదులు తలెత్తకుండా ఉండాలంటే ఉగ్రవాదాన్ని నిర్మూలించాలి, అవాంఛనీయ చర్యలకు పాల్పడినపుడు అవసరమైతే ఆయుధ ప్రయోగం చేయవచ్చు.మన కళ్ల ముందే పలస్తీనా దేశాన్ని విభజించి యూదుల మాతృభూమి పేరుతో ఇజ్రాయెల్ ఏర్పాటు జరిగింది. ఉనికిలో ఉన్న పలస్తీనా అదృశ్యమైంది. దాని పునరుద్దరణకు ఏడు దశాబ్దాలుగా పోరాటం సాగుతున్నది. యావత్ పలస్తీనియన్లు దానిలో పాల్గొంటున్నారు. వారిని కూడా ఉగ్రవాదులుగా అమెరికా చిత్రిస్తున్నది. ప్రపంచంలో వేర్వేరు కారణాలతో అనేక చోట్ల ఆందోళనలు సాగుతున్నాయి. ఈ పూర్వరంగంలో ఖలిస్తాన్ ఏర్పాటు అన్న భావనను మెజారిటీ సిక్కులు వ్యతిరేకిస్తున్నారు. వ్యక్తిగత స్థాయిలో సమర్ధించిన వారందరూ ఉగ్రవాదులు కాదు, దానికోసం ఆయుధాలు చేపట్టి, అవాంఛనీయ చర్యలకు పాల్పడిన వారు మాత్రమే తీవ్రవాదులు.

మనదేశంలో నాగాలాండ్, మిజోరాం, కశ్మీరు, పంజాబ్ వేర్పాటు వాదం తలెత్తింది. ఆయుధాలు రంగంలోకి వచ్చాయి. వాటన్నింటికీ అమెరికా, కెనడా,బ్రిటన్, వంటి పశ్చిమదేశాలు మద్దతు ఇస్తున్నాయి, ఆ శక్తులకు ఆశ్రయం కల్పిస్తున్నాయి. ఒక్క మనదేశమే కాదు శ్రీలంక వేర్పాటు వాదుల వెనుక, అనేక దేశాల్లో రకరకాల పేర్లతో ఉన్న శక్తులకు మద్దతు ఇస్తున్నదీ ఈ దేశాలే. దాని వెనుక తమను వ్యతిరేకించే దేశాలను అస్థిరపరచటం లేదా విచ్ఛిన్నం చేసే సామ్రాజ్యవాదులు ఎత్తుగడ ఉంది, దానికి ఉగ్రవాదం ఒక ఆయుధం. కొన్ని సందర్భాలలో ఉగ్రవాద చర్యలు నిలిచిపోయాయంటే దాని అర్ధం తెరవెనుక పశ్చిమదేశాలకు అనుకూలమైన పరిణామాలు జరిగినట్లే లెక్క. తిరిగి ప్రారంభమయ్యాయంటే పూర్తిగా తమకు లొంగలేదని అవి కథ నడిపిస్తున్నట్లే. లేకుంటే ఆకస్మికంగా గత పదిరోజులుగా మాత్రమే మన విమానాలకు బాంబుల బెదిరింపులు ఎందుకు వస్తున్నాయి? అవి ఐరోపా ఖండ దేశాల నుంచే ఎలా వస్తున్నట్లు. ప్రపంచ ఉగ్రవాదుల అణచివేతకు తాయత్తు కట్టుకొని బరిలోకి దిగామని చెబుతున్న అమెరికా, కెనడా వంటి దేశాలు ఖలిస్తాన్ ఉగ్రవాదులకు ఆశ్రయం ఎందుకు కల్పిస్తున్నట్లు, వారికి పౌరసత్వం ఎందుకు ఇస్తున్నాయి. పంజాబీలందరూ ఖలిస్తానీవాదులు కాదు, ఉగ్రవాదులూ కాదు. మన దేశాన్ని లొంగతీసుకోవాలని కోరుకొనే పశ్చిమదేశాలకు మేకపిల్ల–తోడేలు కథ మాదిరి ఏదో ఒకసాకుతో ఉగ్రశక్తులను రెచ్చగొట్టేందుకు అవకాశాలున్నాయనేది కెనడా ఉదంతం వెల్లడిస్తోంది.

– ఎం కోటేశ్వరరావు

బీజేపీ ఓటమికి ఐక్యత అవశ్యం

డి. రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

తాజాగా జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తిరిగి అధికారంలోకి రావడంతోపాటు జమ్మూ ప్రాంతంలో అత్యధిక స్థానాలను గెలుచుకోవడం దేశంలోని లౌకిక ప్రజాస్వామ్య శక్తులకు, ముఖ్యంగా ఇండియా ఐక్యసంఘటనకు ఆందోళన కలిగించే విషయం. ఈ ఊహించని ఈ పరిణామం కూటమిలోని పార్టీలను అంతర్మధనానికి గురిచేశాయి. ఈ నేపథ్యంలో సీపీఐతో సహా కూటమిలో అతిపెద్ద భాగస్వామిగా ఉన్న కాంగ్రెస్, ఇతర పార్టీలు ఆత్మపరిశీలన చేసుకోవాలని పిలుపునిచ్చాయి. ఎన్నికల సమయంలో, ప్రత్యేకించి పార్టీల మధ్య సీట్ల పంపకాల విషయంలో రాజ్యాంగ విలువలు పాటించడంతోపాటు పార్టీల మధ్య పరస్పర ఐక్యత, గౌరవం, నమ్మకం చాలా ప్రధానమైన అంశాలుగా పేర్కొన్నాయి.

మొత్తం మీద ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో, లౌకిక–ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత బలంగా ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ దాని మిత్రపక్షాల సీట్ల సంఖ్య మెజారిటీ మార్కు కంటే తక్కువకు పడిపోయాయి. బీజేపీ గెలుపొందిన సీట్ల సంఖ్య గణనీయంగా తగ్గడంతో, రాజకీయ స్పెక్ట్రంలోని కొన్ని వర్గాలు ఉత్సాహంగా ఉన్నాయి. ఈ ఎన్నికలు మన దేశ చరిత్రలో కీలకమైన ఘట్టంగా అభివర్ణించవచ్చు. ఏది ఏమైనప్పటికీ, భారతదేశం వంటి ప్రజాస్వామిక దేశాల్లో మతతత్వ పార్టీల నుంచి దేశ ఐక్యతకు, అభివృద్ధికి తీవ్ర ముప్పు పొంచి ఉందనేది చాలా పార్టీలు గుర్తించడం లేదు.

ఈ ఎన్నికల్లో కేవలం బీజేపీకే ప్రజలు పూర్తి మెజారిటీ ఇవ్వలేదనేది మరో ముఖ్యమైన అంశం. మన దేశ రాజ్యాంగాన్ని, దాని విలువలను పరిరక్షించే ప్రతిపక్షాన్ని ప్రజలు విశ్వసించినట్లుగా మనం ఇక్కడ గుర్తించవలసిఉంది. ఆర్ఎస్ఎస్–బీజేపీలను ఓడించి, వారి సైద్ధాంతిక మత ప్రభావం నుండి సమాజాన్ని, రాజకీయాలను ప్రక్షాళన చేయాలంటే, మన స్వాతంత్ర్య పోరాట వారసత్వాన్ని అమలు చేయవలసిన అవసరంఉంది. ఈ సుదీర్ఘ పోరాటంలో లౌకిక, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యత ప్రధానమైన అంశం. మన దేశాన్ని మితవాద మతతత్వ ఫాసిస్ట్ శక్తుల నుండి రక్షించడం మన ముందున్న ప్రధాన కర్తవ్యం.

పాట్నాలో జరిగిన ఇండియా కూటమి మొదటి సమావేశం ఏర్పాటులో సీపీఐ ప్రధాన పాత్ర పోషించింది. మన దేశంలో ఆర్ఎస్ఎస్–బీజేపీ కూటమి అధికారంలోకి రాకుండా దేశంలోని అన్ని లౌకిక–ప్రజాస్వామ్య శక్తుల మధ్య నిర్దిష్టమైన ఐక్యతకు, కార్యాచరణకు భారత కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

తాజాగా జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాల నుండి మనం కొన్ని గుణపాఠాలను నేర్చుకున్నాం. మన దేశంలో లౌకికవాదం, సామ్యవాదం, సామాజిక న్యాయం, రాజ్యాంగం ప్రయోజనాల దృష్ట్యా, లౌకిక–ప్రజాస్వామ్య శక్తుల మధ్య ఐక్యత,పరస్పర గౌరవం, సైద్ధాంతిక స్పష్టత తప్పనిసరి. అయితే ఈ ఎన్నికల ద్వారా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కూటమికి చెందిన ప్రధాన పార్టీలు అమలు చేయవలసిన విధి విధానాలు, సీట్ల పంపకాల విషయాల్లో ఐక్యత పాటించినప్పుడే అన్ని రాజకీయపార్టీల కార్యకర్తలు ఉత్సాహంగా ఎన్నికల్లో పాల్గొంటారు. ప్రజలు ఆర్ఎస్ఎస్–బీజేపీ నీచమైన ఆలోచనలను తిప్పికొట్టే అవకాశం ఉంది.

కేంద్రంలో ఉన్న ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం కాదు. అదానీ, అంబానీ లాంటి కుబేరుల ప్రభుత్వమిది. దేశభక్తిపేరుతో బీజేపీ ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది. స్వాతంత్ర్యంకోసం దేశప్రజలంతా పోరాటంచేస్తున్న దశలో ఆర్ఎస్ఎస్ పూర్వపు జనసంఘ్‌లు స్వాతంత్ర్య పోరాటానికి దూరంగాఉండి ప్రజలను మోసగించారు. స్వాతంత్ర్యంకోసం దేశప్రజలలో చివరకు ప్రాణత్యాగాలకు కూడా వెనుకాడలేదు. ఒకవైపు ఆర్థిక అసమానతలు పెరుగుతుండగా అదే సమయంలో సంపన్నుల సంఖ్య కూడా పెరుగుతోంది. దేశంలో అన్నిరకాల నిత్యజీవితావసర వస్తువులు అపారంగా పెరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమకేమీ పట్టనట్లు మౌనం వహిస్తున్నాయి. ప్రజల ఆదాయాలు పెరగకపోగా ఆకాశాన్ని అంటుతున్న ధరలు ప్రజలకు మరింత భారంగా తయారయ్యాయి. అదే సమయంలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలలో ఏ విధంగానైనా గెలవడం కోసం అనేక అడ్డదారులు బీజేపీ తొక్కుతోంది. అంతేకాదు, ఉచితాలు ఇస్తే దేశార్థిక వ్యవస్థ దెబ్బతింటుందని చెప్పే ప్రధాని మోదీ బీజేపీకి అవసరమైనప్పుడు వేల కోట్ల రూపాయల ఉచితాలను ప్రకటించడమేకాక ఎన్నికలకు ముందే ఓటర్ల బ్యాంకు ఖాతాల్లో డబ్బువేస్తున్నారు. ఇది లంచంకాక మరొకటి ఎలా అవుతుంది?

రాజకీయ పార్టీలమధ్య పరస్పర విశ్వాసం, స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఇండియా ఐక్య సంఘటనలోని అన్ని పార్టీలకు సీపీఐ విజ్ఞప్తి చేస్తుంది. దేశంలో కూటమి కార్యాచరణ, విలువలపై దేశ ప్రజలకు ఉన్న నమ్మకం, విలువలను కాపాడుకోవడం ద్వారా ప్రజలకు సుసంపన్నమైన భవిష్యత్తును అందించడం మన ముందున్న సమిష్టి బాధ్యత.

రాజకీయ పార్టీలమధ్య పరస్పర విశ్వాసం, స్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఇండియా ఐక్య సంఘటనలోని అన్ని పార్టీలకు సీపీఐ విజ్ఞప్తి చేస్తుంది. దేశంలో కూటమి కార్యాచరణ, విలువలపై దేశ ప్రజలకు ఉన్న నమ్మకం, విలువలను కాపాడుకోవడం ద్వారా ప్రజలకు సుసంపన్నమైన భవిష్యత్తును అందించడం మన ముందున్న సమిష్టి బాధ్యత. లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వం విలువలను నిలబెట్టి, ప్రజాసేవలో మచ్చలేని రికార్డులను కలిగి ఉన్న పార్టీలు, అభ్యర్థులకు ఓటువేసి మద్దతు ఇవ్వాలని సీపీఐ దేశ ప్రజలకు విజ్ఞప్తి చేస్తుంది.

నాటి దీప దానోత్సవమే నేటి దీపావళి!

డాక్టర్ దేవరాజు మహారాజు

దీపావళి అంటే దీపాల వరుస. చుట్టూ ఉన్న చీకట్లను పారద్రోలి వెలుగు నింపడానికి సంకేతంగా ఆ పండగ చేస్తున్నామని చెపుతారు. చెడు మీద మంచి సాధించిన విజయం అని కూడా చెపుతారు. అయితే, దాని చుట్టూ అల్లుకున్న పౌరాణిక గాథలు చాలా ఉన్నాయి. శ్రీకృష్ణుడు, నరకాసురుడితో యుద్ధం చేస్తున్న సమయంలో సొమ్మసిల్లి పోయాడనీ, పక్కనే ఉన్న సత్యభామ ఉగ్రరూపం దాల్చి, బాణాల వర్షం కురిపించి నరకాసురుణ్ణి సంహరించిందనీ– ఒక పౌరాణిక గాథ ఉంది. మహాకాళి రాక్షస సంహారం చేసినందుకు దేవీ నవరాత్రులు జరుపుకుంటున్నట్లు– మరో కథనం ఉంది. ఇవికాక, దశ–హరా (దసరా) కు దీపావళికి దగ్గరి సంబంధం ఉంది. ఆ రెండు పండగలు వెంట వెంటనే వస్తాయి. రాముడు లంకాధీశుడైన పది తలల రావణుణ్ణి చంపినందువల్ల దసరా జరుపుకుంటున్నామని చెపుతారు. దశ–హరా అంటే పది తలలు నరికేయడం. రావణుడి పది తలలు నరికి సంహరించిన తర్వాత, రాముడు సీతాలక్ష్మణులతో సహా అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భాన్ని దీపావళిగా జరుపుకుంటున్నామని కథ చెపుతారు. పౌరాణిక గాథలు బావున్నాయి కాని, పురాణ పాత్రలు చనిపోతే, పురాణ పాత్రలు విజయం సాధిస్తే పండగలు జరుపుకోవడం ఏమిటీ? ఇందులో ఉన్న అసలు మతలబు ఏమిటీ? విషయం తెలుసుకోవాలన్న ఉత్సుకత, గతాన్ని అవలోకనం చేసుకోగల సామర్థ్యం, ఓపిక ఉంటే నిజాలు బయటపడతాయి. మన పెద్దవాళ్లు చెప్పారనో, జరుపుకోవడం మన ఆచారం అనో, ఆనవాయితీ అనో... కల్పిత గాథల ఆధారంగా అనాలోచితంగా జరుపుకుంటే జరుపుకోవచ్చు. కానీ, వాస్తవం వేరే ఉంది.

సాహిత్య రచనల్లో పాత్రల మధ్య యుద్ధాలు జరగొచ్చు. కొట్లాటలు జరగొచ్చు. ఓ పాత్ర విజయం సాధించొచ్చు. మరో పాత్ర పరాజయం పొందొచ్చు. అంత మాత్రానికి ప్రజలు ఉబ్బితబ్బిబ్బై పండగలు జరుపుకోవాలా? పురాణ పాత్రలు మరణిస్తే పండగలు, వేడుకలు జరుపుకోవడం ఎందుకూ? ఒకవేళ ప్రపంచం మొత్తానికి సంబంధించింది అయితే, అప్పుడు ప్రపంచ దేశాలన్నీ కలిసి జరుపుకునేవి. కానీ, భారతదేశంలోని దాదాపు అన్ని పండగలు పురాణాల్లోని రాక్షసుల మరణాలపైనే ఎందుకు జరుపుకుంటున్నారూ? ఆలోచించాలి కదా? రాముడు ఆర్యుడు. బయటి నుంచి వచ్చిన ఆర్యులకు ఇక్కడి మూలవాసులైన ద్రావిడులకు మధ్య జరిగిన సంఘర్షణల్ని పురాణాలుగా రాసుకున్నారని పెరియార్ చెప్పారు. ఇక్కడి మూలవాసుల్ని కోతులుగా, రాక్షసులుగా చిత్రించి, ఆర్యులు అవమానించారని కూడా ఆయన చెప్పారు. ఉత్తర భారతదేశంలో పండగలని 'త్యౌహార్' అని అంటారు. హిందీలో తూహారా– అంటే "నువ్వు పరాజితుడివయ్యావు"– అని అర్థం! రావణుడు, నరకాసురుడు వగైరా ఎవరు పరాజితులైనా పండగ జేసుకోవడానికి ఈ పదం వాడుతారు. ఎదుటి వారి (శత్రువు) పరాజయాన్ని లేదా మరణాన్ని ఒక ఉత్సవంగా జరుపుకోవడమే– త్యౌహార్. పురాణాలన్నీ బుద్ధుడి తర్వాత రాసుకున్నవేనని– బౌద్ధాన్ని నాశనం చేసే క్రమంలో రాశారని రూఢీగా తెలిసిపోయింది. పుష్యమిత్ర శృంగుడిని దృష్టిలో ఉంచుకుని రాముడి పాత్రకు రూపకల్పన జరిగిందని స్పష్టమైంది. మరి ఇక్కడ ఈ దీపావళికి అసలు కారణమేమిటి? దానిని ముందు ఏమని పిలిచేవారు? అది ప్రజా జీవనంలోకి ఎలా వచ్చింది? అసలు కారణం తెలుసుకోవాలంటే మనం గౌతమబుద్ధుడి విషయాలు లేదా అతని మార్గాన్ని అవలంబించిన చక్రవర్తి. అశోకుడి విషయాలు మాట్లాడుకోవాలి.సిద్ధార్థుడు బుద్ధుడైన తర్వాత, తన నగరమైన కపిలవస్తు పురానికి వెళ్లలేదు. తండ్రి శుద్ధోధనుడు బుద్ధుణ్ణి ఒప్పించి తీసుకురావల్సిందిగా కొంతమందిని పంపాడు. వారు బుద్ధుడిని అన్వేషిస్తూ వెళ్లారు. కానీ, అతడి ప్రభావానికి లోనై... ఆయనతో పాటే ఉండిపోయారు. తండ్రి శుద్ధోధనుడు

మనుషుల్ని పంపుతూనే ఉన్నాడు. కాని, వెళ్లిన వారు వెళ్లినట్లు బుద్ధుడి దగ్గరే బౌద్ధ భిక్కులుగా ఉండిపోతున్నారు. అలా పదిహేడు సంవత్సరాలు గడిచిపోయాయి. చివరకు ఎలాగో బుద్ధుడు తన నగరానికి బయలుదేరాడు. ఆయన వస్తున్నాడని తెలిసి స్వాగతం పలకడానికి పుర ప్రజలు సంసిద్ధులయ్యారు. అప్పటికి వర్షాకాలం అయిపోయింది. వరదలకు కొట్టుకొచ్చిన చెత్తాచెదారం వీధుల్లో ఉంది. వర్షాలకు నాని ఇళ్లు నిమ్మగా అయ్యాయి. ప్రజలు వీధులు శుభ్రం చేసుకుని, ఇళ్లు శుభ్రం చేసుకుని, గోడలకు వెల్ల వేసుకుని, గుమ్మాలకు పూలమాలలు వేలాడేసుకుని సర్వాంగ సుందరంగా అలంకరించు కున్నారు. ఆ రోజు అమావాస్య గనక, నగరమంతా దేదీప్యమానంగా దీపాలు వెలిగించారు. ఉన్నవారు లేనివారికి మంచి ఆహారం అందించారు. ఉన్నవారు లేనివారికి దీపాలు దానం చేశారు. అదే దీప దానోత్సవంగా స్థిరపడింది.

దీపం అంటు జ్ఞానానికి సంకేతం. ప్రాణానికి సంకేతం. జ్ఞానవంతుడై ప్రపంచానికి జ్ఞానాన్ని వెదజల్లిన బుద్ధుడి రాకకు సంకేతమే దీప దానోత్సవం! బుద్ధుడు తన జ్ఞానాన్ని ప్రపంచానికి దానం చేశాడని చెప్పడానికి ప్రతీకే– ఈ దీపాలు వెలిగించడం! ఇది చరిత్రకు సంబంధించిన విషయం గనుక ఆధారాలు ఉంటాయి. పురాణ సంఘటనలకు చారిత్రక ఆధారాలు ఉండవు. అందుకే లక్ష్మిగణేష్ పూజకు, నరకాసుర వధకు ఎక్కడ ఏ ఆధారమూ దొరకదు. దీప దానోత్సవం– అంటే జ్ఞాన దానోత్సవంగా మనం అర్థం చేసుకోవాలి. ఆలోచిస్తే ఇది సబబుగా తోస్తుంది. వైదిక ధర్మ ప్రబోధకులు ప్రచారం చేసినవీ అన్నీ కల్పించిన కట్టు కథలని తెలుస్తూనే ఉంది. శ్రీకృష్ణుడు, నరకాసురుడు, సత్యభామ, లక్ష్మీగణేషుడు అన్నీ పురాణాల్లో కల్పించిన పాత్రలు. వాస్తవంగా ఈ దేశం మీద పుట్టి పెరిగిన వారుకాదు. బుద్ధుడు కపిలవస్తుకు తిరిగి రావడాన్ని రాముడు అయోధ్యకు తిరిగి రావడంగా మార్చిరాసుకున్నారు. భ్రమల్ని నమ్ముతూ బతికే వారితో మనకు గొడవ లేదు. వారి భ్రమల్ని మనం నమ్మాలంటేనే గొడవ. అది జరిగే పనికాదు–

"దీప దానోత్సవం" అంటే మన ఇంటి వెలుగని ఇతరులక్కూడా పంచడం. మన జ్ఞానాన్ని ఇతరులక్కూడా పంచడం అనేది ఇక్కడ ప్రతీకగా తీసుకోవాలి. పదిహేడేళ్ల తర్వాత తిరిగి వచ్చిన, సాఖ్యముని తథాగతుని మనస్ఫూర్తిగా ఆనందంగా ఆహ్వానించడమే– దీప దానోత్సవమైంది. సామాన్య శకానికి (బీసీఇ) ముందు జరిగిన ఒక సంఘటన అది. ఇందులో భ్రమలు, కల్పితాలూ లేదు. బుద్ధుడు వాస్తవంగా ఈ నేల మీద తిరిగినవాడు. బుద్ధుడి కరుణను, దయాగుణాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధులు ఈరోజు వరకు ఆ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నారు. బుద్ధుడి తర్వాత చాలాకాలం గడిచిపోయింది. మౌర్య చక్రవర్తి అశోకుడి (304– 232 బీసీఇ) కాలం వచ్చింది. ఆయన ఈ దేశ మూలవాసి. బహుజనుడు. మౌర్య అనేది మోర్– నెమలి...వారి అధికారిక పక్షి వల్ల వచ్చింది. ఆయన కళింగ యుద్ధంలో విజయం సాధించాడు. పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం జరిగినందుకు, లక్షల మంది నిరాశ్రయులైనందుకు విజయ గర్వంతో ఆయన వేడుకలు చేసుకోలేదు. ఆత్మ విమర్శ చేసుకున్నాడు. పశ్చాత్తాపంతో దుఃఖించాడు. ఆయుధాలు త్యజించి అహింసను ఆహ్వానించాడు. హింసాత్మకంగా విజయాలు సాధించి వేడుకలు చేసుకున్న చక్రవర్తులు ప్రపంచ చరిత్రలో ఉన్నారు. కాని, విజయానికి కృంగిపోయి, యుద్ధాన్ని త్యజించి, శాంతిని ఆహ్వానించిన ఒకే ఒక్క మహనీయుడు అశోక చక్రవర్తి. మానసిక పరివర్తన వల్ల తను చేసిన రక్తపాతానికి పరితపిస్తూ బౌద్ధ మార్గం స్వీకరించాడు. అలాంటి సందర్భంలో శోకతప్త హృదయంతో సంతాప దినాలు ప్రకటించాలి. కానీ ఆయన అలా చేయలేదు. అంధకారాన్ని పారద్రోలే దీపాలు వెలిగించమన్నాడు. వేలవేల దీపాలతో ప్రజల జీవితాల్లో శాంతి, అహింస, సత్యం, నిజాయితీ, నిబద్ధత, నైతికతలు వెలిగిపోవాలని ఆకాంక్షించారు.

దీప దానోత్సవ వివరాలన్నీ పాళీ భాషలో రాసి శ్రీలంక బౌద్ధ గ్రంథంలో లభించాయి. దాన్ని మన భారతీయుడు డాక్టర్ వాల్మికి ప్రసాద్ "దీప్ వంశ్"– పేరుతో హిందీలోకి అనువదించారు. ఇదే కాకుండా ఇరానియన్ మేధావి, యాత్రికుడు, ఆంత్రపాలజిస్ట్, పరిశోధకుడు అయిన అబూ రేహాన్ అల్–బిరూనీ (973– 1048 సీఇ) తన "అల్–బిరూనీ క భారత్"– అనే గ్రంథంలో దీప దానోత్సవ విశేషాలు నమోదు చేశారు. ఆయన విదేశీయుడు. ఆయన గమనించిన విషయాలే ఆయన నమోదుచేసి ఉంటారు. ఆ పుస్తకం రాసే నాటికి మన దేశంలో ఇప్పుడు ప్రచారంలో ఉన్న పౌరాణిక గాథలేవీ లేవు. అందుకే ఆయన రాయలేదు. ఆ కాలంలో దీప దానోత్సవాన్ని– దీప దానోత్సవమనే పిలిచేవారు. అది బౌద్ధ దమ్మం అవలంబించే వారికి ఒక పర్వదినం! ఆ గ్రంథం అనేక ప్రపంచ భాషల్లోకి వెళ్లింది. డా.అంబేద్కర్ మిత్రుడు సత్‌రామ్ బీన్ దాన్ని హిందీలోకి అనువదించారు. ఆ గ్రంథంలోని 530 పేజీలో దీప దానోత్సవం గురించి వివరంగా రాశారు. ఇవేకాక మనకు మరొక ఆధారం ఉంది. వేదాలు నాలుగింటికి తన వ్యాఖ్యానం జోడించి ప్రకటించిన గంగాశరణ్ శర్మ ఒక మాట చెప్పారు. "వైకల్పిత ప్రకాశ్– వేదాలలో ఎక్కడా లేదు"– అని నిర్ధారించారు. వైకల్పిత అంటే కల్పించిన– ప్రకాశ్ అంటే వెలుగు. అంటే మనిషి తన బుద్ధిని ఉపయోగించి రూపొందించిన వెలుగు– కొవ్వొత్తి, లాంతరు, దీపం, ఎలక్ట్రిక్ బల్బు ఏదైనా కావొచ్చు. సూర్యుడు, చంద్రుడు ప్రకృతి సిద్ధంగా వెలుగునిచ్చేవి. మనిషి తన జ్ఞానంతో వెలిగించిన దీపాల ప్రసక్తి వేదాలలో లేదు– అని శర్మ చెప్పారు. అందువల్ల, దీపం బౌద్ధ సాహిత్యంలోంచి వచ్చిందే. బుద్ధుడే స్వయంగా "అత్ దీపోభవ" అన్నాడు. అంటే "నువ్వే దీపం అవ్వు" అని అర్థం!

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

జేఈఈలో విఫలం... విద్యార్థిని ఆత్మహత్య

న్యూఢిల్లీ: దేశంలోని టాప్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ)లో ఉత్తీర్ణత సాధించలేకపోయానన్న మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన దిల్లీలోని జామియా నగర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... అదే ప్రాంతంలో నివాసం ఉండే బాలిక (17) జేఈఈ పరీక్షలు రాసింది. అయితే, అందులో ఉత్తీర్ణత సాధించలేకపోయింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె తాను ఉంటున్న భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ దుర్ఘటనకు ముందు జేఈఈలో ఉత్తీర్ణత సాధించలేకపోయినందుకు తల్లిదండ్రులను క్షమాపణలు కోరుతూ సూసైడ్ నోట్ రాసి పెట్టినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలిక బిల్డింగ్ పైనుంచి దూకి కిందపడుతున్న దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం నలుగురి సజీవదహనం

చండీగఢ్: హర్యానాలోని గురుగ్రామ్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో నలుగురు అగ్నికి ఆహుతయ్యారు. వివరాల్లోకి వెళితే... సరస్వతి ఎన్‌క్లేవ్‌లో శుక్రవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, అంబులెన్స్‌కి ఫోన్ చేసి ఘటనా స్థలానికి రప్పించారు. ఈ ప్రమాదంలో ఎవరినీ కాపాడలేకపోయామని పోలీసులు తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి అగ్నిప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, ఈ అగ్నిప్రమాదం జరిగినప్పుడు గదిలో నుంచి మా పిల్లల అరుపులు వినిపించాయి. తాము వెంటనే గది తలుపులు బద్దలుకొట్టి లోపలకి వెళ్లేటప్పటికే పొగ కమ్మేసింది. తాము ఎవరినీ రక్షించుకోలేకపోయాం. ఈ ప్రమాదంలో తన కుమారుడు (17) చనిపోయినట్లు తండ్రి మొహమ్మద్ షఫిక్ మీడియాకు వెల్లడించారు. తన అన్నయ్య పిల్లలు ఇద్దరు, తమ్ముడు కుమారుడు కూడా మృతి చెందారని మొహమ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. తాము బీహార్ నుంచి గురుగ్రామ్‌కి వచ్చామని, ఈ ఘటనపై పోలీసులు తక్షణమే విచారణ జరపాలని ఆయన కోరారు. ఈ ఘటనపై గురుగ్రామ్ కౌన్సిలర్ బ్రహ్మ యాదవ్ స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ.. 'అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడం విచారకరం. ఆ కుటుంబానికి అన్నివిధాల సహాయమందిస్తాము' అని ఆయన అన్నారు.

జార్ఖండ్ ఎన్నికలకు బ్రాండ్ అంబాసిడర్‌గా ధోనీ

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు బ్రాండ్ అంబాసిడర్‌గా భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ నియమితులయ్యారు. ఎన్నికల ప్రచారంలో తన ఫొటో వినియోగించుకునేందుకు ధోనీ సమ్మతించినట్లు ఎన్నికల కమిషన్ తెలిపింది. ఈ మేరకు ముఖ్య ఎన్నికల అధికారి కె.రవికుమార్ తాజాగా వెల్లడించారు. స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమం కింద ఓటర్లలో అవగాహన పెంచేందుకు ధోనీ కృషి చేయనున్నట్లు తెలిపారు. కాగా, 81 స్థానాలున్న జార్ఖండ్ అసెంబ్లీకి రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడతలో 43 స్థానాలకు నవంబర్ 13న, మిగిలిన 38 స్థానాలకు నవంబర్ 20న ఎన్నికలు జరుగుతాయి. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టి... ఫలితాలు వెల్లడిస్తారు.

యమునాలో స్నానం... బీజేపీ నేతకు అస్వస్థత



న్యూఢిల్లీ: యమునా నది జలాలు దుర్గంధంగా మారాయని, జలాల ప్రక్షాళనలో కేజ్రీవాల్ సర్కార్ అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తూ రెండ్రోజుల క్రితం ఆ నదిలో స్నానం చేసిన బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ సచ్‌దేవ శనివారం ఆసుపత్రి పాలయ్యారు. చర్మంపై పొక్కులు రావడంతో ఆయన ఆసుపత్రిలో చేరినట్టు పార్టీ సోషల్ మీడియా పోస్ట్‌లో బీజేపీ తెలిపింది. యమునా నదీ జలాల్లో స్నానం చేసిన తర్వాత వీరేంద్ర సచ్‌దేవకు స్వల్పంగా శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తాయని, చర్మంపై పొక్కులు వచ్చాయని దిల్లీ బీజేపీ ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్ఎంఎల్ ఆసుపత్రిలో ఆయన చేరారని, వైద్య పరీక్షల అనంతరం మూడు రోజులు మందులు తీసుకోవాలని వైద్యులు సూచించారని పేర్కొంది. 2025 కల్లా యమునా జలాలను ప్రక్షాళన చేస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని కేజ్రీవాల్ ప్రభుత్వం నిలుపుకోలేదని, ఆ పర్యవసానాలు ఇప్పుడు చవిచూస్తున్నామని ఆరోపించింది.కాగా, దిల్లీలో వాయు కాలుష్యంపై బీజేపీ చేస్తున్న డ్రామాలను అంతా గమనిస్తున్నారని ఆప్ నేత, పర్యావరణశాఖ మంత్రి గోపాల్ రాయ్ పేర్కొన్నారు.

ధరల పెరుగుదలతో సామాన్యుడికి కష్టాలు: రాహుల్

న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఇటీవల దిల్లీలో ఓ బార్బర్ షాప్‌కు వెళ్లారు. అక్కడ షేవింగ్ చేయించుకున్నారు. తనకు షేవింగ్ చేసిన అజిత్ అనే బార్బర్‌తో రాహుల్‌గాంధీ ముచ్చటించారు. బార్బర్ తన సాధకబాధకాలను రాహుల్‌గాంధీతో పంచుకున్నాడు. రోజంతా కష్టపడి పనిచేసినా 'ఏమి మిగలడం లేదు సార్' అని చెప్పాడు. బార్బర్‌తో సంభాషణలకు సంబంధించిన వీడియోను రాహుల్‌గాంధీ తన అధికారిక ఎక్స్ ఖాతాలో శనివారం పోస్టు చేశారు. బార్బర్ అజిత్ చెప్పిన 'కుచ్ నహీ బచ్‌తా హై' అనే నాలుగు పదాల మాట దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజల కష్టాలకు నిలువుటద్దమని తన సోషల్ మీడియా పోస్టులో రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. దేశంలో పెరుగుతున్న ధరలతో మంగలివాడి నుంచి చెప్పులు కుట్టేవాడి వరకు, కుమ్మరి వాడి నుంచి వడ్రంగి వరకు అందరి సంపాదన పడిపోతున్నదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పెరుగుతున్న ధరలతో సామాన్యులు దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ఎన్డీఏ సర్కారు తీరుతో కష్టపడి పనిచేసి షాపులు పెట్టుకోవాలని, సొంత ఇళ్లు కట్టుకోవాలని, ఆత్మగౌరవంతో బతుకాలని సామాన్యులు కంటున్న కలలు కలలుగానే మిగిలిపోతున్నాయని రాహుల్‌గాంధీ ఆవేదన వెలిబుచ్చారు. ప్రజల బతుకులు బాగుపడాలంటే ప్రభుత్వాలు తీసుకొచ్చే కొత్త పథకాలు వారి ఆదాయాన్ని పెంచేవిగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాహుల్‌గాంధీ బార్బర్‌తో మాట్లాడిన వీడియోను కాంగ్రెస్ పార్టీ కూడా సోషల్ మీడియాలో షేర్ చేసింది.

రైలు ప్రమాదానికి మరో కుట్ర

లక్నో: దేశంలో రైలు ప్రమాదాలకు దారి తీసేలా కుట్రపూరిత ప్రయత్నాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ట్రాక్‌లపై గ్యాస్ సిలిండర్లు, ఇనుప పట్టీలు ఉంచుతూ రైళ్లను పట్టాలు తప్పించేందుకు కుట్రలు పన్నుతున్నారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్ సహా కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. తాజాగా మరో కుట్ర బయటపడింది. ఉత్తరప్రదేశ్‌లోని మలిహాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్‌పై దుండగులు చెక్క దిమ్మెను ఉంచారు. అక్టోబర్ 24న ఈ ఘటన చోటుచేసుకుంది. ఆ సమయంలో 14236 నంబర్ గల బరేలీ-వారణాసి ఎక్స్‌ప్రెస్ రైలు పైలట్ ట్రాక్‌పై ఉన్న 6 కిలోల కంటే ఎక్కువ బరువున్న రెండు అడుగుల పొడవైన చెక్క దిమ్మెను గుర్తించారు. వెంటనే అత్యవసర బ్రేక్‌లు వేశారు. దీంతో ఘోరప్రమాదం తప్పింది. ఈ ఘటనతో దాదాపు రెండు గంటల పాటు ఆ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. రంగంలోకి దిగిన అధికారులు ట్రాక్‌పై ఉన్న వాటిని తొలగించారు. ఆ తర్వాత భద్రతా తనిఖీల అనంతరం రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై ఆర్‌పీఎఫ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మా ఎమ్మెల్యేలకు కోట్లు ఆశ చూపింది

ఎన్సీపీపై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణ

ముంబై: అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లో చేరాలని తమ ఎమ్మెల్యేలకు రూ.కోట్లలో డబ్బు ఆశ చూపారని కాంగ్రెస్ శనివారం ఆరోపించింది. ఎన్సీపీలో చేరేందుకు ఇద్దరు ఎమ్మెల్యేలకు కోట్లాది రూపాయలు ఇవ్వడానికి ముందుకు వచ్చారని తెలిపింది. 'ఎన్సీపీలో చేరాలని మా పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలకు ఆ పార్టీ కోట్ల రూపాయలు ఆఫర్ చేస్తోంది. ఇది నేరపూరిత చర్య. ఫిరాయింపుల నిరోధక చట్టం కిందకు వస్తుంది. హోంశాఖ బాధ్యతలు చూస్తున్న డిప్యూటీ సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారు. ఈ విషయంపై ఆయన స్పందించాలి. వాస్తవాలు ఏమిటో చెప్పాల్సిన బాధ్యత ఆయనపైన ఉంది' అని కాంగ్రెస్ మహారాష్ట్ర ఇంచార్జి రమేశ్ చెన్నితాల అన్నారు. కాంగ్రెస్ ఆరోపణలపై ఎన్సీపీ స్పందించలేదు. కాగా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు విపక్ష 'మహా వికాస్ అఘాడీ' కూటమిలో సీట్ల సర్దుబాటు వ్యవహారంలో ఏకాభిప్రాయం కుదిరింది. ఈ కూటమిలోని ప్రధాన పక్షాలైన శివసేన (యూబీటీ), కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్‌పీ) పార్టీలు 85 స్థానాల చొప్పున పోటీచేయాలని నిర్ణయించాయి. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కోప్రి-పచ్‌పఖాడి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలోకి దిగుతుండగా... ముంబైలోని వర్లి నుంచి మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే తనయుడు ఆదిత్య ఠాక్రే పోటీ చేయనున్నారు. షిండేపై ఆయన రాజకీయ గురువు ఆనంద్ దిఘే సోదరుడి కుమారుడు కేదార్ దిఘేను ఉద్ధవ్ ఠాక్రే బరిలో దించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు నవంబర్ 20న ఒకే దశలో పోలింగ్ జరగనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నవంబర్ 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

23 మందితో కాంగ్రెస్ రెండో జాబితా

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ కోసం కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా ప్రకటించింది. మరో 23 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సీఈసీ) సమావేశం తర్వాత రెండో జాబితాను శనివారం విడుదల చేసింది. కాంగ్రెస్, శివసేన (యూబీటీ) మధ్య వివాదంగా మారిన నాగ్‌పూర్ సౌత్ సీటు కాంగ్రెస్‌కు దక్కింది. ఈ నియోజకవర్గం నుంచి గిరీష్ కృష్ణరావు పాండవ్ బరిలోకి దిగనున్నారు. కాగా, తొలి జాబితాలో 48 మంది అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించింది. వీరిలో 25 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు. తాజాగా 23 మందితో రెండో జాబితా విడుదల చేసింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు 71 మంది అభ్యర్థులను ప్రకటించింది. మరోవైపు మహారాష్ట్రలో ప్రతిపక్ష కూటమి అయిన మహా వికాస్ అఘాడి (ఎంవీఏ)లో ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. భాగస్వామ్య పక్షాల మధ్య తుది సీట్ల పంపకం ఖరారవుతుం దని ఆశాభావం వ్యక్తం చేసింది. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో నవంబరు 20న పోలింగ్ జరుగనున్నది. 23న ఫలితాలు వెల్లడికానున్నాయి.

ఖర్గేకు శుభాకాంక్షల వెల్లువ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడిగా మల్లికార్జున ఖర్గే రెండేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఖర్గేకు పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సేవలను, నాయకత్వాన్ని ప్రశంసించారు. ఖర్గే శనివారం తన నివాసంలో రాహుల్ గాంధీతో పాటు సీనియర్ నేతలతో కలిసి రెండు కేక్‌లు కట్ చేశారు. 10, రాజాజీ మార్గ్‌లోని ఖర్గే నివాసానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి రాహుల్ సన్మానించారు. కేక్ కటింగ్‌లో పాల్గొన్నారు. ఖర్గేకు కేక్ తినిపించిన తర్వాత మిగతా నేతలకు అందజేశారు. అజయ్ మాకెన్, జైరాం రమేశ్, కుమార్జి శైలజ, రమేశ్ చెన్నితల, తారీఖ్ అన్వర్, అల్కా లాంబ, గుర్దీత్ సింగ్, కె.రాజు తదితరులు హాజరయ్యారు. తన రెండేళ్ల పదవీ కాలంలో పార్టీని సార్వత్రిక ఎన్నికల్లో ముందుండి నడిపించారు. ఖర్గే నాయకత్వంలో కాంగ్రెస్ లెక్క మెరుగైంది. 2019లో 52 స్థానాల నుంచి 2024లో 99 స్థానాలకు ఎదిగింది. ఖర్గే 2022, అక్టోబరు 26న పార్టీ అధ్యక్ష పగ్గాలను చేపట్టారు. గాంధీ కుటుంబ యేతరుడిగా రాణించారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో గాంధీ కుటుంబానికి చెందని వ్యక్తి అధ్యక్ష పీఠాన్ని అధీష్టించడమన్నది 24ఏళ్లలో మొదటిసారి ఖర్గే విషయంలో జరిగింది. ఖర్గే నాయకత్వంలో 2022లో హిమాచల్ ప్రదేశ్‌లో, 2023లో కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. జమ్మూకశ్మీర్ అధికార కూటమిలోనూ కాంగ్రెస్ భాగస్వామిగా ఉంది. 2023లో రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలను కాంగ్రెస్ చేజార్చుకుంది. అయితే ఖర్గే నాయకత్వంలోనే కాంగ్రెస్ పార్టీ మధ్యప్రదేశ్, హర్యానా రాష్ట్రాలలో తిరిగి అధికారంలోకి రాలేకపోయిన విషయం విదితమే.

పోరాటం కొత్త కాదు: ప్రియాంక

న్యూఢిల్లీ: ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి ప్రవేశించిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా వయనాడ్ ఉప ఎన్నిక పోరుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల ఈ లోక్‌సభ స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. వయనాడ్ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి తాజాగా ఓ భావోద్వేగ పోస్ట్ చేశారు. ఎన్నికల్లో పోటీ కొత్తేమో గానీ... ప్రజల తరపున పోరాటం తనకు కొత్తేమీ కాదని ప్రియాంక పేర్కొన్నారు. 'కొన్ని నెలల క్రితం నేను, నా సోదరుడు రాహుల్‌తో కలిసి మండక్కై, చూరాల్‌మల వెళ్లాను. కొండచరియలు విరిగిపడటంతో ప్రకృతి సృష్టించిన బీభత్సం కారణంగా మీరు ఎదుర్కొన్న నష్టాన్ని, సర్వం కోల్పోయిన మీ ఆవేదనను కళ్లారా చూశా. పిల్లలను కోల్పోయిన తల్లులు, కుటుంబాన్ని కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులను చూశా. ఆ చీకటి రోజుల నుంచి బయటపడి నవశక్తితో మీరు ముందుకు కదిలిన తీరు స్ఫూర్తిదాయకం. నిస్సహాయ స్థితిలోనూ తోటి వారి కోసం మీరు పడిన ఆరాటం... మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. ఆ విషాద సమయంలో మీరు చూపిన అచంచలమైన ధైర్య సాహసాలే... ఈరోజు నాలో స్ఫూర్తి నింపాయి. మీ తరపున పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం గౌరవంగా భావిస్తున్నా... నా సోదరుడికి మీరు ఎంతో ప్రేమను, అభిమానాన్ని పంచారు. అదే ప్రేమను నాపైనా కురిపిస్తారని ఆశిస్తున్నా. చట్టసభలో మీ గళం వినిపించే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నా. చిన్నారుల భావి భవిష్యత్తు, మహిళల శ్రేయస్సు కోసం నా శక్తికి మించి కృషి చేస్తానని మాటిస్తున్నా. ప్రజాప్రతినిధిగా పోటీ చేసే ఈ ప్రయాణం నాకు కొత్త కావొచ్చు. కానీ, ప్రజల తరపున గళం వినిపించేందుకు చేసే పోరాటం మాత్రం కొత్త కాదు. ఈ ప్రయాణంలో మీరంతా నాకు మార్గదర్శకంగా నిలుస్తారని ఆశిస్తునా' అని ప్రియాంకా గాంధీ రాసుకొచ్చారు. రాహుల్ రాజీనామాతో వయనాడ్‌లో జరుగుతున్న ఉప ఎన్నికలో ప్రియాంకాగాంధీ కాంగ్రెస్ తరపున పోటీకి దిగారు. కేరళలో పాలక్కాడ్, చెలక్కర అసెంబ్లీ స్థానాలతోపాటు వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నవంబరు 13న జరగనుంది. 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి.

మహా వికాస్ అఘాడీతోనే అభివృద్ధి: రౌత్

ముంబై: 'సబ్ కా సాత్, సబ్ కా వికాస్' అనేది మా కూటమి నినాదమని, అందరినీ అభివృద్ధి చేసేది 'మహా వికాస్ అఘాడీ' కూటమి మాత్రమేనని శివసేన ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు. మహారాష్ట్రలో ఇప్పుడు బలంగా ఉన్న పార్టీలు మూడు మాత్రమేనని... కాంగ్రెస్, శరద్‌పవార్ కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే శివసేన మాత్రం బలంగా ఉన్నాయని చెప్పారు. ఈ ఎన్నికల్లో గెలుపు తమ కూటమిదేనని రౌత్ ధీమా వ్యక్తంచేశారు. మూడు పార్టీలు సమానంగా సీట్లు పంచుకుని బరిలో దిగుతున్నాయని సంజయ్ రౌత్ చెప్పారు. హర్యానాలో కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా అన్ని స్థానాల్లో పోటీ చేసిందని, కానీ అధికారంలోకి మాత్రం రాలేకపోయిందని గుర్తుచేశారు. అందుకే మహారాష్ట్రలో అందరం ఒక్కటై ముందుకు వెళ్లడం మంచిదనేది తన అభిప్రాయమని అన్నారు. మహాకూటమిలోని మూడు పార్టీలు 85 చొప్పున బరిలో దిగనున్నాయి.

మీ లేఖ అర్థం కాలేదు

కేంద్రమంత్రి హిందీ లేఖకు తమిళంలో ఎంపీ సమాధానం

చెన్నై: కేంద్రం, తమిళనాడు మధ్య భాషాపరమైన వివాదం కొనసాగుతున్న వేళ...కేంద్రమంత్రి, ఎంపీ మధ్య లేఖల రూపంలో జరిగిన సంభాషణ చర్చనీయాంశమైంది. కేంద్ర మంత్రి హిందీలో రాసిన లేఖకు డీఎంకే ఎంపీ ఎంఎం అబ్దుల్లా తమిళంలో సమాధానం ఇచ్చారు. ఆ హిందీ లేఖ తనకు అర్థం కాలేదని అబ్దుల్లా మంత్రికి బదులిచ్చారు. రైళ్లలో ఆహారనాణ్యత, పరిశుభ్రతకు సంబంధించి అబ్దుల్లా లేవనెత్తిన ప్రశ్నలకు కేంద్రమంత్రి రవనీత్ సింగ్ బిట్టు హిందీలో బదులిచ్చారు. ఈవిషయమై రెండు వేర్వేరు భాషల్లో ఒకరికొకరు రాసుకున్న లేఖలను ఎంపీ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. 'రైల్వేశాఖ సహాయమంత్రి నుంచి వచ్చే లేఖ ఎప్పుడూ హిందీలోనే ఉంటుంది. ఆయన కార్యాలయంలో విధుల్లో ఉన్న అధికారులకు ఫోన్ చేసి... నాకు హిందీ రాదని, లేఖను ఆంగ్లంలో పంపమని కోరాను. కానీ హిందీలోనే బదులు వచ్చింది. అయితే నేను మాత్రం ఆయన అర్థం చేసుకునేలా రిప్లై పంపాను' అని సామాజిక మాధ్యమాల వేదికగా అబ్దుల్లా వెల్లడించారు. అలాగే సమాధానం ఇప్పటినుంచైనా ఆంగ్లంలో ఉండేలా చూడాలని కోరారు. గతంలో హిందీ భాష గురించి అమిత్ షా మాట్లాడుతూ... 'హిందీ-గుజరాతీ, హిందీ-తమిళం, హిందీ-మరాఠీ మధ్య పోటీ ఉందంటూ కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారు. దేశంలో ఏ భాషకూ హిందీ పోటీ కాదు. దేశంలోని భాషలన్నింటికీ ఇది మిత్ర భాష. కేవలం హిందీ భాష అభివృద్ధి చెందినప్పుడే దేశంలో ప్రాంతీయ భాషలన్నీ పరస్పరం వర్ధిల్లుతాయి. భాషలన్నీ పరస్పరం సహకరించుకుంటే తప్ప మన సొంత భాషలో దేశం నడవాలనే స్వప్నాన్ని సాకారం చేసుకోలేమన్నారు' అని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

కేజ్రీవాల్ హత్యకు కుట్ర

బీజేపీపై ఆప్ తీవ్ర ఆరోపణ

న్యూఢిల్లీ : తమ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను తొలగించడానికి 'లోతైన కుట్ర' అని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) శనివారం ఆరోపించింది. కేజ్రీవాల్‌కు ఏదైనా జరిగితే బీజేపీయే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. పశ్చిమ దిల్లీలోని వికాస్ పురిలో కేజ్రీవాల్ 'పాదయాత్ర' ప్రచారంలో 'బీజేపీ గూండాలు' దాడి చేశారని ఆప్ నాయకులు శుక్రవారం పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ మాట్లాడుతూ 'కేజ్రీవాల్‌ను హతమార్చడానికి జరిగిన లోతైన కుట్రలో పోలీసులు సహకరించడం స్పష్టంగా చూపిస్తోంది. బీజేపీ కేజ్రీవాల్ జీవితానికి శత్రువుగా మారింది' అని ఆరోపించారు. సింగ్ ఆరోపణలపై పోలీసులు లేదా బీజేపీ నుంచి వెంటనే స్పందించలేదు. అయితే వికాస్‌పురి సంఘటన జరిగినప్పటికీ, కేజ్రీవాల్ షెడ్యూల్ ప్రకారం 'పాదయాత్ర' ప్రచారాన్ని కొనసాగిస్తారని ఆప్ నాయకుడు చెప్పారు. ఈ ఘటనపై ఆప్ ఎందుకు ఫిర్యాదు చేయలేదని అడిగినప్పుడు పోలీసులు 'నిష్పక్షపాతంగా' ఉంటే ఈ సంఘటన జరిగేది కాదని, దాడి చేసిన బీజేపీ యువజన విభాగం గుంపును ఆపడానికి దాని అధికారులు ఏమీ చేయలేదని సింగ్ అన్నారు. పోలీసులు ఈ ఘటనను తెలుసుకుని విచారణ చేపట్టాలని, ఈ విషయంలో తదుపరి చర్యల కోసం ఆప్ న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకుంటోందని ఆయన అన్నారు. కేజ్రీవాల్‌పై దాడి చేసిన వారికి బీజేపీ నేతలు మద్దతిస్తున్నారని ఆప్ ఎంపీ ఆరోపించారు. తమ ఇళ్లకు మురికి నీటిని సరఫరా చేయడంపై స్థానికుల నిరసనలను ఆయన ఎదుర్కొంటున్నారన్న ఆప్ వాదనను బీజేపీ నాయకులు కొట్టిపారేశారు. దిల్లీ ప్రజల కోసం కేజ్రీవాల్ పోరాటం కొనసాగిస్తారని సింగ్ నొక్కి చెప్పారు. కేజ్రీవాల్‌కు ఏదైనా జరిగితే దానికి బీజేపీనే బాధ్యత వహించాలని అన్నారు. దిల్లీ ప్రజలు బీజేపీపై ప్రతీకారం తీర్చుకుంటారని ఆయన అన్నారు.

బీజేపీ స్టార్ క్యాంపెయినర్లు వీరే...

న్యూఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం స్టార్ క్యాంపెయినర్లను బీజేపీ ప్రకటించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, అసోం సీఎం హిమంత విశ్వ శర్మ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా మొత్తం 40 మంది పేర్లు ప్రకటించింది. మహారాష్ట్రలో మొత్తం 288 స్థానాలకు ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. నవంబర్ 20న ఎన్నికలు నిర్వహించి... 23న ఫలితాలు వెల్లడించనున్నారు. రాష్ట్రంలో మొత్తం 9 కోట్ల 63 లక్షల మంది ఓటర్లు ఉండగా... లక్షా 186 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఈసీ ఇప్పటికే ప్రకటించింది. నవంబర్ 26తో మహారాష్ట్ర అసెంబ్లీ గడువు ముగియనుంది. లోక్‌సభ ఎన్నికల తర్వాత ఎన్డీఏ, ఇండియా ఐక్య సంఘటన ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్ ఈ ఎన్నికలే. మహారాష్ట్రలో ఈసారి నేరుగా అధికారం దక్కించుకొని ప్రజా మద్దతు తమకే ఉందని నిరూపించుకునేందుకు బీజేపీ, శివసేన, ఎన్సీపీతో కూడిన మహాయుతి ప్రయత్నం చేస్తోంది. మరోవైపు పార్టీల్లో చీలికలతో కోల్పోయిన అధికారాన్ని తిరిగి పొందాలని కాంగ్రెస్, శివసేన(ఉద్ధవ్), ఎన్సీపీ(శరద్ పవార్)తో కూడిన మహా వికాస్ అఘాడీ పట్టుదలగా ఉంది. దీంతో ఈ ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి.

22 మందితో రెండో జాబితా

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల సందడి నెలకొంది. పోలింగ్‌కు ఇంకో నెల రోజుల సమయం కూడా లేకపోవడంతో పార్టీలు వ్యూహ, ప్రతివ్యూహాలకు పదును పెడుతున్నాయి. దాదాపు అన్ని పార్టీలు అభ్యర్థుల ఎంపిక కసరత్తు పూర్తిచేశాయి. ఒకటీ అరా స్థానాలు మినహా అన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేశాయి. బీజేపీ మరో 22 మంది అభ్యర్థులతో రెండో జాబితా ప్రకటించింది. బీజేపీ ఇప్పటికే తొలి జాబితాలో 99 మంది అభ్యర్థుల పేర్లను ఖరారు చేసింది. ఇప్పుడు మరో 22 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో ఆ పార్టీ మొత్తం 121 స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేసినట్లయింది.

పంచాయతీల పరిపుష్టిపై కేంద్రం దృష్టి

న్యూఢిల్లీ: మౌలిక సదుపాయాల అంతరాలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా కొత్త పంచాయతీ భవనాలు, వనరుల కేంద్రాలను నిర్మించడానికి, ఇప్పటికే ఉన్న వాటిని ఆధునీకరించడానికి పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ అనేక ప్రతిపాదనలను ఆమోదించింది. వీటిలో అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో దాదాపు 400 గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించే ప్రతిపాదన కూడా ఉందని మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఈ నెల ప్రారంభంలో పునరుద్ధరించబడిన గ్రామ స్వరాజ్ అభియాన్‌పై కేంద్ర సాధికారత కమిటీ (సీఈసీ) సమావేశంలో అనేక ప్రతిపాదనలు ఉంచారు. వాటిని ఇటీవల మంత్రిత్వ శాఖ ఆమోదించినట్లు ఆ వర్గాలు పేర్కొన్నారు. పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ అధ్యక్షతన జరిగిన సీఈసీ సమావేశంలో పంచాయతీలకు మౌలిక వసతులు, శిక్షణ అంశాలపై చర్చ జరిగింది. 'సరిహద్దు ప్రాంతాల్లోని 'చైతన్యవంతమైన గ్రామాలు' పంచాయతీ మౌలిక సదుపాయాలను పెంచే ప్రయత్నంలో అరుణాచల్ ప్రదేశ్‌లో 400 పంచాయతీ భవనాలతో కూడిన ఉమ్మడి సేవాల కేంద్రాల నిర్మాణానికి మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కింద, మంత్రిత్వ శాఖ పంచాయతీ భవనాల నిర్మాణంతో పాటు ప్రత్యేకించి సరిహద్దు రాష్ట్రాల్లో ఉమ్మడి సేవా కేంద్రాల ఏర్పాటుకు మద్దతు ఇచ్చింది. జమ్మూకశ్మీర్‌లో పంచాయితీ రాజ్ మంత్రిత్వ శాఖ అందించిన సమాచారం ప్రకారం, 2024-25లో 970 గ్రామ పంచాయతీ భవనం, 1,606 ఉమ్మడి సేవా కేంద్రాల నిర్మాణానికి మంత్రిత్వ శాఖ మద్దతు ఇచ్చింది. అదేవిధంగా, మిజోరం, మేఘాలయ, నాగాలాండ్, అసోం, మణిపూర్‌తో సహా ఈశాన్య ఇతర రాష్ట్రాలకు పంచాయతీ మౌలిక సదుపాయాలు మద్దతు ఇచ్చాయి.

ఈశాన్య రాష్ట్రాల కోసం మొత్తం 1,633 గ్రామ పంచాయతీ భవనాలు, 514 సీఎస్‌సీలు ఆమోదం పొందాయి. మంత్రిత్వ శాఖ 3,301 గ్రామ పంచాయతీ భవన్‌లను ఉమ్మడి సేవా కేంద్రం (సీఎస్‌సీ) నిర్మించడానికి ఆమోదించింది. ఆంధ్ర ప్రదేశ్, చత్తీస్‌గఢ్, పంజాబ్, తెలంగాణతో సహా వివిధ రాష్ట్రాల్లోని గ్రామ పంచాయతీల కోసం 22,164 కంప్యూటర్లను మంజూరు చేసింది. దేశవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో పంచాయతీ వనరుల కేంద్రాలను ఆధునీకరించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఇది కాకుండా, రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో మాస్టర్ ట్రైనర్‌లు, అతిథి అధ్యాపకులు, ప్రముఖ రిసోర్స్ పర్సన్‌ల గౌరవ వేతనాల ప్రామాణీకరణను కూడా కేంద్ర సాధికారత కమిటీ ఆమోదించింది.

యువ న్యాయవాదులకు తగిన జీతాలివ్వండి

సీనియర్లకు సీజేఐ సూచన

న్యూఢిల్లీ : న్యాయవాదులు తమ ఛాంబర్‌లోకి ప్రవేశించే యువ న్యాయవాదులకు సరైన జీతాలు, పారితోషికాలు చెల్లించడం నేర్చుకోవాలని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ అన్నారు. ఆల్ ఇండియా రేడియోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తి చాలా కష్టమైనదని, ప్రారంభ సంవత్సరాల్లో వేసిన పునాది యువ న్యాయవాదులను వారి భవిష్యత్‌ను మంచి స్థితిలో ఉంచుతుందని తెలిపారు. 'ఒక వృత్తిలో ఎల్లప్పుడూ ఎత్తు, పల్లాలు ఉంటాయి. మొదట్లో న్యాయవాద వృత్తిలో మీ మొదటి నెల చివరిలో మీరు చేసే మొత్తం చాలా ఎక్కువగా ఉండకపోవచ్చు' అని సీజేఐ చెప్పారు. అందువల్ల కష్టపడి పనిచేయడం, వారు చేసే పనిలో నిజాయితీగా ఉండటం చాలా ముఖ్యమని చంద్రచూడ్ అన్నారు. 'అలాగే మన నిర్మాణాలు కూడా మారాలి. ఉదాహరణకు, న్యాయవాదులు తమ ఛాంబర్‌లోకి ప్రవేశించే యువ న్యాయవాదులకు సరైన వేతనాలు, పారితోషికాలు ఎలా చెల్లించాలో నేర్చుకోవాలి' అని ఆయన తెలిపారు. 'యువకులు నేర్చుకోవడానికి వారి ఛాంబర్‌లకు వస్తారు. వారు భాగస్వామ్యం ఎక్కువగా కలిగి ఉంటారు. ఇది భాగస్వామ్యం, మార్గదర్శకత్వం రెండు మార్గాల ప్రక్రియ. దీనిని మేము యువ న్యాయవాదులకు అందించాలి' అని సీజేఐ పేర్కొన్నారు. దిల్లీలో కళాశాల రోజుల్లో ఆల్ ఇండియా రేడియోలో వ్యాఖ్యాతగా పనిచేసిన రోజులను కూడా చంద్రచూడ్ గుర్తు చేసుకున్నారు. తాను మూడవ లేదా నాల్గవ తరగతి చదువుతున్నప్పుడు తన తల్లి, శాస్త్రీయ సంగీత విద్వాంసుడు తరచుగా ముంబైలోని ఏఐఆర్ స్టూడియోస్‌కు తీసుకువెళ్లేవారని సీజేఐ చెప్పారు. 1975లో దిల్లీకి వెళ్లిన తర్వాత ఆకాశవాణి కోసం ఆడిషన్‌లో పాల్గొని, హిందీ, ఇంగ్లీషులో కార్యక్రమాలను ప్రారంభించినట్లు ఆయన వివరించారు. దేవ్‌కీ నందన్ పాండే, పమేలా సింగ్, లోతికా రత్నం దిగ్గజ స్వరాలకు మంత్రముగ్ధులయ్యి, తన తల్లిదండ్రులతో కలిసి హిందీ, ఆంగ్లం, సంస్కృతంలో ఏఐఆర్ బులెటిన్‌లను వింటూ ఎలా పెరిగానో కూడా ఆయన గుర్తు చేసుకున్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హుస్నాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గంగపుత్ర, మత్స్యకారుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం ప్రాజెక్టులో జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మాను చౌదరితో కలిసి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బలహీనవర్గాలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని శనిగరం ప్రాజెక్టు వద్ద ప్రభుత్వ స్థలంలో ఫిష్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు స్థలం సేకరించాలని ఆర్డీవోకు సూచించారు. నియోజకవర్గంలో మత్స్య సంపద, పశుపోషణ, పాల ఉత్పత్తి, రైతులు ఆయిల్ ఫామ్, డ్రాగన్ ఫ్రూట్, చేపల చెరువులు, కోళ్లు, ఆవులు, గేదెల పెంపకం వంటి ఉపాధి మార్గాలను ఎంచుకునే విధంగా రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గౌరవెల్లి ప్రాజెక్టుకు భూమిపూజ చేశారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగిందని చెప్పారు. నైపుణ్యం కలిగిన వారందరికీ విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శిక్షణతో కూడిన మంచి జీవితం సంపాదించుకునేందుకు త్వరలో హుస్నాబాద్ లో జాబ్ మేళా ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పలు శాఖల ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్ణకంటి మంజులరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 15లోగా సలహాలు, సూచనలు ఇవ్వండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో నూతన మార్గదర్శకాలపై జర్నలిస్టు యూనియన్లు, అసోసియేషన్లు, ప్రెస్ క్లబ్బులు, వ్యక్తుల నుండి ప్రత్యేక కమిటీకి రాతపూర్వకమైన సలహాలు, సూచనలను ఆహ్వానించింది. నవంబర్ 15లోగా వాటిని సమాచార పౌర సంబంధాల శాఖ, జాయింట్ డైరెక్టర్‌కు అందజేయాల్సిందిగా కోరింది. రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరికి అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలు రూపొందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ, ప్రథమ సమావేశం శనివారం, బూర్గుల రామకృష్ణారావు భవనంలో జరిగింది. మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు ఆంధ్రజ్యోతి ఎడిటర్, కె.శ్రీనివాస్, సియాసత్ న్యూస్ ఎడిటర్, ఎమ్మెల్సీ, అమీర్ అలీ ఖాన్, హిందూ పొలిటికల్ ఎడిటర్, ఆర్ రవికాంత్ రెడ్డి, సీనియర్ ఫోటో జర్నలిస్ట్, కె.నరహరి, సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ డి.యస్. జగన్ పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర హైకోర్టు తీర్పులు, నూతన మార్గదర్శకాలు, వివిధ రాష్ట్రాలలో అమలులో ఉన్న అక్రిడిటేషన్ కమిటీ నిబంధనలను, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు ఇతర మీడియాకు అక్రిడిటేషన్ల అంశాలపై ప్రాథమికంగా చర్చించింది.

రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంటుకు కృషి చేస్తా: ఎంపీ

విశాలాంధ్ర - అమనగల్లు : రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్‌కు కృషి చేస్తానని కేంద్ర స్కిల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యుడు ఎంపీ మల్లు రవి తెలిపారు. కడ్తాల్లో ఆయన అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి ఎంపీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ప్రజాపాలన, ప్రజా సంక్షేమ పాలన నడుస్తుందని అన్నారు. ప్రజల సంక్షేమం,అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పిసిసి కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, డిసిసి ఉపాధ్యక్షులు శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు బిచ్య నాయక్,డిసిసి అధికార ప్రతినిధిగూడూరు శ్రీనివాస్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి బిక్య నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, సేవాదళ్ అధ్యక్షులు లక్ష్మయ్య, ఎస్సీ సెల్ బ్లాక్ అధ్యక్షుడు రామకృష్ణ, టౌన్ వర్కింగ్ అధ్యక్షులు రామచందర్ నాయక్, జిల్లా నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, అద్దాల రాములు, మలే మల్లేష్, సత్యం యాదవ్, యాదయ్య, మల్లయ్య, బిక్షపతి, మంకీ శ్రీను, లక్పతి నాయక్, శేఖర్, క్యామ రాజేష్, శ్రీకాంత్, నరేష్, ఇమ్రాన్ బాబా, సురేష్, సేవ్యా పాల్గొన్నారు. కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ కమిటీ సభ్యుడిగా నాగర్‌కర్నూలు పార్లమెంట్ సభ్యులు డా.మల్లురవి నియమితులైన సందర్భంగా అమనగల్లు మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షులు జగన్,పట్టణ అధ్యక్షులు మానయ్య, మాజీ మండల అధ్యక్షులు రాములు, బ్లాక్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఖలీల్, సీనియర్ నాయకులు ఖాదర్,రవీందర్, రహీం, కందే పాండు రంగయ్య, ప్రసాద్, అలీమ్, మల్లేష్, మైసయ్య, కిషన్, రఫీ, ఫరిద్,ఫెరోజ్, మహేష్, అంజద్ పాల్గొన్నారు.

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఏపీ మంత్రి వాసంశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఏపీ మంత్రి వాసం శెట్టి సుభాష్ తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో భేటీ అయ్యారు. శనివారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల తాజా రాజకీయ పరిస్థితులతో పాటు, రెండు రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాల తీరుతెన్నుల గురించి ఇరువురు నేతలు చర్చించుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఆర్ఆర్ఆర్, మూసీ శుద్ధీకరణ గురించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వాసంశెట్టి సుభాష్‌కు వివరించగా ఆంధ్రప్రదేశ్‌తో అనుసంధానించే ఎన్.హెచ్-65 విషయంలో మీరు చూపిన చొరవ వల్ల ఆంధ్రా తెలంగాణ మధ్య రవాణా పరిస్థితులు మరింత మెరుగుపడతాయని వాసంశెట్టి సుభాష్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

శుద్ధమైన నీరు అందించే బాధ్యత ఇంజనీర్లదే

మంత్రి సీతక్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో ప్రతీ ఒక్కరికి స్వచ్ఛమైన, శుద్ధిచేసిన తాగునీటిని అందించడం మిషన్ భగీరథ ఇంజనీర్ల బాధ్యత అని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి , గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం మిషన్ భగీరథ ఇంజనీర్-ఇన్-చీఫ్ ఆఫీస్, ఎర్ర మంజిల్, హైదరాబాద్‌లో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని తాగునీటి సరఫరాపై రాబోయే వేసవి సన్నద్ధతపై పూర్తి స్థాయి సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా తాగు నీటి సరఫరాను అందించాలని సూచించారు. పైపులైనులు లీకైనా, పగిలినా వెంటనే వాటిని సరిదిద్ది నీటి సరఫరాను 24 గంటలలో పునరిద్ధరించాలి. నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు, అతిసారం కేసుల విషయంలో అప్రమత్తతో ఉండాలి. గ్రామాలలోని ఓవర్ హెడ్ టాంకులలో ప్రతీరోజూ క్లోరినేషన్ చేయాలని, ప్రతి 10 రోజులకు ఒకసారి టాంకులను శుభ్ర పరచాలని, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. తెలంగాణ ప్రభుత్వం సకాలంలో అన్ని చర్యలు తీసుకోవడం వలన గత వేసవిలో ఏ విధమైన మంచి నీటి ఎద్దడి కలుగలేదు. ఈ విషయంలో మిషన్ భగీరథ ఇంజనీర్ల నిరంతర పర్యవేక్షణ, పనితీరు అభినందనీయం. గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి రాబోయే వేసవిలో మంచి నీటి ఎద్దడి కలుగకుండా జాగ్రత్త వహించాలని మంత్రి ఆదేశించారు. వార్తా పత్రికలలో, సోషల్ మీడియాలో తాగునీటి సరఫరాకు సంబంధించిన వచ్చిన వార్తలపై, ఫిర్యాదులపట్ల వెంటనే స్పందించి పరిష్కరించాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా కార్యదర్శి లోకేశ్ కుమార్, ఇంజనీర్ ఇన్ చీఫ్ కృపాకర్ రెడ్డితోపాటు ఇతర మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

బాధిత బాలికను పరామర్శించిన మంత్రి సీతక్క

బౌరంపేటలో లైంగిక దాడికి గురై హైదర్ నగర్ లోని రెయిన్బో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాలుగు సంవత్సరాల చిన్నారిని పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క పరామర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని, అందు తున్న వైద్యాన్ని డాక్టర్ల నుంచి అడిగి తెలుసుకున్నారు. మహిళా అభివృద్ధి సహకార కార్పొరేషన్ చైర్ పర్సన్ బండ్రు శోభారాణి, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ తో కలిసి చిన్నారిని, కుటుంబాన్ని మంత్రి సీతక్క పరామర్శించారు. ప్రభుత్వం అన్ని రకాల అండగా ఉంటుందని భరోసా కల్పించారు. పాప పూర్తిగా కోలుకున్న తర్వాతే డిశ్చార్జ్ చేయాలని మంత్రి సీతక్క డాక్టర్లకు సూచించారు. చిన్నారి వైద్య చికిత్సకి అవసరమైన ఖర్చు మొత్తం ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. పాప పూర్తిగా కోలుకునేంతవరకు దగ్గర ఉండి అన్ని రకాలుగా అండగా నిలవాలని కాంతి వెస్లీని ఆదేశించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ అండగా ఉంటుందని సీతక్క వెల్లడించారు. తక్షణ అవసరాల నిమిత్తం బాధిత కుటుంబానికి 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి సీతక్క ఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. పాప తండ్రి మిత్రుడే కిరాతకానికి పాల్పడడం దారుణం అన్నారు. ఘటన వెలుగు చూసిన వెంటనే నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితుడికి కఠిన శిక్ష పడేలా చేస్తామన్నారు.

జర్నలిస్టుల అక్రెడిటేషన్ల జీవో 1395ను సవరించాలి

మంత్రి పొంగులేటికి టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జర్నలిస్టుల అక్రెడిటేషన్ కార్డులకు సంబంధించి నియమ నిబంధనల మార్పు కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో 1395 లోపభూయిష్టంగా, ఏకపక్షంగా ఉందని టీడబ్ల్యుజేఎఫ్ అభిప్రాయపడింది. ఈ జీవోను వెంటనే సవరించి ప్రభుత్వం వేసిన అన్ని జర్నలిస్టు సంఘాలకు, చిన్న పత్రికలకు, మహిళా జర్నలిస్టులకు అవకాశం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, బండి విజయ్ కుమార్, ఎల్గొయి ప్రభాకర్ శనివారం రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ గురుతర బాధ్యతలను నిర్వర్తిస్తున్న జర్నలిస్టులు సమాజం బాగోగులే లక్ష్యంగా పనిచేస్తూ సర్కారుకు సహకరిస్తున్నారని, అలాంటి జర్నలిస్టులకు గుర్తింపు కోసం ప్రభుత్వం సమాచార శాఖ నుంచి అక్రెడిటేషన్ కార్డులను ఇస్తున్నదని అన్నారు. తెలంగాణలో 2015 లో అక్రెడిటేషన్ రూల్స్‌తో పాటు జర్నలిస్టు సంఘాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ జీవో 239ను అప్పటి ప్రభుత్వం విడుదల చేసిందని, రూల్స్ ఫ్రేమ్ చేయడానికి మాజీ సంపాదకులు రామచంద్ర మూర్తి నేతృత్వంలో అల్లం నారాయణ, కే. శ్రీనివాస్ రెడ్డి, క్రాంతికిరణ్, కే శ్రీనివాస్ ఇతర సీనియర్ ఎడిటర్లతో కలిపి కమిటీ వేసి అక్రెడిటేషన్‌ల మార్గదర్శకాలు రూపొందించారని తెలిపారు. వాటిని జీవో 239 ద్వారా ఆమోదించి గత పదేండ్లుగా అమలు చేస్తున్నారని, అయితే తాజాగా అక్రెడిటేషన్ రూల్స్ మార్చేందుకు ప్రభుత్వం జీవో 1395ను జారీ చేసిందని, అయితే ఈ జీవో అసంబద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ జీవోకు సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ జీవోలో సీనియర్ ఎడిటర్ లు కాకుండా మీడియా అకాడమీ ముసుగులో ఉన్న ఒక జర్నలిస్టు యూనియన్ చెందిన వారికే ప్రాతినిధ్యం కల్పించారని ఆరోపించారు. గతంలో ఇచ్చిన జీవో 239 ప్రకారం మూడు జర్నలిస్టు సంఘాలకు అవకాశం ఇవ్వాలని, కానీ ఇవ్వలేదని, అలాగే చిన్న పత్రికలను, మహిళా జర్నలిస్టులను పట్టించుకోలేదని వారు మంత్రితో అన్నారు. మీడియా అకాడమీ కనుసన్నల్లో ప్రభుత్వం ఏకపక్షంగా జారీ చేసిన ఈ కొత్త జీవోను ఖచ్చితంగా సవరించిన తరువాతే అక్రెడిటేషన్ కార్డుల నిబంధనలపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. జర్నలిస్టు సంఘాలతో పాటు చిన్నపత్రికలకు, మహిళా జర్నలిస్టులకు కమిటీలో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు సమాచార పౌరసంబంధాల శాఖ కమీషనర్ హనుమంతరావుకు ఇచ్చే వినతి పత్రాన్ని జాయింట్ డైరెక్టర్ జగన్‌కు సమర్పించారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు సలీమా, చంద్రశేఖర్, రాజశేఖర్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి, హెచ్ యూజే కార్యనిర్వాహక కార్యదర్శి నాగవాణి, పి.విజయ తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు

నామినేషన్ల ఆహ్వానం : కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, ఓటు హక్కు వినియోగించుకోవడంపై 2024 సంవత్సరంలో ఓటర్లకు అవగాహన పెంపొందించి చైతన్య పరచడానికి కృషి చేసిన ఉత్తమ ప్రచారానికి సంబంధించి, భారత ఎన్నికల సంఘం మీడియా అవార్డులను ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మీడియా హౌస్‌ల నుండి 2024 ఏడాదికి ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్స్‌ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డులు నాలుగు విభాగాల్లో ఉన్నాయని, ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, ఆన్‌లైన్ సోషల్ మీడియాకు ఒక్కొక్కటి చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓటరు హక్కులపై అవగాహన పెంపొందించడం, ఎలక్షన్ టెక్నాలజీ అంశాలను ప్రచారం చేయడం వంటి అంశాల్లో ప్రాముఖ్యతను చూపిన మీడియా సంస్థలను గుర్తించడం ఈ అవార్డుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అవార్డులను జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా, 2025 జనవరి 25న అందజేయనున్నట్లు తెలిపారు. ప్రచార నాణ్యత, ఖచ్చితత్వం, ప్రజా పరిజ్ఞానం, ఓటర్లకు సరైన సమాచారాన్ని అందించడం, ప్రత్యేక కథనాలు, చర్చలు వంటి అంశాల ఆధారంగా ఈ అవార్డులను నిర్ణయిస్తారని, ప్రతి విభాగంలో పాల్గొనే సంస్థలు తమ ప్రచారం యొక్క సారాంశం, ప్రచురణ లేదా ప్రసారం వార్త ఇతర సంబంధిత ప్రచార కార్యకలాపాలతో సహా నిజ ప్రతులను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 10,2024లోగా తమ సిఫార్సును రాజేష్ కుమార్ సింగ్, అండర్ సెక్రటరీ (కమ్యూనికేషన్), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోక రోడ్, న్యూ ఢిల్లీ-110001 చిరునామాకు పంపాలని పేర్కొన్నారు. ఈమెయిల్‌లో media-division@eci.gov.in కు పంపవచ్చని, హిందీ లేదా ఇంగ్లీష్ కాకుండా ఇతర భాషలలో ఉన్నట్లైతే ఆంగ్ల అనువాదాన్ని కూడా జతపరచాలని తెలిపారు. ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, ఆన్‌లైన్/సోషల్ మీడియా విభాగాల్లో అవార్డులు అందిస్తారన్నారు. ప్రింట్ మీడియా ప్రచురించిన వ్యాసాల సంఖ్య, ఆర్టికల్స్ ప్రచురించిన ప్రింట్ ఏరియా స్క్వేర్ సెంటీమీటర్లు, పాఠకులలో అవగాహన కల్పించేందుకు చేసిన కార్యక్రమాల సమాచారాన్ని పిడిఎఫ్ సాఫ్ట్ కాపీ/వెబ్ అడ్రస్ లింక్/ఫుల్ సైజ్ ఫోటో కాపీ/ న్యూస్ పేపర్ ప్రింట్ కాపీ/ఆర్టికల్స్ సమర్పించాలని తెలిపారు. టెలివిజన్, రేడియో ఎంట్రీలకు ప్రసారమైన కార్యక్రమం వ్యవధి, ఫ్రీక్వెన్సీ, మొత్తం ప్రసార సమయం వివరాలను సిడి, డివిడి లేదా పెన్ డ్రైవ్ ద్వారా సమర్పించాలని తెలిపారు. ఆన్‌లైన్/సోషల్ మీడియా పోస్టులు, బ్లాగ్‌లు, ట్వీట్‌లు, లేదా ఇతర సోషల్ మీడియా ప్రచారాల సమీక్షను, వాటి ప్రభావం వివరాలతో పిడిఎఫ్ సాఫ్ట్ కాపీ/వెబ్ అడ్రస్ లింక్/ఆన్లైన్ యాక్టివిటీ వివరాలు సమర్పించాలని సూచించారు. 2024 సంవత్సరం లోనే ప్రసారం, ప్రచురణ లేదా ఆన్‌లైన్‌లో పోస్టు చేయబడాలని, ఇతర భాషలలో సమర్పించినట్లైతే ఆంగ్ల అనువాదం తప్పనిసరి అని తెలిపారు. ప్రతి ఎంట్రీకి సంస్థ పేరు, చిరునామా, టెలిఫోన్, ఫ్యాక్స్ నంబర్లు, ఈమెయిల్, తదితర పూర్తి వివరాలతో 10 డిసెంబర్ 2024లోగా పంపాలని పేర్కొన్నారు. ప్రతి ఎంట్రీని ప్రచారం నాణ్యత, సరికొత్త ప్రచార పద్ధతులు, ప్రజలపై సాధించిన ప్రభావం వంటి అంశాల ఆధారంగా ఆమోదిస్తారని తెలిపారు.

బీసీతో పాటు అన్ని కులాల గణన చేపట్టాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్: బిసి కులగణనతో పాటు అన్ని కులాల జనాభా లెక్కలు వెంటనే చేపట్టాలని బహుజన్ రిపబ్లికన్ సోషలిస్ట్ పార్టీ (బిఆర్ఎస్పి) రాష్ట్ర అధ్యక్షులు పుట్టా పద్మారావు డిమాండ్ చేశారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన బిఆర్ఎస్పి రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సి గణాంకాలను శాస్త్రీయంగా చేపట్టాలని, ముస్లిం వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు-24ను వెంటనే నిలిపివేయాలని కోరారు. ప్రభుత్వాల వ్యతిరేక విధానాలతో పేదలు బిచ్చగాళ్లుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. నిరుద్యోగం, ధరల పెంపుతో ప్రజల్లో అభద్రతా భావం ఏర్పడిందని, అయినా ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. జాతీయస్థాయిలో రాజకీయ ప్రత్యామ్నాయానికి బహుజన ఉద్యమం నిర్వహించాలని పిలుపునిచ్చారు.ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎంఎఫ్ గోపినాథ్, ప్రొఫెసర్ లు వెంకటాసు, అన్వర్ఖాన్, హైకోర్టు న్యాయవాది ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజల కడుపుకొట్టే పని పెట్టుకున్న ప్రతిపక్షాలు : ఎంపీ చామల

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కష్టాలను తీర్చే ప్రయత్నాలు చేస్తుంటే ప్రతిపక్షాలు మాత్రం ప్రజల కడుపు గొట్టే విదంగా కార్యక్రమం చేస్తూ సోషల్ మీడియాలో ప్రభుత్వం పై విష ప్రచారం చేస్తున్నాయని ఎంపీ.చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దక్షిణ కోరియా రాజధాని సీయోల్ నగరం లో ఉన్న కొన్ని నదులను పునరుజ్జీవం చేసిన విధానాన్ని రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు అధికారులతో పాటు అయిదు రోజుల పర్యటన ముగించుకొని పిల్లాయిపల్లి మూసి రైతుల అవగాహన యాత్ర కార్యక్రమానికి శనివారం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి (మ) పిల్లయిపల్లి నుంచి మక్తా అనంతరం వరకు మూసి ప్రక్షాళన చేయాలని రైతులు, కులవృత్తి దారులు మహిళలు, పార్టీలకు అతీతంగా కార్యకర్తలు నాయకుల తో కలిసి మూసి బ్రిడ్జి మీద అవగాహన యాత్రలో పాల్గొన్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టుకు డీపీర్‌లు లేకుండా కట్టి ఆగం చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని ఆరోపించారు. మూసి నదిని పీపీపీ ప్రైవేట్ పబ్లిక్ ప్రాపర్టీ ద్వారా ప్రక్షాళన చేసి నదికి ఇరువైపులా శాపింగ్ మాల్స్ కట్టాలి అనే ఉదేశ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని స్పష్టం చేశారు. హైదరాబాద్,రంగారెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లాల ప్రజల యొక్క మురికి నీళ్ల కష్టాల్ని తీర్చాలని మేము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. మూసి నది మీద ఉన్న ప్రజలు, చేతి వృత్తుల వారు మురికి కూపంలో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లాంటి వారికి డబుల్ బెడ్ రూమ్లు ఇచ్చి, వారిని మురికి కూపం నుంచి రక్షణ కల్పిస్తామని ప్రభుత్వం చేస్తుంటే, ప్రతిపక్షాలు మురికి ప్రచారం చేస్తున్నాయి ప్రజలు వారి విష ప్రచారం తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్‌లు, ఎంపీ ఈటల రాజేందర్ ఇక్కడనేమో రాజకీయం, ఢిల్లీలో గొప్పలు చెప్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ గంగా నది ప్రక్షాళన చేస్తే గొప్ప కార్యక్రమం కానీ మా ప్రభుత్వం తెలంగాణలో మూసి నది చేస్తే తప్పు అని ప్రశ్నించారు. దక్షిణ కొరియా రాజధాని సీయోల్ నగరంలో ఉన్న నదులు వాటి ప్రక్షాళన చేసిన విధానం, వేస్ట్ చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి తదితర వనరుల పునర్వినియోగంపై అక్కడి రివర్ ఫ్రంట్ అధికారులతో చర్చలు సమావేశాలు చేశామన్నారు. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా వ్యర్థాలను పునర్వినియోగం లోకి తెచ్చే అద్భుత సాంకేతిక పరిజ్ఞానం సీయోల్ లో వినియోగిస్తున్నారన్నారు. సీయోల్ నగరం నడిబొడ్డు నుండి ప్రవహించే చెంగిచియాన్ నది హైదరాబాద్ మధ్యలో ప్రవహించే మూసీ నది లాగా ఒకప్పుడు మురికిమయంగా ఉండేదని పేర్కొన్నారు. ఆ నదికి పునరుద్యోగం పోశారని, నేడు అత్యంత సుందర నగరంగా సియోల్ మారిందని, తలపెట్టిన ముసి నది ప్రక్షాళనతో హైదరాబాద్ నగరం కూడా మరో సియోల్ నగరంగా మారనుందని అన్నారు. నాడు మూసి నదికి ఉన్న పరిస్థితి ఏమిటో మన తండ్రులకు తాతలకు తెలుసు, వెనుకటి రోజులలో ఈ మూసీ నది నీళ్లు త్రాగే వారట అంటూ చెపుకొచ్చారు. అట్లాంటి మూసీ నది నీళ్లను నేడు మూగజీవాలు కూడా తాగే పరిస్థితి లేదు, మూసీ నది పరివాహక ప్రాంతంలో పండినటువంటి పంటను అమ్ముకునే పరిస్థితి లేదు, కొనేవాళ్ళు లేరు,తినే పరిస్థితి లేదన్నారు. మూసీ నదిలో ఉన్నటువంటి చేపలను కూడా అమ్ముకునే పరిస్థితి లేదు తినే పరిస్థితి లేదన్నారు. పరివాహక ప్రాంతాలలో ఉన్నటువంటి కొన్ని గ్రామాలలో కూడా గొర్రెలకు, గేదెలకు సూడి నిల్వక సంతాన ఉత్పత్తి తగ్గినటువంటి పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. భావితరాలకు రక్షణగా ఉందాం, వారిని కాపాడుకుందామన్నారు. కాబట్టి మీ రైతులందరికీ విన్నపం చేస్తున్న మూసి ప్రక్షాళన చేయాలంటే మీ సపోర్ట్ అవసరం ఉంది పరివాహక రైతులందరూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి మూసి నది ప్రక్షాళనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ అధ్యక్షులు అండెం సంజీవ రెడ్డి, భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లాలోని ముఖ్య నాయకులు, భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు, మహిళ రైతులు, మూసీ నదిపై ఆధారపడి జీవనం సాగించే చేతువృత్తుల వారు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం: మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, ఈ వివాహాలు బాలికల జీవితాలపై తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతాయని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె బాల్య వివాహాలపై అవగాహన కల్పించేందుకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల అమ్మాయిల జీవితాలు నాశనమవడమేగాక సమాజంపై ఆ ప్రభావం ఉంటుందని తెలిపారు. బాల్య వివాహం చేసుకున్న వారే కాకుండా, అలాంటి వివాహాలకు మద్దతు తెలిపిన వారు, పాల్గొన్న వారు శిక్షార్హులవుతారని చెప్పారు. బాల్య వివాహంతో పేదరికం, ప్రసూతి మరణాలు, శిశు మరణాలు పెరుగుతాయని, అలాగే కుటుంబాల్లో నిరక్షరాస్యత, హింస మరింత పెరుగుతున్నాయని తెలిపారు. బాల్య వివాహాల్లో పాల్గొన్న తల్లిదండ్రులు, బంధువులు కూడా చట్టం ప్రకారం శిక్షార్హులవుతారని, ఈ వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మేయర్ అన్నారు.

పార్టీ సభ్యత్వంతో రూ.5 లక్షల ప్రమాద భీమా

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన సభ్యత నమోదు కార్యక్రమానికి మల్కాజిగిరి నుండి టిడిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో శనివారం తరలివెళ్లారు. మల్కాజిగిరి టిడిపి కోఆర్డినేటర్లు కరణం గోపి, వగ్గ చంద్ర శేఖర్‌రావు, పిట్ల రామకృష్ణ ముధీరాజ్, గొల్లగుడ శ్రీనివాస్, ఎస్.రమేష్, భాస్కరాచారి తదితరులు ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు వెళ్ళి పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి టిడిపి కోఆర్డినేటర్లు కరణం గోపి, వగ్గ చంద్రశేఖర్‌రావులు మాట్లాడుతూ మనం ఉన్న చోటు నుండే వెబ్‌సైట్ ద్వారా సభ్యత్వం తీసుకునే అవకాశాన్ని తెలుగుదేశం పార్టీ కల్పించిందన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల ప్రమాద భీమాను కల్పిస్తుందన్నారు. కార్యకర్తల కుటుంబలోని విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తుందని, అంతేకాక పార్టీ శ్రేణులు వారి కాళ్ళపై వారు నిలబడే విధంగా నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి ఉద్యోగాలను కూడ కల్పించే విధంగా పార్టీ కృషి చేస్తుందన్నారు.

ఇంటి వద్దకే టీజీఎస్ఆర్టీసీ కార్గో సేవలు : మంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తమ ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పెంచుకునేందుకు గాను లాజిస్టిక్స్(కార్గో) సేవలను టీజీఎస్ఆర్టీసీ మరింతగా విస్తరిస్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందులో భాగంగానే రాజధాని హైదరాబాద్‌లో వేగవంతమైన సేవలను అందించేందుకు హోం డెలివరీ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం (ఈ నెల 27) నుంచి హైదరాబాద్ లోని 31 ప్రాంతాల నుంచి హోం డెలివరీ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ సెంటర్స్ నుంచి హైదరాబాద్ లో ఎక్కడికైనా హోం డెలివరీ చేయవచ్చని చెప్పారు. రాబోయే రోజుల్లో ఇంటి నుంచి ఇంటి వరకు సేవలు అందించేలా లాజిస్టిక్స్ విభాగాన్ని టీజీఎస్ఆర్టీసీ అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ప్రజలందరూ హోం డెలివరీ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని వినియోగదారులను మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

పార్శిళ్ల హోం డెలివరీ చార్జీలివే : 0 నుంచి 1 కేజీ పార్శిల్‌కు రూ.50, 1.01నుంచి 5 కేజీలకు రూ.60, 5.01 నుంచి 10 కేజీలకు రూ.65, 10.1 నుంచి 20 కేజీలకు రూ.70, 20.1 నుంచి 30 కేజీలకు రూ.75, 30.1 కేజీలు దాటితే.. పైన పేర్కొన్న స్లాబ్‌ల ఆధారంగా ధరలు ఉంటాయి.

రోడ్డు నిర్మాణ ప్రాజెక్టులకు

అటవీ అనుమతుల సాధనలో నిర్లక్ష్యానికి తావు లేదు

మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్ర ప్రగతికి జీవనాడులైన రహదారుల నిర్మాణం, అటవీ అనుమతులు లేక ఆగిపోతే అది రాష్ట్ర ప్రజల అభివృద్ధికి, జీవన ప్రమాణాల పెంపుకు ఆటంకంగా మారుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం డా.బీ.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఛాంబర్‌లో అటవీశాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి అటవీ అనుమతులపై రివ్యూ నిర్వహించిన మంత్రి అటవీ అనుమతుల సాధనలో ఆలస్యంపై ఇద్దరు మంత్రులు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 5 సంవత్సరాలుగా 7 రోడ్డు ప్రాజెక్టు పనులు, 4 సంవత్సరాలుగా 1 ప్రాజెక్టు, 3 సంవత్సరాలుగా 20 ప్రాజెక్టులు, గత సంవత్సర కాలంగా 31 ప్రాజెక్టులు అటవీ అనుమతులు లేక ఆగిపోయాయని అన్నారు. ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేసే ఇలాంటి రహదారులు అటవీ అనుమతులు లేక ఆగిపోవడం బాధాకరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఐదేండ్లుగా ఇన్ని అనుమతులు పెండింగ్ లో ఉంటే ఇరు శాఖల అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి రాష్ట్ర ప్రగతికి ప్రతిబంధకంగా మారడం దారుణమని ఇద్దరు మంత్రులు అన్నారు. జరిగిందేదో జరిగిందని.., ఇక నుంచైనా మరింత కృషి చేసి అటవీ అనుమతులు సాధించాలని తెలిపారు. అంతేకాదు, అటవీ అనుమతుల సాధనను పర్యవేక్షించేందుకు ఆర్ అండ్ బీ శాఖ పరిధిలో ఎస్‌ఈ స్థాయి అధికారిని ప్రత్యేకంగా నియమిస్తామని మంత్రి కొండా సురేఖకు తెలిపారు. కేంద్రం నుంచి అనేక రోడ్లకు అనుమతులు సాధించినప్పటికి అటవీ అనుమతులు లేక ఆగిపోవడంతో.. కొత్త రోడ్ల మంజూరీ గురించి ఆడగడం ఇబ్బందిగా మారిందని రాష్ట్రానికి మరిన్ని జాతీయ రహదారులను మంజూరీ చేయించాలంటే ముందు మంజూరీ అయిన రోడ్లను నిర్మించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ డిఎఫ్‌ఓల స్థాయిలో ఉన్న 11 అటవీ అనుమతుల ఫైళ్ల ఆలస్యంపై అధికారులను మంత్రి ప్రశ్నించారు. అటవీ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ఫైళ్ల క్లియరెన్స్‌లో అనవసర ఆలస్యం లేకుండా ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి హామి ఇచ్చారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తనకున్న పరిచయాలతో రాష్ట్రానికి అనేక రోడ్లను మంజూరీ చేయిస్తున్నారని, అందుకు అనుగుణంగా అటవీ శాఖ నుంచి మరింత సహకారం అందించాల్సిన బాధ్యత మన భుజాలపైనే ఉందని అటవీ అధికారులకు ఆమే సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ అండ్ బీ అటవీ అనుమతులను కోఆర్డినేట్ చేసేందుకు అటవీ శాఖ నుంచి ఒక ప్రత్యేక అధికారిని నియమించడంతో పాటు ఫైళ్ళ క్లియరెన్స్ ఆలస్యం కావడానికి గల కారణాలను డిఎఫ్‌ఓల నుంచి వివరణ తీసుకోవాలని పిసిసిఎఫ్ డోబ్రియాల్‌ను ఆదేశించారు. తన కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న 4 రోడ్డు ప్రాజెక్టు పనులకు సంబంధించిన అటవీశాఖ అనుమతుల ఫైళ్లను ఈ రోజే క్లియర్ చేస్తానని ఆమే తెలిపారు. రాష్ట్రానికి సంబంధించిన రోడ్డు ప్రాజెక్టుల అటవీ అనుమతులను పర్యవేక్షించే కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ శాఖ రీజినల్ ఆఫీసర్ త్రినాథరావు రాష్ట్రానికి సంబంధించిన అటవీ అనుమతుల ఫైళ్లను చిన్న చిన్న అంశాలపై వివరణలు అడుగుతూ కావాలని కాలయాపన చేయడం పట్ల సమావేశంలో ఇరువురు మంత్రులు ఆవేదనవ్యక్తం చేశారు. గాయత్రి యాజమాన్యం కూడా మంత్రి ఆదేశాలను పాటిస్తామని తెలిపారు. ఈ సమీక్షలో ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, అటవీశాఖ ప్రధాన కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, ప్రత్యేక కార్యదర్శి రెవెన్యూ (డిజాస్టర్ మెనేజ్ మెంట్) హరీష్, పీసీసీఎఫ్ డోబ్రియాల్, ఈఎన్సీ, సీఈ లతో పాటు మోర్త్ ఆర్‌ఓ కృష్ణప్రసాద్, ఇతర అటవీ, ఆర్ అండ్ బీ, ఎన్.హెచ్.ఏ.ఐ అధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికకు ప్రత్యేక యాప్‌ను రూపొందించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా ఉంటుందని, రాజకీయ పార్టీలు, ప్రాంతాలు అనే బేధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని తెలిపారు. లబ్దిదారుల ఎంపిక కోసం రూపొందించిన యాప్‌ను శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి పరిశీలించారు. ఈ యాప్‌లో ఒకటి రెండు మార్పు చేర్పులను మంత్రి సూచించారు. మంత్రి సూచనల ప్రకారం యాప్‌లో కొన్ని మార్పులు చేసి వచ్చే వారంలో యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొద్దిరోజుల్లోనే రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభిస్తామని, ఇందుకు కావలసిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలను దృష్టిలో పెట్టుకొని యాప్‌లో తెలుగు వెర్షన్ ఉండేలా చూడాలని సూచించారు. లబ్దిదారుల ఎంపిక నుంచి ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యే వరకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వీలైనంతవరకు వాడుకోవాలని సూచించారు. ఇల్లు లేని ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని, దీనిని దృష్టిలో పెట్టుకొని అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు.

జర్నలిస్టులు ఐక్యతతో హక్కులు సాధించుకోవాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కాప్రా : జర్నలిస్టులు ఐక్యతతో మెలిగి తమ హక్కులు సాధించుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం పదవీ బాధ్యతల స్వీకరణ శనివారం అణుపురం కమ్యూనిటీ హాలులో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఉప్పల్, కాప్రాలో ప్రెస్‌క్లబ్‌లకు సొంత భవనాలకు నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. టీయుడబ్లూజె- ఐజేయు రాష్ట్ర అధ్యక్షుడు కె.విరహత్ అలీ మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజ హితాన్ని కాంక్షిస్తూ సామాజిక స్పృహతో పనిచేస్తేనే ప్రజల ఆదరాభిమానాలు పొందుతారని తెలిపారు. కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, జె.ప్రభుదాస్, పన్నాల దేవేందర్ రెడ్డి, టీయుడబ్ల్యూజె రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పజ్జూరి పావనీ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి బిఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, బోదాసు లక్ష్మి నారాయణ, రహీం, సతీష్ బాబు, టియుడబ్ల్యూజె మేడ్చల్ జిల్లా అధ్యక్ష, గడ్డ మీది బాలరాజు గౌడ్, డి.వెంకట్రామ్ రెడ్డి, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉల్లోజు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వేముల శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. విజయ్ కుమార్, కోశాదికారి రుద్రగొని నర్సింగ్ గౌడ్, ఉపాధ్యక్షులు ఎండి. అక్బర్, నటరాజ్, జి.గోపాల్ గౌడ్, సురేష్, శ్రీనివాస్, బసంత్, ప్రశాంత్, కె. వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం

సచివాలయం వద్ద ఉద్రిక్తత, పోలీసులకు విద్యార్థులకు మధ్య తోపులాట, అరెస్ట్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే విద్యార్థులు చదువుకునేదెట్లని, ఫీజు బకాయిల విడుదలపై అనాడు సీఎం రేవంత్ రెడ్డి చెప్పింది ఏంది నేడు చేస్తున్న జాప్యం ఏంటని, రాష్ట్ర సర్కార్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతూ విద్యార్థుల పట్ల వివక్షతను చూపుతుందని ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.స్టాలిన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ మండిపడ్డారు. శనివారం ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ కార్యకర్తలు, విద్యార్థులు జిహెచ్ఎంసీ మున్సిపాలిటీ ఆఫీస్ నుండి ర్యాలీ ప్రదర్శనతో సచివాలయం ముట్టడికి వెళ్తుండగా బి.ఆర్.కే భవన్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసులకు, నాయకులకు తోపులాట జరిగింది. దీనితో నాయకులు బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆందోళన చేస్తున్న నాయకులను పోలీస్‌లు అరెస్ట్ చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ స్టాలిన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్‌లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావటానికి విద్యార్థుల పోరాటం వారి తల్లిదండ్రుల సహకారం ఉందన్న విషయం సిఎం రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజురీయింబర్స్మెంట్ నిధులు రూ. 7650 వేల కోట్ల రూపాయలు విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది విద్యార్థులు అనేక ఆర్థికపరమైన అవస్థలు ఎదుర్కొంటున్నారని, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తివిద్య కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు వివిధ రకాల ఎంట్రన్స్‌లలో మంచి ర్యాంకులు సాధించినప్పటికీ, ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలలో డబ్బులు కట్టి టీ.సి ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోలేక ఉన్నత చదువులను మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మొద్దు నిద్రను వీడి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను మొత్తం విడుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ ఇటికాల రామకృష్ణ, బానోత్ రాఘురాం, గ్యార క్రాంతి, రహమాన్, బరిగల వెంకటేష్, సి.రాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, చైతన్య, వంశీవర్ధన్ రెడ్డి, ముదిగొండ మురళీ, జేరిపోతుల జనార్ధన్, రామరావు వెంకటేష్, దత్తు రెడ్డి, పవన్ చౌహాన్, అంజి, యూనస్, హరీష్, శ్రావణి, పార్వతి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన కర్తవ్యం : ఎమెల్సీ

విశాలాంధ్ర- దుండిగల్ : ప్రజా సమస్యల పరిష్కారమే బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కర్తవ్యమని ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంఘ సభ్యులు శనివారం ఎమ్మెల్సీ శంభిపూర్ రాజుని ఆయన నివాస కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రాంతాల్లో స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్సీ శంభిపూర్ సానుకూలంగా స్పందించి సమస్యల వాటి సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత అతి త్వరలో వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

సదర్ సమ్మేళన మహోత్సవానికి కొలనుకి ఆహ్వానం

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్ : నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో పలు కాలనీల వాసులు శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి రానున్న సదర్ సమ్మేళన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కాగలరని ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ్ సంఘం ప్రెసిడెంట్ కుమార్ యాదవ్, సురేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, జగదీష్ యాదవ్, కుమార్ యాదవ్, జగన్ యాదవ్, రవీంద్ర యాదవ్, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా బీసీ కులగణన నిర్వహించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: తెలంగాణ రాష్ట్ర తరహాలోనే ఇక దేశవ్యాప్తంగా కూడా జాతి జనగణలో బీసీ కులగణనను చేపట్టాలని బీసీ కులగణనపై బిజెపి ప్రభుత్వం తమ వైఖరిని వెల్లడించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివిధ బీసీ సంఘాలు, కుల సంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ కులగనను చేస్తామని చెప్పి అధికారం లోకి వచ్చిన బిజెపి పార్టీ ఇప్పుడు పూర్తిగా విస్మరించిందని, జాతీ జనగణలో కులగనన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాష ప్రకారం పెంచాలని, సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేయాలన్నారు. కేంద్రంలోని గత పది సంవత్సరాల బిజెపి పాలనలో బీసీలకు తీవ్రని అన్యాయం చేస్తున్నారని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ కల్పించకుండా, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సభకు లేకుండా, బీసీ రిజర్వేషన్లను జనాభా దామాశా ప్రకారం పెంచకుండా అలాగే బీసీలపై క్రిమిలేరును విధించి అన్యాయం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగాల నోటిఫికేషనలలో బీసీలకు అన్యాయం జరగడానికి ప్రధాన కారణం బిజెపి పార్టీనే అని, ఆ పార్టీ దొడ్డిదారిన అక్రమంగా తీసుకొచ్చిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల మూలంగా బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకొచ్చిందే బిజెపి ప్రభుత్వమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన డీఎస్సీ పరీక్షలు, గ్రూప్-1 పరీక్షలే ఇందుకు నిదర్శనమన్నారు. కేంద్రం ప్రభుత్వం దేశవ్యాప్తంగా చేపట్టబోయే జాతీ జనగణాలో బీసీ కులగనన చేపట్టాలని లేని పక్షంలో త్వరలో జరగబోయే మహారాష్ట్ర, ఝూర్ఖండ్ ఎన్నికల్లో బిజెపి పార్టీకి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కుందారం గణేష్ చారి, కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రమ్ గౌడ్, ఎస్ దుర్గయ్య గౌడ్, గూడూరు బాస్కర్, సంధ్య, శంకర చారి, సందీప్ ముదిరాజ్ పాల్గొన్నారు.

డ్రాపవుట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్టేమిఫయింగ్ ప్రాజెక్టు కృషి

విశాలాంధ్ర - పటాన్ చెరువు : ప్రభుత్వ పాఠశాలలో డ్రాప్ అవుట్ అవుతున్న విద్యార్థులను గుర్తించి ఆయా విద్యార్థులకు విద్యాభ్యాసం చేయించడానికి విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్టెమ్మిఫైఇంగ్ ప్రాజెక్టు చైర్మన్ సాయి వైట్కనవి రెడ్డి స్పష్టమైన ప్రణాళికను రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. శనివారం పటాన్‌చేరు పారిశ్రామికవాడలోని వీర్కో కెమికల్స్ పరిశ్రమలో స్టేమిఫయింగ్ ప్రాజెక్ట్ చైర్మన్ సాయి వైనవి రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని అన్వర్ ఉలూమ్ బి ఫార్మసీ కళాశాల సుమారు వంద మంది విద్యార్థులకు సాంకేతిక విజ్ఞాన పర్యటనను నిర్వహించారు. పరిశ్రమలోని ముడి పదార్థాల వాడకం నూతన ఉత్పత్తుల ప్రాసెసింగ్ కార్మికుల భద్రత రసాయన పరిశ్రమలలో యాజమాన్యాలు తీసుకుంటున్న కట్టుదిట్టమైన భద్రత చర్యలు, క్వాలిటీ కంట్రోల్, ప్యాకింగ్ తదితర అనేక అంశాలపైన పరిశ్రమలో విద్యార్థులకు సాంకేతిక విజ్ఞాన చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా స్టేమిఫయింగ్ ప్రాజెక్టు చైర్మన్ సాయి వైట్కనవి రెడ్డి మాట్లాడుతూ నేడు సమాజంలో మహిళలు అన్ని రంగాలలో దూసుకుపోతున్నారని అన్నారు. ప్రధానంగా పాఠశాల దశ, కాలేజీ దశల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు అర్ధాంతరంగా చదువులు మానివేస్తున్నారని అనేక కారణాల దృష్ట్యా పెద్ద ఎత్తున డ్రాప్ అవుట్ అవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల డ్రాప్ అవుట్స్ నివారించడానికి తమ సంస్థ ఇప్పటికే అనేక రకాల చర్యలు ప్రారంభించిందన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తే పటాన్ చెరువు పారిశ్రామిక వాడాలని అనేక పరిశ్రమలలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. ఆయా పరిశ్రమలలో బీఫార్మసీ విద్యార్థులకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉందన్నారు. విద్యార్థులు అకుంఠిత దీక్షతో పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసిస్తే అద్భుతాలు సాధించగలుగుతారని డ్రాప్ అవుట్ విద్యార్థులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించి తిరిగే విద్యాభ్యాసాన్ని అభ్యసించేందుకు తమ ప్రాజెక్టు కృషి చేస్తుందని అలాంటి విద్యార్థులు హైదరాబాద్ పరిసరాల్లో ఎక్కడ ఉన్నా అలాంటి వారిని చేరదీయడానికి ముందుంటామని తెలిపారు. వీరికో పరిశ్రమ హెచ్ ఆర్ మేనేజర్ సుబ్బారెడ్డి, అన్వర్ లూమ్ కళాశాల బీఫార్మసీ ప్రొఫెసర్ డాక్టర్ సయ్యద్ సఫివుల్లా ఘోరీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మూసీ నది పునరుజ్జీవన యాత్రలో పాల్గొన్న నేతలు

విశాలాంధ్ర - మేడిపల్లి : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ నది పునరుజ్జీవన ప్రజా చైతన్య యాత్ర పిలుపు మేరకు శనివారం మేడ్చల్ నియోజకవర్గ టీపీసీసీ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వజ్రేష్ యాదవ్ ఆదేశాలతో పీర్జాదిగూడ మున్సిపల్ మేయర్ అమర్ సింగ్ ఆధ్వర్యంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పెద్ద ఎత్తున పిలాయిపల్లి తరలివెళ్లడం జరిగింది. టీపీసీసీ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి సమక్షంలో ఘట్కేసర్ మండల హయత్‌నగర్ మండల్‌కి సంబంధించి వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన రైతులకు మహిళ రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు అధ్యక్ష కార్యదర్శులు, మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళ నాయకురాలు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్: ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను చంపేందుకు బీజేపీ లోతైన కుట్ర పన్నుతోందని, అందులో భాగంగానే అయనపై బీజేపీ యువ మోర్చ గుండాలతో దాడి చేయించిందని ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. అరవింద్ కేజ్రీవాల్‌పై దాడిని నిరసిస్తూ ట్యాంక్ బండ్, అంబెద్కర్ విగ్రహం వద్ద శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ నిరసన ప్రదర్శన నిర్వహించింది. ఆప్ కార్యకర్తలు జెండాలు, ప్లకార్డులు చేతబూని అరవింద్ కేజ్రీవాల్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. దిడ్డి సుధాకర్ మాట్లాడు తూ ద్వేషం, శత్రుత్వం, హింసతో కూడిన రాజకీయాలు బీజేపీ చేస్తుందని మండిపడ్డారు. కేజ్రీవాల్‌ను ఇబ్బంది పెట్టేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు అన్ని విఫలమయ్యాయని, అందుకే, అతని పాదయాత్రలో అతనిపై ఘోరమైన దాడికి ప్రణాళిక చేయబడిందన్నారు. ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, మజీద్, సోలొమన్ రాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, నర్సింగ్ యమునా గౌడ్, అధికార ప్రతినిధులు జావీద్ షరీఫ్, అప్సు సలాం, కాలిం బాబా, నేతలు శివాజీ, కొడంగల్ శ్రీనివాస్, ఇస్మాయిల్, రాకేష్ సింగ్, సుధారాణి, మౌనిక పాల్గొన్నారు.

జర్నలిస్టుల స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి పూర్తి సహకారం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: తెలంగాణ పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీని శనివారం శేరిలింగంపల్లి మండల జర్నలిస్టులు కలిశారు. శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా స్థాయి జర్నలిస్టు నాయకులతో కలిసి ఎమ్మెల్యేను కలిసిన జర్నలిస్టులు తమ ఇళ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే గాంధీ సహకారంతో గతంలో చందానగర్ లోని సర్వే నెంబర్ 174లో కేటాయించిన 1 ఎకరం స్థలంలో జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు సహకరించాలని, ఈ స్థలం పక్కనే ఉన్న సర్వే నెంబర్ 152లో మరో 1ఎకరా స్థలాన్ని జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం మంజూరీ చేసే విధంగా ఎమ్మెల్యే గాంధీ చొరవ తీసుకోవాలని కోరారు. టీయూడబ్ల్యుజే రాష్ట్ర కార్యదర్శి పైళ్ల విట్టల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సాగర్ ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేతో సమావేశమై ఇళ్ల నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా శేరిలింగంపల్లిలో జర్నలిస్టులుగా పనిచేస్తూ సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టుల కోసం ఎమ్మెల్యే గాంధీ సహకారంతో చందానగర్ లోని సర్వే నెంబర్ 174లో ఎకరం భూమిని ప్రభుత్వం కేటాయించిందని అన్నారు. జర్నలిస్టులకు కేటాయించిన భూమిలో ఎమ్మెల్యే గాంధీ చేతుల మీదుగా గతంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. జర్నలిస్టుల ఇళ్ల కోసం కేటాయించిన భూమిలో ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు సహకరించాలని, భూమి కేటాయింపులో ముందుండి మంజూరు చేయించిన ఎమ్మెల్యే గాంధీ ఇళ్ల నిర్మాణంలో సైతం సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేసేందుకు చందానగర్ లో కేటాయించిన భూమిలో ఇళ్ల నిర్మాణం కోసం తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖంగా ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జర్నలిస్టు నాయకులు జగన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, అశోక్, వినయ్ కుమార్, బేగ్, కిషోర్ లతో పాటు శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, మండల పరిధిలోని జర్నలిస్టులు పాల్గొన్నారు.

రెడ్ రోజ్ షాపింగ్ మార్ట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్ రూరల్ : రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో జడ్చర్ల రోడ్డులో ఉన్న రెడ్ రోజ్ షాపింగ్ మార్ట్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సందర్శించారు. మార్ట్ నిర్వాహకులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. శంకర్ మాట్లాడుతూ వ్యాపార సంస్థలు మరింత అభివృద్ధిలో గణనీయమైన మార్పులతో ప్రజలకు నాణ్యమైన ధరలకు సరుకులు అందజేయాలని సూచించారు. ప్రతి చిన్న విషయానికి హైదరాబాద్‌కు వెళ్లకుండా హెూల్సేల్‌గా అతి తక్కువ ధరతో ఇక్కడ వస్తువులు సరుకులు అందిస్తే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంద న్నారు. పలువురు నిర్వాహకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానించడం జరిగింది. అనంతరం రెడ్ రోజ్ షాపింగ్ మార్ట్‌లో కొన్ని సరుకులను ఎమ్మెల్యే శంకర్ కొనుగోలు చేసి బిల్లును చెల్లించారు. రెడ్ రోజ్ షాపింగ్ మాల్ నిర్వాహకులు ఎండి.ఆసిఫ్ చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, చెల్లా శ్రీకాంత్ రెడ్డి, ఇబ్రాహీం, అగనూరు బస్వం, బాలరాజ్ గౌడ్, రఘు, అందే మోహన్, ముబారక్, హుస్సేన్, సయ్యద్ ఖదీర్, యాదగిరి యాదవ్, వెంకట్ రెడ్డి, ఇసాక్, రాజేష్, మహబూబ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే :

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో త్వరలో ప్రారంభించబోయే నూతన భవన నిర్మాణానికి సంబంధించిన పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. సాంకేతిక నిపుణులను కలుసుకున్న ఎమ్మెల్యే శంకర్ వారితో నిర్మాణానికి సంబంధించిన పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజేలో చేరిన సీనియర్ జర్నలిస్టులు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ సమక్షంలో శేరిలింగంపల్లికి చెందిన పలువురు సీనియర్ జర్నలిస్టు టియుడబ్ల్యూజేలో చేరారు. టిఎస్ యుడబ్ల్యూజే శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు కె. శ్రీనివాస్ గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శి అశోక్ యాదవ్‌లు జర్నలిస్టులతో కలిసి టియుడబ్ల్యూజేలో చేరారు. యూనియన్‌లో చేరిన వారిని టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ ప్రధాన కార్యదర్శి ఆస్కానీ మారుతి సాగర్‌లు కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమానికి టీయూడబ్ల్యూజే నిరంతరం కృషి చేస్తుందని అల్లం నారాయణ తెలిపారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పైళ్ల విట్టల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సాగర్, శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సాగర్, ప్రెస్ క్లబ్ మాజీ ప్రధాన కార్యదర్శి వినయ్ కుమార్, జర్నలిస్టులు శశిధర్ శాస్త్రి, మహేష్ కుమార్ చారి పాల్గొన్నారు.

రెనోవా సెంచరీ ఆంకాలజీ పింక్ వాక్ ప్రారంభించిన హైకోర్టు జడ్జి

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : ప్రపంచ వ్యాప్తంగా రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం, నివారణ, స్క్రీనింగ్ ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచడానికి అక్టోబర్ నెలను ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసంగా పాటిస్తారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసం పురస్కరించుకొని రెనోవా సెంచరీ హాస్పిటల్, రోడ్ నం.12, బంజారా హిల్స్, ప్రాంగణం నుంచి సిటీ సెంటర్, రోడ్ నం.1, బంజారా హిల్స్ వరకు నిర్వహించిన 3 కి.మీ వాక్‌ను ముఖ్యఅతిథిగా జస్టిస్ సూరేపల్లి నందా, తెలంగాణ రాష్ట్ర హైకోర్టు, జెండా ఊపి, బెలూన్స్ ని ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెనోవా క్యాన్సర్ సెంటర్ వారి స్పెషల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీ కూడా జస్టిస్ సూరేపల్లి నందా విడుదల చేశారు. రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు, వైద్యేతర సిబ్బంది, నర్సింగ్ పారా మెడికల్ సిబ్బంది ఈ వాక థాన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. జస్టిస్ సూరేపల్లి నందా మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ పట్ల అవగాహన కల్పించేందుకు వాక్‌ని నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళలలో వచ్చే క్యాన్సర్లలో రొమ్ము క్యాన్సర్ కేసులు ఇటీవల కాలంలో ఎక్కువగా కనిపిస్తున్నాయని పెద్ద, చిన్న వయసు అనే భేదమూ లేకుండా, అన్ని వయసుల వారిలో బయటపడుతోందన్నారు. డాక్టర్ శ్రీనివాస్ జూలూరి, చీఫ్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, రోబోటిక్ హైపెక్ సర్జన్, రెనోవా సెంచరీ హాస్పిటల్స్ మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే చాలా ప్రాణాలను కాపాడుకోవచ్చన్నారు. 40 ఏళ్ల వయసు నుంచి ఏటా ఒక్కసారి మామోగ్రామ్ పరీక్ష చేయించుకోవాలి. రవీంద్రనాథ్ గరగ, డాక్టర్ కె. శ్రీనివాసరావు, సీనియర్ కన్సల్టెంట్ హెడ్ ఆఫ్ రేడియేషన్ ఆంకాలజీ, డా. ఉదయకుమార్ పునుకొల్లు, సీనియర్ కన్సల్టెంట్ మెడికల్, హెమటో-ఆంకాలజిస్ట్, డా. అశ్విన్ పండిట్, కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, డాక్టర్ నిషిత్ వడ్డెబోయిన, కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్, డాక్టర్ జ్యోతి జొన్నాదుల, కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్, డా. ఎస్. అర్జున్, కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్, జహీర్ అహ్మద్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, బిజినెస్ డెవలప్ మెంట్, డి.దినేష్, వైస్ ప్రెసిడెంట్, కార్పొరేట్ సర్వీసెస్, సాయి బాబు, జనరల్ మేనేజర్, టి.సాయి కుమార్, కార్పొరేట్ సర్వీసెస్, వైద్యేతర సిబ్బంది, నర్సింగ్ పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ అనాగరిక పోకడలు

అరసం జాతీయ సదస్సులో కంచె ఐలయ్య

విశాలాంధ్ర-హైదరాబాద్: సనాతనధర్మం పేరుతో కేంద్రంలోని బీజేపీ సర్కార్... భారతదేశంలో పాలనను వందేళ్ల వెనక్కి తీసుకెళ్లిందని ఆచార్య కంచె ఐలయ్య అన్నారు. అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం (అరసం) అధ్వర్యంలో 'భారతదేశ ప్రజాస్వామ్యం-సామాజిక న్యాయం-సాహిత్యం' అనే అంశంపై శనివారం పంజాబ్ ఆర్ట్స్ కళాశాల సౌజన్యంతో చండీగఢ్‌లోని పంజాబ్ ఆర్ట్స్ కౌన్సిల్ కళాభవన్‌లో సదస్సు జరిగింది. సర్వీద హమీద్ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐలయ్య మాట్లాడుతూ... తరతరాలుగా భారత్ భూభాగంలో దళితులు అణచివేతకు గురయ్యారన్నారు. స్త్రీలపై వివక్ష పెరిగిందన్నారు. 1985లో ఆంధ్రప్రదేశ్‌లోని కారంచేడులో దళితులపై జరిగిన దాడిని కంచె ఐలయ్య గుర్తు చేశారు. దేశంలో ఉన్న బహుళజాతులను దృష్టిలో పెట్టుకుని కౌటిల్య, మనుధర్మశాస్త్రాలు ఆదర్శంగా కాకుండా వివిధ దేశాల రాజ్యాంగాల్లో పేర్కొనబడిన ప్రజల హక్కులన్నింటినీ క్రోడీకరించి అంబేద్కర్ రాజ్యాంగం రచించారన్నారు. ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం ఉచితంగా అందించాలని రాజ్యాంగంలో పేర్కొన్నప్పటికీ పాలకులు పెడచెవినపెడుతున్నారని ధ్వజమెత్తారు. కుమ్మరి, కమ్మరి, మంగలి తదితర కుల వృత్తుల ఔన్నత్యాన్ని పాఠ్యాంశాల్లో చేర్చలేదన్నారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే బీజేపీ పాలన అనాగరిక పోకడలను గుర్తుకు తెస్తుందని విమర్శించారు. బీజేపీ చెప్పినట్టు గోవును మాత్రమే పూజించడం సరికాదని, సర్వజీవులపై సమాన దృష్టి ఉండాలన్నారు. జాతి, మతం, కుల వివక్షకు గురిచేయకుండా అందరినీ సమానంగా చూడాలన్నారు. ముస్లింలపై పాలకులు వివక్ష చూపుతున్నారన్నారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... సనాతన వ్యవస్థలో ముస్లింలను ఎలా తప్పుదోవ పట్టిస్తున్నారో వివరించారు. ప్రస్తుతం లదాఖ్‌లో జరుగుతున్నది ఇదేనని తెలిపారు. మోదీ పాలనను విమర్శించినందుకు డాక్టర్ నరేంద్ర దబోల్కర్, గోవింద్ పన్సారీ, ఆచార్య ఎంఎం కుల్బుర్గి, రోహిత్ వేముల, గౌరీలంకేశ్, ఆచార్య జీఎన్ సాయిబాబాను ఎలా పొట్టనపెట్టుకున్నారో సోదాహరణగా వివరించారు. మరో ముఖ్య అతిథి ఊర్మిలేశ్ మాట్లాడుతూ... అప్రమత్తంగా ఉంటూ సర్వశక్తులొడ్డి పోరాడుతూ మతతత్వశక్తులను మట్టుబెట్టాలన్నారు. మరో అతిథి స్వర్ణజీత్ సనీ మాట్లాడుతూ... బీజేపీ పాలన అత్యంత ప్రమాదకరంగా మారిందని విమర్శించారు. ప్రధాన కార్యదర్శి సుఖ్‌దేవ్ సుర్సా మాట్లాడారు. సుర్జీత్ వందన సమర్పణ చేశారు. అరసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ పి.వీరాస్వామి, డాక్టర్ రాపోలు సుదర్శన్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర పత్రికను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: అభ్యుదయ సమాజ నిర్మాణానికి, ప్రజా సమస్యలను ప్రభుత్వాలకు చేరవేయటానికి కరదీపిక అయిన విశాలాంధ్ర దినపత్రికను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ తూర్పు గోదావరి జిల్లా నుంచి రాజమండ్రి జట్ల లేబర్ యూనియన్ 48, సీపీఐ నగర కమిటీ 12 మొత్తం 60 సంవత్సర చందాలను సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ చేతుల మీదుగా సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వారికి అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పత్రికను ప్రజలకు చేరువ చేయటంలో సీపీఐ నాయకులు భాగస్వాములు కావాలని సూచించారు.

ప్రజా సమస్యలు వెలుగెత్తాలన్నారు. రాజమండ్రి జట్ల సంఘం అధ్యక్షులు కె.రాంబాబు, కార్యదర్శి సప్పా రమణ, పార్టీ నగర కార్యదర్శి వి. కొండలరావుకు ఈ సందర్భంగా తాటిపాక మధు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

దేశాభివృద్ధికి గిరిజన సంఘాల భాగస్వామ్యం కీలకం: ముర్ము

న్యూఢిల్లీ: దేశాభివృద్ధిలో గిరిజన సంఘాల భాగస్వామ్యం కీలకమని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. చత్తీస్‌గఢ్‌లోని ఐఐటీ భిలాయి కాన్ఫరెన్స్ వేడుకలో రాష్ట్రపతి శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మన గిరిజన సోదర, సోదరీమణుల సహజ జీవనశైలినే విజ్ఞాన భాండాగారం. వారి జీవనశైలిని నేర్చుకోవడం ద్వారా భారతదేశ స్థిరమైన అభివృద్ధికి మనం గణనీయమైన కృషి చేయవచ్చు. ముందు మన ఆదివాసీ సోదరులు అభివృద్ధిలో భాగస్వాములైనప్పుడే దేశ సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుంది' అని ఆమె అన్నారు. కొత్త కలలు, కొత్త విధానం, సరికొత్త సాంకేతికతలతో ఐఐటీ భిలాయి ప్రపంచవ్యాప్తంగా దేశానికి కీర్తిని తెస్తుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. ఆరు దశాబ్దాలుగా దేశంలోని ఐఐటీ విద్యార్థులు ప్రపంచ స్థాయిలో శాస్త్ర, సాంకేతిక రంగంలో తమదైన ముద్ర వేశారు. 21వ శతాబ్దంలో అంతర్జాతీయ కంపెనీలకు నాయకత్వం వహిస్తున్నారు. ఈ ఐఐటీని అత్యాధునిక బోధన, పరిశోధనా సౌకర్యాలతో అభివృద్ధి చేయడం అభినందనీయమని ముర్ము అన్నారు.

నాణ్యత లేని పాన్ డి, షెల్‌కాల్

న్యూఢిల్లీ: వైద్యులు ఎక్కువగా సిఫార్సు చేసే మందుల్లో నకిలీలు పుట్టుకొస్తున్నాయి. అవి నాణ్యతా పరీక్షల్లో విఫలమవుతున్నాయి. తాజాగా ఈ జాబితాలో పాన్ డి, షెల్‌కాల్ 500 చేరాయి. మరో 49 ఔషధ నమూనాలు కూడా ఉండాల్సిన స్థాయి నాణ్యత లేకపోవడాన్ని గుర్తించారు. వీటిలో పారాసిటమాల్, ఆక్సిటాక్సిన్, ఫ్లుకొనజోల్ మందులు ఉన్నాయి. మొత్తం మూడు వేల మందుల నమూనాలను పరీక్షిస్తే కేవలం 1.5శాతమే నాణ్యతా ప్రమాణాలతో ఉన్నట్లు కేంద్ర ఔషధ నియంత్రణ యంత్రాంగం వెల్లడించింది. అల్కెమ్ హెల్త్‌సైన్స్, అరిస్టో ఫార్మా, కెమీలా ఫార్మా, ఇన్నోవా కెప్టెన్, హిందూస్థాన్ యాంటీబయోటిక్స్, ఇప్కా ల్యాబరేటరీస్ కంపెనీల మందులు నాణ్యతా పరీక్షల్లో విఫలమైనట్లు తెలిపింది. ఆ మందుల్లో తమ్‌సులోసిస్ & డుటాస్టిరైడ్ ట్యాబ్లెట్స్ (యూరిమాక్స్ డి), క్యాల్సియం, విటమిన్ డి3 ట్యాబ్లెట్స్ ఐ.పి. (షెల్‌కాల్ 500), పాంటొప్రజోల్ గాస్ట్రో రెసిస్టెంట్ అండ్ డొంపెరిడోనె ప్రొలాంగ్డ్ రిలీజ్ క్యాప్సూల్స్ (పాన్ డి), నాండ్రోలోనె డికానోటె ఇంజెక్షన్ 25ఎంజీ/ఎంఎల్(డికా దురాబోలిన్) నాణ్యత పరీక్షల్లో విఫలమయ్యాయి. డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) రాజీవ్ సింగ్ రఘువంశీ మాట్లాడుతూ ప్రభావం చూపని మందులను గుర్తించేందుకు ఈ పరీక్షలను క్రమంగా నిర్వహిస్తామన్నారు. 3000 నమూనాలు పరీక్షించగా వాటిలో 49 మందులను రీకాల్ చేయాలన్నారన్నారు. కాగా, నాణ్యతా ప్రమాణాలు లోపించిన 50కుపైగా మందులను ఆగస్టులో విడుదల చేసిన జాబితాలో డ్రగ్ రెగ్యులేటరీ పేర్కొన్న విషయం విదితమే.

ధరల నియంత్రణేది?

- వంట నూనెలు సలసల
- బెంబేలెత్తిస్తున్న కూరగాయలు
- ఇప్పటికీ దిగిరాని ఉల్లి.. బియ్యం ధరలు సరేసరి!
- సమీక్షలతోనే సరిపెడుతున్న పాలకులు

న్యూఢిల్లీ: దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు టపాసుల్లా పేలుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలను బెంబేలెత్తిపోతున్నారు. అయినప్పటికీ పాలకులు నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదు. సమీక్షలతో పేరుతో హడావుడి చేస్తూ, ప్రజలను మభ్యపెట్టే తతంగమే కొనసాగుతోంది. ఇక తెలుగు రాష్ట్రాల్లో కూరగాయలు, వంట నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు ప్రజలను ఆర్థికంగా కుదేలు చేస్తున్నాయి. పాలకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు. దీపావళి పండుగ సమయంలో వంట నూనెల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో గృహ, రెస్టారెంట్ బడ్జెట్‌లు తారస్థాయికి చేరాయి. ప్రస్తుతం పండుగల సీజన్‌లో వంటనూనెల ధరలు భారీగా పెరిగాయి. గత నెలలో పామాయిల్ ధరలు 37 శాతం పెరగడంతో గృహ బడ్జెట్‌లను తీవ్రంగా ప్రభావితం చేసింది. ఫలితంగా వంట నూనెను ఉపయోగించే రెస్టారెంట్లు, హోటళ్లు, స్వీట్ షాపుల ఖర్చులను పెంచేసింది. గృహాలలో సాధారణంగా ఉపయోగించే ఆవనూనె ధర కూడా 29 శాతం మేర పెరిగింది. సెప్టెంబరులో రిటైల్ ద్రవ్యోల్బణం తొమ్మిది నెలల గరిష్ఠ స్థాయి 5.5 శాతానికి చేరుకోవడంతో కూరగాయలు, ఆహార పదార్థాల ధరల పెరుగుదల కారణంగా చమురు ధరలలో కూడా పెరుగుదల చోటుచేసుకుంది. ఈ పరిణామం ప్రస్తుతానికి భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలను తగ్గించింది. ప్రభుత్వం గత నెలలో ముడి సోయాబీన్, పామ్, సన్‌ఫ్లవర్ ఆయిల్‌లపై దిగుమతి సుంకాలను పెంచడంతో ధరల పెరుగుదలకు దారితీసింది. ముడి పామ్, సోయాబీన్, సన్‌ఫ్లవర్ నూనెలపై దిగుమతి సుంకాలు 5.5 శాతం నుంచి 27.5 శాతానికి, శుద్ధి చేసిన వంట నూనెపై 13.7 శాతం నుంచి 35.7 శాతానికి పెరిగాయి. ఇది సెప్టెంబరు 14 నుంచి అమలులోకి వచ్చింది. ఈ నూనెలు భారతదేశం వంట నూనెల దిగుమతులలో అధిక భాగాన్ని కలిగి ఉన్నాయి.

ఉల్లి దారి ఉల్లిదే!

ఇక ఉల్లిపాయల రిటైల్ ధరలు ప్రస్తుతం కిలో రూ.60, రూ.80 మధ్య ఉన్నాయి. దీపావళి పండుగ నాటికి అధిక స్థాయిలో ఉండవచ్చని అంచనా. పెరుగుదలకు ప్రధానంగా మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌తో సహా ప్రధాన ఉల్లిని ఉత్పత్తి చేసే రాష్ట్రాలలో భారీ వర్షపాతం కారణంగా పంటలు దెబ్బతిన్నాయి. ప్రధాన సరఫరా గొలుసులకు అంతరాయం ఏర్పడింది. నాసిక్‌లోని లాసల్‌గావ్ హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో ఉల్లి ధరలు నెల రోజులుగా రూ.45 నుంచి రూ.50 మధ్య నిలకడగా ఉన్నాయి. అనేక దక్షిణాది రాష్ట్రాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ఖరీఫ్ పంటల సాగుతో పాటు ధరలు తగ్గుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. అయినప్పటికీ, కొనసాగుతున్న భారీ వర్షాలు పంట నాణ్యతను ప్రతికూలంగా ప్రభావితం చేశాయి. పంట పొలాలు నీటితో నిండిపోయాయి. 10 నుంచి 15 రోజులు కోతలను ఆలస్యం చేయడం వలన సరఫరా మరింత దెబ్బతింటుంది. పెరుగుతున్న ధరలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం అదనపు నిల్వల నుంచి ఉల్లిపాయల రిటైల్ అమ్మకాలను ప్రారంభించింది. దక్షిణాది రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా కోతకు సిద్ధంగా ఉన్న ఉల్లి నాణ్యత గణనీయంగా దెబ్బతింది. కర్నూలుతో పాటు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉల్లి నాణ్యత బాగా తగ్గిపోయింది. ఉల్లిపాయలు, టమాటాలు, వంటనూనెల ధరలు పెరగడం వల్ల దేశ రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో ఐదేళ్ల కనిష్ఠ స్థాయి 3.65 శాతం నుంచి సెప్టెంబరులో తొమ్మిది నెలల గరిష్ఠ స్థాయి 5.49 శాతానికి చేరుకుంది. వినియోగదారుల ధరల సూచీలో కీలకమైన ఆహార ద్రవ్యోల్బణం ఆగస్టులో 5.66 శాతం నుంచి సెప్టెంబరులో 9.24 శాతానికి పెరిగింది.

భారత్‌కు విప్లవాత్మక వృద్ధి అవసరం

అంతరిక్ష ప్రయోగాలలో మస్క్ ప్రేరణ: సోమనాథ్

న్యూఢిల్లీ: అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే భారతదేశం విప్లవాత్మక పరివర్తన చెందాలని భారత అంతరిక్ష పరిశోధన మండలి (ఇస్రో) చైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. ఆర్థిక వృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి సాంకేతిక పురోగతి, ఉత్పత్తి అభివృద్ధి ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. కాగా, అంతరిక్ష రంగంలో వినూత్న కృషి చేస్తున్న టెక్నాలజీ దిగ్గజం ఎలాన్ మస్క్‌ను ఆయన ప్రశంసించారు. మస్క్ సాధించిన విజయాలు ఇస్రోతో సహా ప్రపంచ దేశాల ప్రయత్నాలకు స్ఫూర్తినిచ్చాయని అన్నారు. శనివారం దిల్లీలోని ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) 13వ స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి సోమనాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారతదేశం మూడవ, రెండవ లేదా మొదటి-అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని కోరుకుంటే విప్లవాత్మక మార్పు అవసరం. వృద్ధి కేవలం వాణిజ్యం, వనరుల ద్వారా నడపబడదు. ఉత్పత్తి అభివృద్ధికి శక్తినిచ్చే సాంకేతికతలో మనం విలువను సృష్టించాలి' అని తెలిపారు. మస్క్ గురించి సోమనాథ్ మాట్లాడుతూ తన తన సొంత రాకెట్లు ప్రయోగించడం ద్వారా అందరూ అటు వైపు చూసేలా చేశాడు. యూరప్ నుంచి రష్యా, చైనా వరకు అందరూ ఆయన ఏమి చేస్తున్నాడో చూస్తున్నారు. ఆయన అద్భుతమైన పని చేస్తున్న గొప్ప వ్యక్తి. ఆయన విజయాల నుంచి మనమందరం ప్రేరణ పొందాం' అని చెప్పారు. కాగా, అంతరిక్షంలో భారతదేశం ఇటీవలి సాధించిన పురోగతిని, ప్రయోగించిన విజయవంతమైన చంద్ర మిషన్లను ప్రత్యేకంగా ప్రస్తావించారు. వేగాన్ని కొనసాగించడానికి నిరంతర కృషి, ఆవిష్కరణలు అవసరమని ఇస్రో చీఫ్ సూచించారు. 'మనం ఐదవ-అతిపెద్ద ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా ఉన్న స్థాయికి చేరుకున్నాం. అయితే మరింత పైకి వెళ్లడానికి, మన సాంకేతికతను మనం నిర్మించుకోవాలి. మెరుగుపరచాలి. ప్రొపల్షన్, మెటీరియల్ సైన్సెస్, ఆర్బిటల్ డైనమిక్స్ వంటి రంగాలలో మన స్వంత నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి మనం కష్టపడి పని చేయాలి' అని తెలిపారు. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ రంగానికి ద్వారా తెరవడానికి ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కార్యక్రమాలను సోమనాథ్ ప్రశంసించారు. ఇది సరైన దిశలో ఒక అడుగు అని అన్నారు. 'ప్రైవేట్ పెట్టుబడులు అంతరిక్షంలో భాగస్వామ్యం ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించింది. ఇది అభివృద్ధి చక్రాలను వేగవంతం చేస్తుంది. ఖర్చులను తగ్గిస్తుంది. మన ప్రపంచ పోటీతత్వాన్ని పెంచుతుంది' అని అన్నారు. యువ ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు దేశాన్ని ముందుకు నడిపించే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించాలని, నిర్మించాలని సోమనాథ్ పిలుపునిచ్చారు. 'ప్రస్తుత జ్ఞానం, సాంకేతికత జీవితకాలం చాలా తక్కువగా ఉన్నందున మీరు మీ జీవితాంతం విద్యార్థిగా ఉండాలి. వినయంగా, నిజాయితీగా స్వీకరించడానికి సిద్ధంగా ఉండండి. ఇది మీకు ముందున్న సవాళ్లను అధిగమించడంలో సహాయపడుతుంది' అని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఐఐటీ దిల్లీ ఛాన్సలర్‌గా పనిచేస్తున్న దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రసంగించారు.

డీఎస్పీ సహా ఏడుగురు పోలీసులపై వేటు

చండీగఢ్: కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్‌ను జైల్లోనే ఇంటర్వ్యూ చేసేందుకు అనుమతిచ్చిన పోలీసులపై సస్పెన్షన్ వేటు పడింది. పంజాబ్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న లారెన్స్ బిష్ణోయ్ ఇంటర్వ్యూ తీవ్రస్థాయిలో దుమారం రేపింది. ఈ వ్యవహారంతో సంబంధమున్న వారిపై పంజాబ్ హోం శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. సస్పెండ్‌కు గురైన వారిలో ఇద్దరు డీఎస్పీలు సహా మొత్తం ఏడుగురు పోలీసులు ఉన్నారు. పంజాబ్ జైల్లో కస్టడీలో ఉన్న ఈ గ్యాంగ్‌స్టర్‌ను 2022 ఏప్రిల్ 3న ఓ టీవీ చానెల్ ఇంటర్వ్యూ చేసింది. అప్పట్లో ఇది తీవ్ర కలకలం రేపింది. సామాన్య ప్రజల నుంచి సైతం దీనిపై వ్యతిరేకత వచ్చింది. ఈ ఘటనపై పంజాబ్ హోంశాఖ చర్యలు తీసుకుంది. ఇంటర్వ్యూకు అనుమతిచ్చిన ఆనాటి డీఎస్పీ గురుషేర్ సింగ్‌తోపాటు మరో ఆరుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

టెస్టు సిరీస్ కివీస్ వశం

రెండో టెస్టులో భారత్ ఓటమి

స్కోర్లు:
న్యూజిలాండ్.. తొలి ఇన్నింగ్స్.. 259 ఆలౌట్
రెండో ఇన్నింగ్స్.. 255 ఆలౌట్
భారత్.. మొదటి ఇన్నింగ్స్.. 156 ఆలౌట్

పూణె: టెస్టుల్లో సొంతగడ్డపై తిరుగులేని ఆధిపత్యం చెలాయిస్తున్న టీమ్‌ఇండియాకు న్యూజిలాండ్ షాక్ ఇచ్చింది. పూణె వేదికగా జరిగిన రెండో టెస్టులో భారత్‌పై కివీస్ 113 పరుగుల తేడాతో విజయం సాధించింది. 359 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టు... 245 పరుగులకు ఆలౌటైంది. భారత బ్యాటర్లలో యశస్వి జైస్వాల్ (77) రాణించగా... మిగతావారు భారీ స్కోర్లు చేయలేకపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లతో చెలరేగిన మిచెల్ శాంట్నర్... రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లతో అదరగొట్టాడు. ఈ మ్యాచ్‌లో గెలుపుతో మూడు టెస్టుల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-0తో కైవసం చేసుకొని చరిత్ర సృష్టించింది. భారత గడ్డపై న్యూజిలాండ్ టెస్టు సిరీస్ గెలవడం ఇదే తొలిసారి. అంతేకాకుండా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ చరిత్రలో విదేశీ గడ్డపై కివీస్ టెస్టు సిరీస్ గెలవడం ఇదే మొదటిసారి. 2012 నుంచి స్వదేశంలో వరుసగా 18 టెస్టు సిరీస్‌లు సాధించిన టీమ్‌ఇండియా... పుష్కరకాలం తర్వాత సిరీస్ కోల్పోవడం గమనార్హం. మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబై వేదికగా ప్రారంభం కానుంది. రెండో ఇన్నింగ్స్‌లో 198/5 స్కోరుతో మూడో రోజు ఆట ప్రారంభించిన న్యూజిలాండ్ 255 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన 103 పరుగుల ఆధిక్యాన్ని కలుపుకొని భారత్‌కు 359 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన టీమ్‌ఇండియా 34 పరుగుల వద్ద రోహిత్ శర్మ (8) రూపంలో తొలి వికెట్ కోల్పోయింది. శుభ్‌మన్ గిల్ (23)తో కలిసి జైస్వాల్ నిలకడగా ఆడటంతో భోజన విరామ సమయానికి భారత్ 81/1 స్కోరుతో మెరుగైన స్థితిలో కనిపించింది. కానీ, రెండో సెషన్‌లో ఆరు వికెట్లు కోల్పోవడంతో భారత్ ఓటమి ఖాయమైంది. న్యూజిలాండ్ స్పిన్నర్ మిచెల్ శాంట్నర్... యశస్వి జైస్వాల్, గిల్, విరాట్ కోహ్లీ (17), సర్ఫరాజ్ ఖాన్ (9)లను ఔట్ చేసి భారత్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. రిషభ్ పంత్ (0) అనవసరంగా రనౌటయ్యాడు. చివర్లో రవీంద్ర జడేజా (42) పోరాడినా ఫలితం లేకపోయింది.

యశస్వి జైస్వాల్ రికార్డు

న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్టులో టీమ్ ఇండియా 113 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. 359 పరుగుల లక్ష్యఛేదనలో యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ (77బీ 65 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒక్కడే అర్ధ శతకం బాదాడు. ఈ ఇన్నింగ్స్‌లో మూడు సిక్స్‌లతో రికార్డు సొంతం చేసుకున్నాడు. టెస్టుల్లో ఒక క్యాలెండర్ ఇయర్‌లో 30 కంటే ఎక్కువ సిక్స్‌లు కొట్టిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు. అయితే 33 సిక్సులతో న్యూజిలాండ్ మాజీ ఆటగాడు బ్రెండన్ మెక్‌కల్లమ్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతడు 2014లో 33 సిక్సర్లు బాదాడు. ఈ ఏడాది ఇప్పటివరకు యశస్వి జైస్వాల్ 32 సిక్స్‌లు కొట్టాడు. ఈ యువ బ్యాటర్ మరో రెండు సిక్సర్లు బాదితే మెక్‌కల్లమ్ రికార్డును బ్రేక్ చేస్తాడు. న్యూజిలాండ్‌తో మూడో టెస్టులో అందుకు అవకాశం ఉంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.